
# జనబలం

ప్రజలే ప్రభువులు

జూన్ 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## విద్యా సంవత్సర ప్రారంభం
## స్కూల్ చదువుల నాణ్యతే కీలకం

## ఎమర్జెన్సీ @ 50 - పాఠాలు



## కులగణన - విశ్లేషణ



## భారత్ చర్చించాల్సిన 'అడాలసెన్స్'

# మోదీ నుండి ఒమర్, ఒవైసీ దాకా అందరూ బాధ్యతాయుతంగా స్పందించారు: జేపీ



జమ్మూకశ్మీర్ పహల్గాం పాశవిక ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం, సైన్యం, రాజకీయ వ్యవస్థ, కశ్మీర్ సహా ఆసేతుహిమాచలం ప్రజలు మతం, కులం, ప్రాంతం, భాష, తెగలకతీతంగా ఒక్కటిగా నిలిచి టెర్రరిస్టుల లక్ష్యాన్ని ఓడించారని ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జమ్మూకశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వ విధానం సత్ఫలితాలనిస్తుంటే పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రమూకలు ఓర్చుకోలేక పోయాయన్నారు.

'రాష్ట్రంలోని ప్రజలు ప్రజాస్వామిక ప్రక్రియలో భాగస్వాములుగా ఉన్నారు. పెట్టుబడులు పెరుగుతున్నాయి. మిగతా రాష్ట్రాల కంటే జమ్మూకశ్మీర్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో కశ్మీర్ ప్రజలను మిగతా దేశం నుంచి వేరు చేసేందుకు, ఇండియాలో పెద్ద సంఖ్యలో ఉన్న ముస్లింలు, మెజారిటీ హిందువుల మధ్య చిచ్చుపెట్టేందుకు పాక్ సైనిక చీఫ్, విదేశాంగ, రక్షణ మంత్రులు ద్విజాతి, ఇతర రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. కానీ ఎంత సంక్లిష్ట భిన్నత్వమున్నా.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి తీరం వరకూ భారత్ ప్రజలు ఐక్యతా సందేశం బలంగా, వెంటనే వినిపించారు. యూనియన్ ప్రభుత్వానికి, సైన్యానికి 145 కోట్ల మంది తరపున పోరాడుతున్నామన్న స్ఫూర్తినిచ్చారు.

'శాంతి, స్వేచ్ఛ, అభివృద్ధి తమ లక్ష్యాలని కశ్మీరీలు స్పష్టంగా చాటగా.. 'ఏకం సత్, విప్రా బహుదా వదన్తి ' అని 5,000కు పైగా సంవత్సరాల చరిత్రకి నిదర్శనంగా మొత్తం భారతదేశం నిలిచింది.

'మనం దాడి చేస్తామని పాకిస్థాన్ సైన్యానికి, ప్రభుత్వానికి స్పష్టంగా తెలిసినా, పక్కనే చైనా ప్రమాదం పొంచి ఉన్నా, ప్రపంచమంతా ఆచితూచి ప్రాంతీయ ధోరణులతో వ్యవహరిస్తున్నా.. భారత్ అనుకున్న రీతిలో, అనుకున్న చోట, అనుకున్న స్థాయిలో పాక్‌పై సైనిక చర్య తీసుకోగలిగింది. అయినా పాకిస్థాన్ వెనక్కి తగ్గకుండా, తప్పును దిద్దుకోకుండా దాడులకు తెగబడటంతో.. ఆ దేశంలోని ఏ ప్రాంతంలోనైనా దాడి చేయగలనని అక్కడి కీలక వైమానిక మౌలిక సదుపాయాల ధ్వంసం ద్వారా భారత్ నిరూపించింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా నిర్మూలించి తీరుతామని స్పష్టంగా తెలియ చేసింది. చివరికి నిరవధిక కాల్పుల విరమణకు పాక్ దిగివచ్చింది. ఇది తన ఘనతేనని అమెరికా అధ్యక్షుడు చెప్పటం మనం వినక తప్పదు గానీ.. ఆ స్థానంలో ఉన్న ట్రంప్ వ్యవహారశైలిని పట్టించుకోనక్కర్లేదు.

'మంచి ఉగ్రవాదం, చెడ్డ ఉగ్రవాదం అంటూ ఉండవని, ఉగ్రవాదం ఏ రూపంలో, ఏ మతం ముసుగులో ఉన్నా అందరికీ ప్రమాదకరమని పాకిస్థాన్ సహా ప్రపంచమంతటికీ అర్థమయ్యేలా చాలా నైపుణ్యంతో, నిబద్ధతతో, ఆధునిక రీతిలో భారత సైనిక చర్య, ప్రజల ఏకీభావం నిరూపించాయి. ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేయటం ఆపితేనే సింధూ నది నీళ్లు వదులుతామని, పీఓకే తప్ప కశ్మీర్ గురించి చర్చ ప్రసక్తే లేదని పాక్‌కు భారత్ స్పష్టం చేసింది. పీఓకే ద్వైపాక్షిక అంశం మాత్రమే అని ప్రపంచ దేశాలకు తేల్చి చెప్పింది. ఈ విషయాల్ని తెలియజెప్తూ, ఉగ్రవాద నిర్మూలనను ప్రపంచ ఎజెండాగా చేసేందుకు కీలక దేశాలకు అఖిలపక్ష బృందాల్ని పంపింది. ఉగ్రవాద దాడి జరిగితే ఇక మీద యుద్ధం కింద పరిగణిస్తామని, ఉగ్రవాద నిర్మూలనలో ఆపరేషన్ సిందూర్ నూతన ప్రమాణాలను ప్రవేశపెట్టిందని, ఇది ఇంతటితో ముగిసినట్టు కాదని పాక్‌కి, అమెరికా ప్రతినిధులకు ప్రధాని చాలా స్పష్టంగా తెలియచేశారు. ప్రభుత్వానికి అన్నిరకాలుగా ఒమర్ నుంచి అసదుద్దీన్ ఒవైసీ దాకా మద్దతు తెలిపి రాజకీయ పరిణతి ప్రదర్శించారు. ఈ రకంగా జాతి ప్రయోజనాలు లక్ష్యంగా పార్టీలు వ్యవహరిస్తాయని, కొవిడ్ వంటి మహమ్మారులపై చేసినట్లు అన్ని దేశాలూ ఉగ్రవాద నిర్మూలనకు కలసికట్టుగా పోరాడతాయని, భారత్ తన ఆర్థికాభివృద్ధి లక్ష్యాల్ని చేరుకుని వచ్చే పాతికేళ్లలో అభివృద్ధి చెందిన దేశమయ్యే కలను నెరవేర్చుకోగలదని ఆశిద్దాం' అని జేపీ పేర్కొన్నారు.

# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

జూన్ 2025

సంపుటి 26 సంచిక 06


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**




ఓడిపోవటమే మేలు సార్, గెలిస్తే వాగ్దానాలు తీర్చలేక చచ్చేవాళ్లం.


06 స్కూలు విద్యా నాణ్యత భారత్‌కి కీలక, తక్షణావసరం

10 సుప్రీంకోర్టు రాష్ట్రపతికి ఏ మేరకు పరిమితులు విధించవచ్చు?

15 అడాలసెన్స్ - పరిణతి ప్రజాస్వామ్యమే మార్గం

21 కులగణన..విశ్లేషణ

24 పోలీసు సంస్కరణల అవసరాన్ని, చాటుతున్న తెలంగాణ



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# భారత్ నేర్చుకోవాల్సిన ప్రజాస్వామ్య పాఠాలు !

భారత్‌లో ఎమర్జెన్సీ విధించి 2025కి యాభై ఏళ్లు పూర్తయ్యాయి. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అదో చీకటి అధ్యాయం. 1975, జూన్ 25 అర్ధరాత్రి నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అందుకు అవసరమైన మంత్రివర్గ ముందస్తు ఆమోదాన్ని తీసుకోలేదు. రాష్ట్రపతి ఎమర్జన్సీని ప్రకటించిన తర్వాతనే ఆ చర్యకు మంత్రివర్గం, పార్లమెంటు ఆమోదం తెలిపాయి. ఇది రాజ్యాంగ సూత్రాల ఉల్లంఘన. రాత్రికి రాత్రి ప్రతిపక్ష పార్టీలకు చెందిన లక్ష మంది నాయకులను, కార్యకర్తలను జైళ్లలో నిర్బం ధించారు. ఆ తర్వాత సుమారు 21 నెలలపాటు దేశంలో ప్రాథమిక హక్కులు సస్పెండ్ అయ్యాయి. పత్రికలపై సెన్సార్‌షిప్ అమలు అయ్యింది. న్యాయవ్యవస్థ అధికారాలను, రాష్ట్రాల అధికారాలను కుదిస్తూ 42వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. “రూల్ ఆఫ్ డిక్రీ” పేరిట ఇందిరాగాంధీ నేతృత్వంలోని కొందరు వ్యక్తుల బృందం సకల అధికారాలను చెలాయించింది. భారతీయ ప్రజాస్వామ్య సమాజానికి, రాజ్యాంగ స్ఫూర్తికి తీరని హాని జరిగింది.

ఈ విషయాలు నేటితరానికి తెలియవు. వర్తమానాన్ని అర్థం చేసుకోవడానికి, భవిష్యత్తును రూపకల్పన చేసుకోవడానికి చరిత్రను, రాజకీయ పరిణామాలను, వాటి పర్యవసానాలను అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత జీవితాన్ని, వ్యాపకాలనూ, సుఖసంతోషాలను చూసుకుంటూనే చుట్టూ ఉన్న సమాజాన్ని, పరిపాలనా విధానాలను పట్టించుకోవాల్సిన బాధ్యత పౌరులపై ఉంటుంది. అప్పుడే సమాజం ఆరోగ్యకరంగా వృద్ధి చెందు తుంది. అందువల్లనే యాభై ఏళ్ల క్రితం నాటి అత్యవసర పరిస్థితి పూర్వాపరాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దేశానికి స్వతంత్రం వచ్చిన పాతికేళ్లలోనే పాలకులు జాతీయోద్యమ ఆదర్శాల నుండి వైదొలిగారు. లైసెన్స్ – పర్మిట్ – కోటా రాజ్‌ను సృష్టించారు. దేశంలో పేదరికం, ప్రజాస్వామ్యంలో నియంతృత్వ ధోరణులు, పాలనలో అవినీతి పెరిగిపోయాయి.

1971లో ‘గరీబీ హటావో’ నినాదంతో శ్రీమతి ఇందిరాగాంధీ భారీ మెజారిటీతో ప్రధాని అయ్యారు గానీ పేదరికాన్ని తొలగించడంలో విఫలం అయ్యారు. ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించలేక పోయారు. ధరలు నిరుద్యోగం, పెరిగిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు ఎక్కువయ్యాయి. నాణ్యమైన పౌరసేవల్ని అందిం చలేకపోయారు. అందుకు అవసరమైన ఆర్థిక సంస్కరణలను, పాలనా సంస్కరణలను తీసుకురావడంలో పాలకులు విఫలం అయ్యారు. ఫలితంగా ప్రజలలో ముఖ్యంగా యువతలో అశాంతి ప్రబలింది.

తమ నిత్య జీవిత సమస్యలకు పరిష్కారాలను కోరుతూ వారు ఉద్యమించారు. దేశంలో సమ్మెలు,బంద్‌లు, హర్తాళ్లు, నిత్యకృత్యం అయ్యాయి. సంపూర్ణ విప్లవం పేరిట లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ప్రారంభించిన పోరాటం దేశవ్యాప్తంగా విస్తరించింది. లక్షలాది ప్రజలు అందులో భాగస్వాములు అయ్యారు. అయితే నాటి ప్రభుత్వం సమస్యల మూలాలను గుర్తించి వాటికి తగిన పరిష్కారాలు చూపే బదులు వెల్లువెత్తిన నిరసనలను అణచి వేయడానికి పూనుకున్నది.

ప్రతిపక్షాల ఆందోళనలను ఎదుర్కొనే క్రమం చివరికి దేశంలో ఎమర్జెన్సీ విధింపునకు దారి తీసింది. దాని తీవ్ర పర్యవసానాలను భారతీయ సమాజం అనుభవించాల్సి వచ్చింది. అప్పటికి వైద్యవిద్య అభ్యసిస్తున్న డా.ఎన్.జయప్రకాష్ నారాయణ్ వంటి యువకులు ఎందరో తమ చుట్టూ జరుగుతున్న పరిస్థితులను చూసి తీవ్రంగా కలవరం చెందారు. తమకు వీలైన పద్ధతుల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించారు!

1977లో జరిగిన ఎన్నికల్లో భారతీయ పౌరసమాజం తన అపారమైన రాజకీయ సంకల్పాన్ని, పరిణతిని, వ్యక్తీకరించింది. నియంతృత్వ పాలనకు చరమగీతం పాడింది. ఎంతటి నియంతలైనా ఓటర్ల నైతిక శక్తికి తలొగ్గక తప్పదని రుజువయ్యింది. అత్యవసర పరిస్థితి విధింపు, దాని పర్యవసానాలు దేశంలో ఎన్నో మార్పులకు దారి తీశాయి. ఎందరో యువనేతల మనసుల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమ బీజాలు అంకురించాయి. అలనాటి విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ఒక వైద్యునిగా, ఒక ఐ.ఎ.ఎస్. అధికారిగా, ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్),

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపకునిగా డా.జేపీ రూపొందడం వెనుక 1975 నాటి అత్యవసర పరిస్థితి ప్రభావం గాఢంగా ఉందని చెప్పాలి.

అత్యవసర పరిస్థితికి దారితీసిన అలనాటి "మౌలిక సంక్షోభం" ఇంకా కొనసాగుతూ ఉండటం డా.జేపీ వంటి వారికి ఆవేదన కలిగించింది. వారి మేధోమథనం నుండి లోక్‌సత్తా ఉద్యమం ఆవిర్భవించింది. లోక్‌సత్తా భావజాలం భారతీయ సమాజానికి చక్కని మార్గదర్శకత్వాన్ని అందించింది. అందుకు జేపీ తన వ్యక్తిగత జీవితాన్ని పణంగా పెట్టారు. ఎంతో మంది పౌర సమాజ కార్యకర్తలు, మేధావులు లోక్‌సత్తా ఉద్యమంలో భాగం అయ్యారు. భారతదేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా రూపొందాలన్న గొప్ప సంకల్పంతో వారంతా కృషి కొనసాగించారు. రాజకీయ వ్యవస్థలో కూడా అలాంటి సంకల్పాన్ని ప్రోది చేయడానికి వారు తపించారు. దేశానికి స్పష్టమైన , ఆచరణ సాధ్యమైన కార్యాచరణ ప్రణాళికను అందించారు. ఆమార్గంలో ఇప్పటికే కొన్ని మైలురాళ్ల లాంటి విజయాల్ని జేపీ, ఆయన సహచరులు సాధించారు.

ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకూ ఎలాంటి వివక్షలు లేకుండా ఎదిగే అవకాశాలను అందిస్తూ, నివారించ దగ్గ బాధలను తొలగించే వ్యవస్థ నిర్మాణానికి మార్గం చూపారు. మరోసారి దేశంలో ఎమర్జెన్సీ విధించే పరిస్థితులు పునరావృతం కాకుండా గట్టి ప్రజాస్వామ్య వ్యవస్థలు రూపొందాలనే కృత నిశ్చయంతో వారు కృషిచేశారు.ఎమర్జెన్సీపై విద్వేషపూరిత మాటల యుద్ధం చేసినంత మాత్రాన దేశంలో నెలకొన్న ప్రస్తుత సంక్షోభం పరిష్కారం కాదు. ఎమర్జన్సీ విధించిన కాలం నాటి అనుభవాల నుండి గుణపాఠాలు నేర్చుకోవాలి. రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య స్వభావాన్ని, వివిధ వ్యవస్థల మధ్య అధికార విభజనలో ఏర్పాటు చేసుకున్న సమతుల్యతను, అన్ని స్థాయిల్లో అధికార వికేంద్రీకరణతను బలోపేతం చేయడానికి వీలుగా పార్టీలు, పౌర సమాజం చర్చించి కార్యాచరణ అమలు చేయాలని లోక్‌సత్తా ఉద్యమం సూచిస్తున్నది.

మనదేశంలో పనిచేసే వారిలో 85% అసంఘటిత రంగంలో, జీవన భద్రత లేకుండా ఉన్నారు. దేశ జనాభాలో 65% గ్రామాల్లో బతుకుతున్నారు. వ్యవసాయం మీద 42% ప్రజలు ఆధారపడి ఉన్నారు. కానీ మన జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా 18% లోపే ఉంది. వ్యవసాయ రంగంలో కొన్ని మౌలిక విధానాలను అమలుచేస్తే రైతుల ఆదాయం పెరుగుతుందని లోక్‌సత్తా హేతుబద్ధంగా నమ్ముతోంది. అందుకోసం వ్యవసాయోత్పత్తుల స్వేచ్ఛా రవాణాపై నిషేధాలు ఎత్తివేయాలని లోక్‌సత్తా సూచించింది. గతంలో విధించిన నిషేధాల వల్ల రైతుల ఆదాయానికి గండి పడింది. లోక్‌సత్తా సాగించిన పోరాటంతోనే 2010లో బియ్యం ఎగుమతులపై నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. దాంతో రైతులు లాభం పొందారు. రష్యా – ఉక్రెయిన్ యుద్ధం పేరుతో 2023లో ప్రభుత్వం మరోసారి నిషేధం విధించింది.

అదేవిధంగా 2016 లో లోక్‌సత్తా కృషితో పామాయిల్ రైతుల ఆదాయం పెరగడానికి వీలు కలిగింది. పామాయిల్ దిగుమతులపై సుంకాన్ని విధించి కొంత డబ్బు రైతులకే ఇవ్వటంతో మన పామాయిల్ పంటకు రేటు వచ్చింది. మళ్లీ అంతర్జాతీయ పరిణామాలంటూ సుంకం సగానికి సగం తగ్గించారు. పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చే రిఫైన్డ్ ఆయిల్ మీద మాత్రం సుంకం 40% దాకా కొనసాగిస్తూ వారి లాభాలకు ఢోకా లేకుండా చేశారు. ముడి పామాయిల్ మీద సుంకం ఇటీవల సగానికి సగం తగ్గించారు. ఇటు రైతులను, అటు లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన వంటనూనెల దిగుమతి ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం చేస్తున్నారు. అటు రైతులు ఇటు వినియోగదారులు నష్ట పోతున్నారు.ఆర్థిక క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం, చట్టబద్ధ పాలన, చిన్న పట్టణాల అభివృద్ధి వంటి అంశాలనూ ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ఎమర్జెన్సీ విధించి యాభై ఏళ్ళు పూర్తయిన సందర్భంగానైనా ప్రస్తుతం భారత్‌లో కొనసాగుతున్న మౌలిక సంక్షోభానికి పరిష్కారం సాధించాల్సిన అవసరం ఉంది. అందుకు వీలుగా ప్రభుత్వమూ, అన్ని రాజకీయ పక్షాలూ చట్టసభల్లో తగిన నిర్మాణాత్మక చర్చ చేయాలి. పౌరసమాజం కూడా దీనిపై లోతయిన చర్చ జరపాలి. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు, సంప్రదాయాలు బలోపేతం కావాలి. అందుకు లోక్‌సత్తా ఉద్యమం దేశం ముందుంచిన సంస్కరణల అజెండా ఒక ఆధారం కావాలి. వ్యక్తుల లేదా కొందరు వ్యక్తుల బృందాలు తీసుకునే దుస్సాహస విధానాలకు జాతి భవితవ్యం బలి కాకుండా పౌరసమాజం అప్రమత్తంగా ఉండాలి. ఎమర్జన్సీ నుండి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం అదే.

# విద్యా సంవత్సరం ప్రారంభం –
# స్కూలు చదువుల నాణ్యత భారత్‌కి కీలక, తక్షణావసరం

– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ –



ఒక దేశంగా మనకున్న అతి గొప్ప అవకాశం – అత్యధిక సంఖ్యలోని యువ జనాభా. డెమోగ్రాఫిక్ డివిడెండ్ అంటాం. భారత జనాభాలో మూడింట రెండొంతులు పనిచేసే వయసులో ఉన్నవారు. ఈ సానుకూలత మనకు సుమారు మూడు దశాబ్దాలపాటు ఉంటుంది. మన పిల్లలకుగనక, నైపుణ్యాలను అందిస్తే, ఏడాదికి 2 శాతం చొప్పున పదుల సంవత్సరాల పాటు వృద్ధిని సాధించగలం. కానీ మనకున్న అతిపెద్ద ప్రమాదం అధ్వాన్న స్కూలు విద్య. దానివల్ల మన నైపుణ్యాలు, ఉత్పాదకత తక్కువ స్థాయిలో ఉంటాయి.

మన పిల్లలకు మనం సరైన విద్యను అందించకపోతే రాజకీయ స్థిరత్వం, ఆర్థికాభివృద్ధి, సామాజిక సామరస్యత అణగారిపోయే నిజమైన ప్రమాదం పొంచి ఉంది.

పిల్లల అభ్యసన స్థాయి ఫలితాలు అన్ని రాష్ట్రాల్లోనూ అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రయివేటు, ప్రభుత్వ స్కూళ్లలో కూడా. పదవ తరగతిలో 90 శాతం దాకా పాసవుతున్నారు. కానీ లెక్కలు, సైన్సు, భాషల్లో ఆ తరగతికి తగ్గ కనీస సామర్థ్యం ప్రభుత్వ పాఠశాలల్లో 10 శాతం, ప్రయివేటు బడుల్లో 20 శాతం మంది పిల్లలకు మాత్రమే ఉంటోంది. దేశవ్యాప్తంగా స్కూళ్లలో మన పిల్లల చేరిక (ఎన్‌రోల్‌మెంట్) 1 నుండి 8 తరగతుల్లో 90 శాతానికి పైగా ఉంది. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి 22:1గా ఉంది. సాధారణంగా ఉండాల్సిన 30:1 కంటే ఇది ఎంతో ఎక్కువ. అదేవిధంగా, మన ప్రభుత్వాలు పాఠశాల విద్య మీద భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తున్నాయి. చాలా రాష్ట్రాల్లో ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.60,000 నుండి 1,20,000 వరకూ వెచ్చిస్తున్నారు. తమ పిల్లలకు మెరుగైన భవిష్యత్తు ఏర్పడుతుందనే ఆశతో ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్న తల్లిదండ్రుల్లో ఎక్కువమంది ఆదాయానికి మించి ఖర్చు చేస్తున్నారు. ఈ ఖర్చు ఉన్నకొద్దీ పెరుగుతూ భారీ మొత్తాలవుతోంది. అయినా, రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా స్కూలు విద్య వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కేవలం కొద్దిశాతం మంది పిల్లలు .. ఎక్కువగా బాగా చదువుకున్న మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు మాత్రమే పనికొచ్చే నైపుణ్యాలను నేర్చుకోగలుగుతున్నారు.

విద్యలో ఈ ఘోర పతనావస్థకి కారణాల్ని ముందు మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అప్పుడే పేద, ధనిక తేడా లేకుండా పిల్లలందరికీ స్కూలు విద్యా ఫలితాల్ని మెరుగుపరిచే మార్గాల్ని కనుగొనగలం.

అయిదారు దశాబ్దాల క్రితం, మనం పాఠశాలల మీద చాలా తక్కువ ఖర్చు చేశాం. ఉపాధ్యాయులు తక్కువమంది ఉండేవారు. వారికి కూడా జీతాలు తక్కువ ఇచ్చేవారు. స్కూళ్ల అందుబాటు కూడా పరిమితంగా ఉండేది. అయినా కూడా, ప్రభుత్వం పాఠశాలలకు వెళ్లిన పిల్లల్లో అత్యధిక శాతం తమ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వికసింపచేసుకోగలిగారు. కానీ అప్పట్నుంచి ఏం జరిగింది?


పాఠశాల విద్యా ప్రమాణాలు క్షీణించటానికి కారణాల్ని ఒక రాష్ట్రం ఉదాహరణ నుంచే చూద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో (తెలంగాణతో కలిపి) మనకు కొన్ని ఆధారాలు కనిపిస్తాయి. 1971 వరకు, రాష్ట్రంలోని చాలాచోట్ల స్కూలు విద్యను ఒక పద్ధతి ప్రకారం పర్యవేక్షించేవారు, బేరీజు వేసేవారు. ఇన్‌స్పెక్షన్లు ఏటా జరిగేవి. పరీక్షలు క్రమం తప్పకుండా నిర్ణీత కాలవ్యవధిలో నిర్వహించేవారు. అవి కూడా పరిజ్ఞానాన్ని అర్థవంతంగా మదింపు చేసేవిగా ఉండేవి, ఏడాదికి ఆరు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల తరగతి స్థాయి సామర్థ్యాన్ని పారదర్శకంగా అంచనా వేసేవారు. స్కూలు నిర్వహణలో స్థానిక ప్రభుత్వాలు పూర్తిస్థాయి క్రియాశీల పాత్ర పోషించేవి. గొంతున్నవారు, పలుకుబడిగలవారు కూడా తమ పిల్లల్ని ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలకే పంపిస్తుండేవారు కనుక,

వాటిని తమ సొంత సంస్థల్లా గట్టిగా పట్టించుకునేవారు. చదవటం, రాయటం, గణిత సమస్యల్ని పరిష్కరించటం చాలామంది పిల్లలు నేర్చుకోగలిగేవారు. సైన్స్, తర్కంలో మౌలికాంశాల్ని అర్థం చేసుకునేవారు.

ఆ తర్వాత ఏమైందీ? పరీక్షలు ముఖ్యం కాదని 1975లో ప్రభుత్వం ప్రకటించింది. ఏం నేర్చుకున్నారు అనే అంశంతో సంబంధం లేకుండా ప్రతి పిల్లని, పిల్లవాడినీ విద్యా సంవత్సరం పూర్తవగానే పై తరగతికి ప్రమోట్ చేశారు. 7,10 తరగతుల్లో మాత్రం బోర్డు పరీక్షలుండేవి. అంతకు ముందు, క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించేవారు. చదువులో వెనుకబడిన పిల్లలు పుంజుకునేందుకు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేవారు. అభ్యసన సామర్థ్యాలు మరీ భయంకరంగా అట్టడుగు స్థాయిలో ఉన్న కొద్దిమంది పిల్లల్ని మాత్రం అదే తరగతిలో కొనసాగించేవారు. పాఠశాల విద్య అంటే – పునాదులు, గోడలపై ఒక ఇంటిని నిర్మించటం లాంటిది. పునాదులు బలహీనంగా ఉంటే, ఆ భవనం కూలిపోతుంది. తక్కువ అభ్యసన స్థాయిలున్న బిడ్డను పైతరగతికి ప్రమోట్ చేసినా ఫలితం ఉండదు. టీచర్లు చెప్పే విషయాల్ని ఆకళింపు చేసుకోలేనప్పుడు పై తరగతికి వెళ్లి ప్రయోజనమేంటి? పరీక్షల్ని అప్రాధాన్యం చేయటంతో విద్యా ప్రమాణాల్ని బేరీజు అనేది లేకుండాపోయింది. లార్డ్ కెల్విన్ చెప్పినట్లు, 'అంచనా వేయలేకపోతే, మీరు మెరుగుపరచలేరు'.

దీంతో, క్రమంగా ఫలితాలు క్షీణించాయి. ఏం నేర్చుకున్నారు, తరగతి స్థాయి అభ్యసన ప్రమాణాలున్నాయా అనే అంశాలతో సంబంధం లేకుండా 7,10 తరగతుల బోర్డు పరీక్షల్లో ఎలాగోలా పాసవ్వాలని విన్యాసాలు చేసేవారు. ప్రశ్నాపత్రాల్లో తరచూ వచ్చే, ఊహించగలిగే కొన్ని ప్రశ్నల్ని గుర్తించి బట్టీ పట్టటం ఆనవాయితీగా మారింది. ఇందుకోసం అంతకుముందు మూడేళ్ల ప్రశ్నాపత్రాలను చూసుకుంటే సరిపోయేది. కొంతకాల మయ్యాక .. బట్టీపట్టడం కూడా మరీ భారమనిపించటంతో, మూకుమ్మడిగా కాపీ కొట్టటం బోర్డు పరీక్షల్లో సర్వసాధారణమైంది. పరిజ్ఞానంతో సంబంధం లేని భారీ మార్కులు, అత్యధిక పాస్ శాతాలు, అధ్వాన్న ప్రమాణాలు కలసి సాగాయంటే ఇక ఆశ్చర్యమేముంది!

తర్వాత పాఠశాలలపై స్థానిక ప్రభుత్వాల పర్యవేక్షణను, తనిఖీల సైతం 1981లో ప్రభుత్వం తొలగించింది. ఉపాధ్యాయులను రాష్ట్ర స్థాయి పాలనా పరిధి లోకి చేర్చింది (ప్రొవెన్షియలైజ్). జీతాల్ని నేరుగా రాష్ట్రప్రభుత్వమే చెల్లించసాగింది. ఆచరణలో అన్ని రకాలుగా పాఠశాలల్ని ప్రత్యక్షంగా రాష్ట్ర సర్కారే నియంత్రించసాగింది. 2006




వచ్చేసరికి 7వ తరగతి బోర్డు పరీక్షను కూడా తొలగించారు. ఏం నేర్చుకున్నా, నేర్చుకోకున్నా ప్రతి విద్యార్థీ 10వ తరగతి వరకూ నిరాఘటంగా వచ్చేసేవారు. అక్కడ బట్టీ, కాపీ పద్ధతుల్లో పాసయినవారే అధికం.

ప్రభుత్వ విద్య క్షీణించటం, బోధనా మాధ్యమంగా ఇంగ్లిష్ పట్ల మోజు, ఆర్థికంగా కొంత అభివృద్ధి వెరసి .. చాలామంది మధ్యతరగతి పిల్లల్ని ప్రయివేటు స్కూళ్లకు మళ్లించాయి. ఆదాయం, పలుకుబడి తక్కువగా ఉన్న కుటుంబాలు మాత్రమే తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపసాగారు. దీంతో విద్య ఇంకా దిగజారింది. రాష్ట్ర పాఠ్యప్రణాళికను అనుసరించిన ప్రయివేటు స్కూళ్లు అదే తరహాలో నిష్ప్రయోజనకర బేరీజు పద్ధతి, బట్టీ, మూకుమ్మడి కాపీయింగ్‌ల వికృత ప్రోత్సాహకాలను అనుకరించటంతో .. వాటిల్లోనూ ఫలితాలు నాసిరకంగా తయారయ్యాయి. ప్రభుత్వ స్కూళ్ల కంటే కాస్త మెరుగు అన్న చందంగానే ఉన్నాయి.

ఇప్పుడు మనమేం చేయాలి? పెద్ద ఎత్తున నిధుల్ని ఖర్చు చేస్తున్నా పాఠశాల విద్యలో ఘోరంగా విఫలమయ్యామన్న వాస్తవాన్ని ముందు నిజాయతీగా అంగీకరించాలి. మెరుగైన భవనాలు, ఇతర మౌలిక వసతులు కల్పించటం మంచిదే. కానీ నిజమైన సవాలు ప్రోత్సాహకాల్ని మార్చటంలో ఉంది. ముఖ్యంగా, విద్యకు సమాజంలో అపారమైన డిమాండ్ ఉన్నప్పుడు!

కులం, మతం, ప్రాంతం, భాష, ఆదాయాలతో సంబంధం లేకుండా ప్రతి భారతీయ కుటుంబం తమ పిల్లలకు మంచి విద్యను కోరుకుంటున్నారు. మనం చేయవలసిందల్లా – ఆ డిమాండ్ స్వభావాన్ని మార్చటం. ఇందుకోసం నిజమైన పరిజ్ఞానాన్ని పరీక్షించే ఏర్పాటు చేయాలి. అర్థవంతంగా, ఒత్తిడి లేకుండా, కాన్సెప్ట్ నైపుణ్యాల ఆధారంగా విద్యార్థిని అంచనా వేసే వ్యవస్థను రూపొందించాలి. బేరీజు వేసే



పద్ధతి నిజమైన ఫలితాల్ని గణించినప్పుడు, మూకుమ్మడి కాపీని కట్టడి చేసినప్పుడు .. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు, సమాజం ఇలా అందరూ తమ తీరును మార్చుకుంటారు. నిజమైన, మెరుగైన ఫలితాల్ని సాధించేం దుకు ప్రయత్నిస్తారు.

చాలా రాష్ట్రాల్లో ఉపాధ్యాయ - విద్యార్థి నిష్పత్తులు మనకు సానుకూలంగా ఉన్నాయి. ఉపాధ్యాయుల్లో 2-3శాతం మందిని మనం మొత్తం స్కూళ్లు - ప్రభుత్వ, ప్రయివేటుల్లో - క్రమబద్ధ ఇన్‌స్పెక్షన్, పర్యవేక్షణకు, మార్గదర్శకత్వం, శిక్షణకు మళ్లించాలి. ఆ కొత్త బాధ్యతకు వారిని వినియోగించుకోవాలి. చివరిగా, పాఠశాల విద్యా ప్రమాణాలను పర్యవేక్షించటం, మెరుగుపరచటంలో తల్లిదండ్రులకు, పేరున్న ఉపాధ్యాయులు, విజయవంతమైన పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రభుత్వాలకు మనం గొంతునివ్వటం, పాత్ర కల్పించటం అవసరం.

ఈ మూడు మంత్రాలూ - అర్థవంతమైన, ఒత్తిడి లేని, కాన్సెప్ట్ - నైపుణ్య ఆధారిత పరీక్షలు; క్రమబద్ధ ఇన్‌స్పెక్షన్లు పర్యవేక్షణ, మార్గదర్శకత్వం; స్కూలు నిర్వహణలో స్థానికంగా అవసరమైన మార్పులకు వెసులుబాటు, జవాబుదారీతనం-స్కూలు విద్యా ఫలితాల్ని సమూలంగా మెరుగుపరుస్తాయి. ఈవేళ్టి భారతదేశంలో ఇంతకంటే ముఖ్యమైన, వేగంగా చేయాల్సిన పని ఇంకోటి లేదు. ✰

## అల్పాదాయ దేశాల్లో చదువులో వెనకబడుతున్న పిల్లలు

తాత్కాలిక తాయిలాలు, సంపద పంపిణీ ద్వారా అభివృద్ధి చెందిన దేశం ప్రపంచంలో ఒక్కటి కూడా లేదు. మంచి చదువు, నైపుణ్యాలు, ఉపాధి, సమాన అవకాశాలు కల్పించే తత్వం వల్లే ఆ దేశాలు వృద్ధి చెందాయి. కానీ ప్రపంచవ్యాప్తంగా సగటున 48 శాతం చిన్నారులు ప్రాథమిక విద్య తర్వాత చిన్న పదాలు లాంటి వాటినీ సరిగ్గా చదవలేకపోతున్నారని '2030 నాటికి ప్రతి చిన్నారీ చదవగలదా?' అధ్యయనం వెల్లడించింది. భారత్‌లో పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉంది. సంపన్న రాజ్యాలతో పోలిస్తే అల్పాదాయ దేశాల్లో చిన్నారులు చదువులో ఎక్కువ వెనకబడుతున్నారు.

**ఆయా దేశాల్లో అలాంటివారు ఎంతమంది ఉన్నారంటే (శాతాల్లో) :**

**అధికాదాయ దేశాలు - 9 శాతం**

**ఉన్నత- మధ్యాదాయ దేశాలు - 29 శాతం**

**దిగువ-మధ్యాదాయ దేశాలు - 55 శాతం**

**అల్పాదాయ దేశాలు - 90 శాతం**

ప్రాథమిక విద్య పూర్తయిన తర్వాత ఆస్ట్రియా, ఫిన్లాండ్, హాంకాంగ్, ఇటలీ నెదర్లాండ్స్, రష్యా, స్వీడన్, సింగపూర్ వంటి దేశాల్లో చదవలేకపోకపోతున్నవారు అతి తక్కువగా 1.6 నుంచి మూడు శాతం లోపు ఉన్నారు.

# ఏపీలో ఇక 9 రకాల పాఠశాలల వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9 రకాల పాఠశాలలతో క్లస్టర్ అకడమిక్ టీచర్ల విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. వైకాపా ప్రభుత్వ హయాంలో తెచ్చిన ఆరు రకాల స్థానంలో కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల బడుల వ్యవస్థను తీసుకొస్తోంది. విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు, బడి మానేస్తున్నవారి సంఖ్య తగ్గింపు, సబ్జెక్టు ఉపాధ్యా యులపై పనిభారం తగ్గించటం, అభ్యసన సామర్థ్యాలు పెంచటం లక్ష్యంగా కొత్త విధానం తీసుకొస్తున్నట్లు చెబుతున్నారు.

**కొత్త బడులు ఇలా ..**

1)**శాటిలైట్ ఫౌండేషన్ :** పూర్వ ప్రాథమిక విద్య (ఎల్‌కేజీ, యూకేజీ) - 1,2 (అంగన్‌వాడీలు) తరగతులతో శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలు. కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఉంటే అంగన్‌వాడీలు శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలుగా కొనసాగుతాయి.

2)**ఫౌండేషనల్:** పీపీ-1,2తో పాటు ఒకటి, రెండు తరగతులతో ఫౌండేషనల్ పాఠశాలలు ఉంటాయి. వీటిల్లో 30 మందికి ఒక ఎసీజీటీ కేటాయిస్తారు. కిలోమీటరు లోపు దూరంలో ఉన్న అంగన్‌వాడీలను ఫౌండేషన్ బడులతో అను సంధానం చేస్తారు. ఇక్కడ 1,2 తరగతులకు ఎస్‌జీటీలు, పీపీ-1,2కు అంగన్‌వాడీ కార్యకర్తలు బోధిస్తారు.

3) **బేసిక్ ప్రాథమిక:** పీపీ-1,2తో పాటు 1-5 తరగతులు ఉండేవాటిని బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా నిర్వహిస్తారు. 1-5తరగతుల్లో ప్రవేశాలు 59మంది లోపు ఉండేవన్నీ బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగుతాయి. 20 మంది విద్యార్థులకు ఒక టీచర్, 21-60 వరకు ఇద్దర్ని ఇస్తారు.

4) **ఆదర్శ ప్రాథమిక:** పీపీ-1,2, ఒకటి నుంచి అయిదు తరగతులు. 59 మంది కంటే ఎక్కువ విద్యార్థులుంటే ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు ఎస్‌జీటీలను ఇస్తారు. 60-150 మంది ఉంటే హెచ్.ఎం, నాలుగు ఎన్‌జీటీ పోస్టులు కేటాయిస్తారు. ఆపై ప్రతి 30 మందికీ అదనంగా ఒక టీచర్‌ను ఇస్తారు.

5)**ప్రాథమికోన్నత:** పీపీ-1,2తో పాటు 1-8 తరగతు లుండేవి ప్రాథమికోన్నత బడులుగా కొనసాగుతాయి. వీటిల్లోని 1-5 తరగతుల్లోని విద్యార్థుల ఆధారంగా బేసిక్, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా ఉంటాయి. 6,7,8 తరగతులతో 10 లోపు ఉంటే ఒకరు, 11-30కి ఇద్దరు, 31-140కి నలుగురు, 141-175కి ఐదుగురు సబ్జెక్టు



టీచర్లను ఇస్తారు. సబ్జెక్టు టీచర్లు మిగులుగా లేకపోతే ఎస్‌జీటీలను కేటాయిస్తారు.

6)**ఉన్నత పాఠశాలలు:** 6-10 తరగతులలో ఉన్నత పాఠశాలలు. వీటిల్లో 75 మంది లోపు పిల్లలు ఉంటే ప్రధా నోపాధ్యాయుడి పోస్టు ఉండదు. క్లస్టర్ పాఠశాలలో ప్రవేశా లను పట్టించుకోకుండా హెచ్‌ఎం, ఎస్‌ఏ, పీఈటీ పోస్టులు ఇస్తారు. అయిదు సెక్షన్లు ఉంటే 8 పోస్టులు వస్తాయి.

7)**ఉన్నత పాఠశాల (1-10)** : ఇందులో బేసిక్, ఆదర్శ ప్రాథమిక పాఠశాలతో కూడిన ఉన్నత పాఠశాలలుంటాయి. వీటిని హైస్కూల్ హెచ్‌ఎం పర్యవేక్షిస్తారు. 1-5 తరగతుల్లో 60 మంది కంటే ఎక్కువ పిల్లలు ఉంటే ఆదర్శ ప్రాథమిక పాఠశాల విధానం లోనూ .. ఒకవేళ 60 లోపు పిల్లలు ఉంటే 10 మంది వరకు ఇద్దరు, 11-30కి ముగ్గురు, 31-59 వరకు హెచ్‌ఎం, మూడు ఎస్‌జీటీ పోస్టులను ఇస్తారు.

8)**హైస్కూల్ ప్లస్ (6-12)**: 6-12 తరగతులుంటే హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ నిర్వహిస్తారు. హైస్కూలు తరహాలో టీచర్లను ఇస్తారు.

9)**హైస్కూల్ ప్లస్ (1-12)**: 1-10 తరగతులు ఉండే హైస్కూలు విధానంలోనే ప్రాథమిక తరగతులకు టీచర్లను కేటాయిస్తారు. 6-10 వరకు ఉన్నత పాఠశాల విధానం. ఇంటర్మీడియట్ ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

పాఠశాలల మార్పు, పోస్టుల హేతుబద్ధీకరణ కారణంగా, మిగులుగా తేలిన 2,754 మందిని క్లస్టర్ స్థాయిలో అకడమిక్ టీచర్లుగా, 4,706 మంది సబ్జెక్ట్ టీచర్లను ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలుగా, ఇంకా మిగిలినవారిని వేరే అవసరాలకు సర్దుబాటు చేస్తారు.

నిర్ణీత దూరంలో స్కూళ్లు లేకపోతే 6-14 ఏళ్ల పిల్లలకు రవాణా భత్యం చెల్లిస్తారు. కాగా, ప్రభుత్వం పాఠశాలల పునర్విభజన, క్రమబద్ధీకరణకు విడుదల చేసిన ఉత్తర్వులు అసంబద్ధంగా ఉన్నాయని, పునరాలోచన చేయాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ☆

# సుప్రీంకోర్టు రాష్ట్రపతికి ఏ మేరకు పరిమితులు విధించవచ్చు?

– వనం జ్వాలానరసింహారావు–



భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అత్యంత ఆమోదయోగ్యమైన, నిలకడైన పరిపాలనా విధానంగా కొనసాగడానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వేసిన పునాదే పెద్ద కారణం. అది మరింత బలోపేతం కావాలంటే రాజ్యాంగ మూలస్తంభాలైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు పరస్పర గౌరవంతో, స్పష్టమైన అధికార పరిధుల ఆధారంగా పనిచేయడం తప్పనిసరి. దీనికి విరుద్ధంగా ఇటీవల రాష్ట్రపతి – న్యాయ వ్యవస్థల మధ్య సంఘర్షణ చోటుచేసుకోవడం ఆందోళనకరం. ఇలాంటి ఘటనలతో ప్రజాస్వామ్య శాశ్వత మనుగడే ప్రశ్నార్థకం కాగలదు. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి గవర్నర్లకు నెల రోజుల గడువు, రాష్ట్రపతికి మూడు నెలల గడువును విధిస్తూ భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించడాన్ని రాజ్యాంగ, రాజకీయ, న్యాయ శాస్త్ర విశ్లేషకులు విమర్శిస్తున్నారు. శాసన, కార్యనిర్వాహక విభాగాలకు, న్యాయ వ్యవస్థకు మధ్య సుస్పష్టమైన హద్దులు ఉన్నప్పటికీ, న్యాయవ్యవస్థ ఈ విధమైన ఆదేశాలతో తన పరిధిని అధిగమించాలనో, విస్తరించాలనో చూస్తున్నదా అన్న అనుమానం వ్యక్తం అవుతున్నది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కడ్ తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలు 'సూపర్ పార్ల మెంట్'గా వ్యవహరించాలని భారత రాజ్యాంగ నిర్మాతలు ఎన్నడూ అనుకోలేదని ఆయన అన్నారు. మరోవైపు సర్వో న్నత న్యాయస్థానం తన అభిప్రాయంగా "రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఏ అధికార వినియోగమైనా న్యాయసమీక్షకు అతీతం కానే కాదు" అని స్పష్టం చేసింది. ఈ సందర్భాన్ని రాజ్యాంగ పరిరక్షణగా చూడాలా, లేక వ్యవస్థలు తమ పరి మితులు దాటే ప్రయత్నంగా చూడాలా అనే చర్చ అంతటా మొదలైంది.

సుప్రీంకోర్టు ఈ గడువు విధించే విషయంలో గవర్నర్ వ్యవ స్థను రాష్ట్రపతి స్థాయితో సమానంగా భావించడం తగునా అన్నది ఆలోచించాల్సిన విషయం. రాష్ట్రపతి, గవర్నర్ ఈ రెండు రాజ్యాంగ వ్యవస్థలను వారి వారి పరిధులలో "సమా న అధికారాలున్న అసమానులు"గా చూడాలి. భారత రాజ్యాంగం ప్రకారం సంపూర్ణమైన ఎన్నిక ద్వారా పదవిలోకి వచ్చే అత్యున్నత, ఏకైక అధికార పీఠం కేవలం రాష్ట్రపతిది మాత్రమే. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, రాష్ట్రాల – కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభ సభ్యుల ఎలెక్టోరల్ కాలేజీ కలిసి రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. మిగతా వారంతా రాష్ట్ర పతి విచక్షణాధికారం ద్వారా నియమించడమో, లేదా నామినేట్ చేయడమో జరుగుతుంది. కార్య నిర్వాహక వ్య వస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థలకు రాష్ట్రపతే అధిపతి. రాష్ట్రపతి చేసే ముఖ్యాతి ముఖ్యమైన నియామకాలలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్ట్, హైకోర్ట్ న్యాయమూర్తులు, ఎన్నికల అధికారులు తదితరులు ఉంటారు. గవర్నర్ వ్యవస్థ ఆది నుంచీ తటస్థ వ్యవస్థగా పేరు తెచ్చుకోలేకపోయింది. గవర్నర్ల నియామకం ఎప్పుడూ వివాదాస్పదమే. గవర్నర్ తనకు సంక్రమించిన అధికా రాలను, విధులను సహకార సమాఖ్య స్ఫూర్తితో, భారత దేశాన్ని ఐక్యంగా ఉంచడానికి ఉపయోగిస్తారని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. దురదృష్టవశాత్తూ దీనికి పూర్తి భిన్నంగా, అందరూ కాకపోయినా మెజారిటీ గవర్నర్లు, అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఏజంట్లుగా పదవిని దుర్వినియోగం చేస్తూ వచ్చారు. కాబట్టి ఈ సందర్భంలో సర్వోన్నత న్యాయస్థానం గవర్నర్‌లకు గడువు విధించడం సమంజసమే కావచ్చు. కానీ రాష్ట్రపతిని గవర్నర్లతో సమానంగా భావిస్తూ గడువు విధించడం చర్చించాల్సిన అంశం! ఏదైనా మౌలికమైన అంశంలో రాష్ట్రపతి సరైన ఆలోచన కోసం తీసుకునే సమయంతో సహా, అనేక అంశాల్లో స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవడమన్నది ఆ పదవికి వన్నె తెచ్చే రాజ్యాంగపరమైన అధికారం. అటువంటి విష యంలో సర్వోన్నత న్యాయస్థానం గడువు విధించడం గౌరవ భరిత రాజ్యాంగ కర్తవ్యంలో జోక్యం చేసుకోవడంగానే భావించాలి.

భారత రాజ్యాంగంలో న్యాయసమీక్షకు విశేష ప్రాధాన్య మున్నది. అలాగే రాష్ట్రపతి పదవికి, అధికారాలకు, బాధ్యత లకు కూడా విశేషమైన ప్రాధాన్యం ఉన్నది. న్యాయసమీక్ష

అనే సూత్రాన్ని స్వేచ్ఛతో నిర్వర్తిస్తున్న సుప్రీంకోర్టు అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన రాష్ట్రపతికి ఏ మేరకు పరిమితులు విధించవచ్చు అన్నది చర్చనీయాంశం. ఒకవేళ రాష్ట్రపతి లేదా గవర్నర్ కార్యాచరణలో మలినమైన ఉద్దేశం లేదా రాజ్యాంగ ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తే తప్ప, సర్వోన్నత న్యాయస్థానం ఈ అంశంపై మార్గనిర్దేశాలు ఇవ్వడం అనేది అతి జోక్యమే అవుతుంది. అసలు రాష్ట్రపతి, గవర్నర్ల ఆల స్యాలపై తీర్పు చెప్పే ముందు న్యాయస్థానాలు స్వయంస్థితిని గుర్తించకపోవడం తగునా? వివిధ స్థాయి న్యాయస్థానాలలో వేలాది కేసులు దశాబ్దాలుగా పెండింగులో కొనసాగుతున్నాయి. అయోధ్య, ఎన్నికల అనర్హత కేసులు, పౌర వివాదాలు వంటి అనేక గుణాత్మక కేసులు సంవత్సరాల తరబడి కోర్టులలో కొట్టుమిట్టాడాయి. ముందు ఈ అంశంపై సమగ్రంగా ఆలోచన చేయకుండా, సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్రపతికి గడువు విధించడంపై రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులు చర్చ జరపాలి.

'ఆలస్యమైన న్యాయం అన్యాయమే' అనే సూత్రానికి అనుగుణంగా న్యాయస్థానాలు సైతం నిర్ణీత గడువులో కేసుల పరిష్కారం విషయంలో సమయపాలన పాటించేటందుకు తగిన చర్యలు తీసుకోవాలి. బిల్లులపై నిర్ణయాలను గడువుల్లో తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిన తీర్పు వెనుక ఉన్న ఉద్దేశం మంచిదే కావచ్చు. అధికార స్వామ్యం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలు ఆలస్యం కావటం లేదా వాటికి రాజకీయ ఆటలు అడ్డం రావటం... ఇంతవరకు మాత్రమే న్యాయశాస్త్రం పట్టించుకోవాల్సిన అంశం. రాజ్యాంగ విలువలను నిలబెట్టే బృహత్తర ప్రయత్నంలో శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల మధ్య సమన్వయం తప్పనిసరి. నిజమైన మార్పు రావాలంటే రాజ్యాంగపరమైన నియామకాల్లో రాజకీయ ముసుగు తొలగాలి. రాష్ట్రపతి, గవర్నర్లు రాజ్యాంగంలోని అక్షరాన్ని మాత్రమే కాదు, ఆత్మను కూడా గౌరవించాలి. అదే విధంగా, న్యాయవ్యవస్థ కూడా ఇతరులపై ప్రమాణాలు విధించే ముందు తనదైన ఆలస్యాలపై స్వయంగా ఆలోచించాలి. ప్రజాస్వామ్య త్రిమూర్తులు (న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు) పరిమితులకు లోబడి, పోటీ తత్త్వం లేకుండా వ్యవహరించడంలోనే ప్రజాస్వామ్య స్థిరత్వం ఆధారపడి ఉంది. **(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

☆

# సర్వజన ఆస్పత్రిపై మంత్రి పునరాలోచించాలి

విజయనగరం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ఉన్నచోటే కొనసాగించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు సూచించటం సరికాదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, జిల్లా పౌర వేదిక సారథి భీశెట్టి బాబ్జీ అన్నారు. గతేడాది నవంబర్ 28 ,29 , 30 తేదీల్లో సర్వజనాస్పత్రిలో రోగులు, వారి బంధువులు, డాక్టర్లు, సిబ్బందితో సమావేశమై ఆస్పత్రిలోని పరిస్థితులపై ఒక నివేదిక తయారుచేశామని, హాస్పిటల్ ని ప్రభుత్వ వైద్య కళాశాలకు వెంటనే తరలించాలని కోరుతూ కలెక్టర్ అంబేద్కర్, మంత్రి కొండపల్లి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతి రాజులకు అందించామన్నారు. రోగులు, డాక్టర్లు, సిబ్బంది వసతులు చాలక ఇబ్బందులు పడుతున్నామని గగ్గోలు పెడుతుంటే, ఉన్నచోటే కొనసాగించాలని మంత్రి ఎలా చెబుతారని ప్రశ్నించారు. వైద్య విద్యార్థులు కూడా బోధనాస్పత్రి నుంచి ప్రతిరోజూ సర్వజనాస్పత్రికి వెళ్లటానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రి ఉన్న భవనంలో న్యూరో, న్యూరో మెడిసిన్, నెఫ్రాలజీ, యూరాలజీ, మెడికల్ ఆంకాలజీలతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయవచ్చన్నారు. కొవిడ్ మళ్లీ విజృంభిస్తుందన్న వార్తల నేపథ్యంలో నిత్యం 1500 – 2000 మందికి ఓపీ చూసే ఆస్పత్రిని ఇరుకు గదుల్లో కొనసాగించటం సరికాదన్నారు. ఈ సందర్భంగా పౌర వేదిక నివేదికను విడుదల చేశారు.

### అధికార వికేంద్రీకరణ లేకుండా 'పల్లె నిద్ర' మొక్కుబడే

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులతో నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమం మంచిదేనని, అయితే నిర్ణయాధికారం, అమలు పర్యవేక్షణ లేకపోవటం వల్ల మొక్కుబడిగా సాగాయని బాబ్జీ అన్నారు. చిన్నపాటి రెవెన్యూ సమస్యలకే ప్రజలు మండల, జిల్లా రెవెన్యూ అధికారులు, కలెక్టర్ల చుట్టూ తిరుగుతూ అలసిపోతున్నారని, చాలా శాఖల్లో సిబ్బంది ప్రజలకు మర్యాద కూడా ఇవ్వటం లేదన్నారు. ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లా కాకుండా.. స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో అధికార వికేంద్రీకరణ చేయాలన్నారు. పౌర వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్ర రాజు, మమ్మగంటి రామ్మోహనరావు, ఏపీ గో సంరక్షక అధ్యక్షుడు లోగిస రామకృష్ణ, లోక్‌సత్తా జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# కాల పరిమితులు నిర్దేశించటంపై సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి 14 ప్రశ్నలు

రాష్ట్ర శాసనసభలు పంపిన బిల్లుల ఆమోదానికి సంబంధించి గవర్నర్లతో పాటు రాష్ట్రపతికి కాలపరిమితి విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన చర్చనీయ తీర్పుకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రపతి, గవర్నర్లకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అధికారాలను సర్వోన్నత న్యాయస్థానం కట్టడి చేయటంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రశ్నలు లేవనెత్తారు. రాజ్యాంగంలోని అధికరణం 143 (1) కింద 14 ప్రశ్నలను సుప్రీంకోర్టుకు సంధించి న్యాయ సలహా కోరారు. ఏదైనా ప్రజా ప్రాధాన్యత ఉన్న అంశంపై 143 (1) ప్రకారం సుప్రీంకోర్టు నుంచి న్యాయసలహా కోరే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఈ ప్రశ్నలపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

**రాష్ట్రపతి లేవనెత్తిన ప్రశ్నలివే ..**

1.రాజ్యాంగంలోని అధికరణం 200 కింద బిల్లు సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగ ప్రత్యామ్నాయా లేమిటి?

2.అధికరణం 200 కింద బిల్లు సమర్పించినప్పుడు తన కున్న అధికారాలను వినియోగించే అవకాశం గవర్నర్‌కి ఆయన మంత్రిమండలి సలహాకు కట్టుబడి ఉండాలా?

3.అధికరణం 200 కింద తనకున్న రాజ్యాంగ విచక్షణాధికారాన్ని గవర్నర్ వినియోగించటం న్యాయపరిశీలన పరిధిలోకి వస్తుందా?

4.అధికరణం 200 కింద గవర్నర్ చర్యలపై న్యాయ సమీక్షను రాజ్యాంగం లోని అధికరణం 361 పూర్తిగా నిషే ధిస్తుందా?

5.రాజ్యాంగపరంగా నిర్ణీత కాలపరిమితి లేనప్పుడు, అధిక రణం 200 ప్రకారం గవర్నర్‌కు ఉన్న అధికారాలపై న్యాయ పరమైన ఉత్తర్వుల ద్వారా కాలపరిమితులను విధించవచ్చా? అది ఎలా అమలు చేయాలన్న విధానాన్ని సూచించవచ్చా?

6.అధికరణం 201 ప్రకారం రాష్ట్రపతి రాజ్యాంగ విచక్షణాధికారాన్ని వినియోగించుకోవటం న్యాయ పరిశీలన పరిధి లోకి వస్తుందా?

7.రాజ్యాంగం ప్రకారం నిర్ణీత కాలవ్యవధులు లేనప్పుడు అధికరణం 201 ప్రకారం రాష్ట్రపతికి ఉన్న విచక్షణాధి కారాలపై న్యాయపరమైన ఉత్తర్వుల ద్వారా గడువులు విధించవచ్చా..అది ఎలా అమలు చేయాలన్న విధానాన్ని సూచించవచ్చా?

8.రాజ్యాంగపరంగా రాష్ట్రపతి తన అధికారాలను వినియో గించే సమయంలో అధికరణం 143 కింద సుప్రీంకోర్టు సలహా కోరాలా? ఆమోదం లేదా తిరస్కరణ కోసం గవర్నర్ బిల్లును పంపినప్పుడు సుప్రీంకోర్టు అభిప్రాయం రాష్ట్రపతి తీసుకోవాలా?

9.చట్టం అమల్లోకి రాకముందే అధికరణం 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను కోర్టులు పరిశీలించటం సరైందేనా? ఒక బిల్లు చట్టంగా మారక ముందు అందులోని అంశాలపై న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవటానికి న్యాయస్థానాలకు అనుమతి ఉందా?

10.రాష్ట్రపతి, గవర్నర్ రాజ్యాంగబద్ధ అధికారాలు, ఉత్త ర్వులను ఏరకంగానైనా రాజ్యాంగంలోని అధికరణం 142 భర్తీ చేస్తుందా?

11.రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం అధికరణం 200 కింద గవర్నర్ సమ్మతి లేకుండా అమల్లోకి రావచ్చా?

12.అధికరణం 145 (3) ప్రకారం, రాజ్యాంగ అంశాలతో ముడిపడి ప్రశ్నలున్న ప్రొసీడింగ్స్ ఏ ధర్మాసనం ముందుకు వచ్చినా దాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మసనానికి నివేదించటం తప్పనిసరి కాదా?

13.అధికరణం 142 కింద ఉన్న సుప్రీంకోర్టు అధికారాలు కేవలం ప్రొసీజర్‌లకే పరిమితమా? లేదా - అధికరణం 142 కింద జారీ చేసిన ఉత్తర్వులు ప్రస్తుత సబ్‌స్టాంటివ్‌లా లేదా రాజ్యాంగంలోని నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నా చెల్లుబాటు అవుతాయా?

14.ఒక్క అధికరణం 131 కింద తప్ప యూనియన్, రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరించటానికి సుప్రీంకోర్టు ఇతర అధికార పరిధులను రాజ్యాంగం నిషేధిస్తుందా?


☆

### తమిళనాడు వివాదం నేపథ్యంలో....

తమిళనాడు శాసనసభ ఆమోదం తెలిపిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే పెండింగ్‌లో ఉంచటం సరికాదని ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. 415 పేజీల తీర్పును వెలువరించిన సర్వోన్నత న్యాయస్థానం, రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్ గరిష్టంగా మూడు నెలల్లోగా ఆమోదించటమో, లేకుంటే తిప్పి పంపించటమో చేయాలని తీర్పునిచ్చింది. బిల్లులను వెనక్కి పంపితే ఎందుకు అలా చేశారనే కారణాలు కూడా చెప్పాలని పేర్కొంది. గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధి లోకి వస్తుందని తెలిపింది. అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో 14 ప్రశ్నలను రాష్ట్రపతి సంధించారు.

# గందరగోళానికి తావిస్తున్న గవర్నర్ వ్యవస్థ

గవర్నర్లు అనేక సందర్భాలలో తమ చర్యల ద్వారా లేనిపోని గందరగోళాలకు కారణం అవుతున్నారు. తాజాగా తమిళనాడు గవర్నర్ తీరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గతంలో బెంగాల్‌లో, కేరళలోనూ గవర్నర్ల వ్యవహారశైలి అనేక విమర్శలకు దారి తీసింది. వారి తీరుకు నిరసనగా అధికారపక్షం నుంచి నిరసనలను సైతం వారు ఎదుర్కొన్నారు. ప్రతిపక్షపార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఈ సమస్య తలెత్తుతోంది. చాలా కాలం నుంచి ఎందరో గవర్నర్లు రాజకీయాల్లో తల దూర్చి భారత ప్రజాస్వామ్యానికి తీరని చేటు చేశారు. కొన్ని సందర్భాలలో వాళ్ళు కూడా అభాసుపాలయ్యారు. గవర్నర్ల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం ద్వారా ఇలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఈ గవర్నర్ల పాత్రను కొంత వివరంగా చర్చిద్దాం.



రాష్ట్రానికి సంబంధించినంత వరకు గవర్నర్ రాజ్యాంగాధినేతగా వ్యవహరిస్తారు. ఎన్నికల ద్వారా తమ నాయకులను ప్రజలు స్వేచ్ఛగా ఎన్నుకునే వెసులుబాటు గల మన దేశంలో గవర్నర్లను మాత్రం యూనియన్ ప్రభుత్వమే నామినేట్ చేసే విధానమే ఇప్పటికీ అమలులో ఉండడం విచారకరం. ఈ విధంగా నియమితులయ్యే వారికి ప్రజా తీర్పును తోసి రాజనే నైతిక హక్కు ఎక్కడిది? మన దేశాన్ని పాలించినప్పుడు తమ ఆధీనంలో ఉండే దూర ప్రాంతాలకు ప్రతినిధులుగా సుబేదార్లను నియమించేవారు. వారికి ఇప్పటి గవర్నర్ల వ్యవస్థకు పెద్ద తేడా ఏం లేదు. ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సమైక్య స్ఫూర్తి పరిఢవిల్లేలా గవర్నర్ల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉంది. గవర్నర్లను ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతి అమెరికాలో అమలులో ఉంది. ఇలా ఎన్నికైన గవర్నర్ ప్రభుత్వ అధినేతగాను, రాజ్యాంగ ప్రతినిధిగాను కూడా వ్యవహరిస్తారు. ప్రజలే నేరుగా ఎన్నుకుంటారు కాబట్టి పదవీ కాలం పూర్తయ్యేలోగా ఆయన ఏర్పాటు చేసిన ప్రభుత్వాన్ని చట్టసభ సభ్యులు కూల్చివేసే అవకాశం ఉండదు. రాష్ట్రాలు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వీలుంది. రాజ్యాంగ పరిరక్షణ నిమిత్తం ఫెడరల్ ప్రభుత్వము తన అధికారాలను ఉపయోగించుకోవచ్చు. ఫెడరల్ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ సమస్యలు, సంక్షోభాలను నివారించే సరళమైన ఆచరణీయమైన విధానమిది. తమ నాయకుడిని ప్రజలే నేరుగా ఎన్నుకునే అవకాశం ఉండడం, రాష్ట్రాలను తమ అదుపాజ్ఞలలో పెట్టుకునేందుకు కేంద్రానికి వీలు లేకపోవడం ఇందులోని మెచ్చదగిన అంశాలు. ఫెడరల్ ప్రజాస్వామ్య దేశాలైన కెనడా, ఆస్ట్రేలియాలో ఒకప్పుడు వలసవాద రాజ్యాలు. ప్రధానమంత్రుల సలహా మేరకు అక్కడ గవర్నర్‌ను నియమిస్తారు. గవర్నర్‌లకు కొన్ని ప్రత్యేక అధికారాలు ఉన్నా వాటిని ఉపయోగించడం అరుదు.

**రాచరిక సంప్రదాయం**

భారతదేశ చరిత్రలో వేల సంవత్సరాల క్రితం నుంచి చక్రవర్తి తన అనుయాయుల్ని లేదా రాచకుటుంబంలోని వాళ్ళను తన సామ్రాజ్యంలోని వివిధ రాజ్యాలకు గవర్నర్లుగా పంపే ఆనవాయితీ ఉంది. ఉదాహరణకు అశోకుడు గవర్నర్‌గా పనిచేశాడు. ఇంత పెద్ద దేశంలో అందునా ఆ కాలంలో దేశ రాజధాని నుంచి పాలనను సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యం కాదు కాబట్టి రాజప్రతినిధులు వివిధ రాజ్యాలకు లేదా ప్రాంతాలకు వెళ్లి పరిపాలించటం అవసరమైంది. చోళుల కాలంలో వివిధ రాజ్యాలను మండలాలని, వాటిని పాలించే రాజప్రతినిధులను మండలాధీశులని పిలిచేవాళ్ళు. ఢిల్లీ సుల్తాన్ల కాలంలో కూడా సుల్తాను ప్రతినిధులు వివిధ ప్రాంతాలలో రాజ్యం చేసేవాళ్లు. సుల్తాను బలహీనుడైతే అదపాదడపా గవర్నర్లు స్వతంత్రం ప్రకటించుకునేవాళ్ళు లేదా సుల్తాన్ మీదే దండెత్తి అతనిని వధించి పదవిలో కూర్చునే ప్రయత్నం చేసేవాళ్ళు. ఉదాహరణకు ఢిల్లీ సింహాసనం అధిష్ఠించిన ఏకైక మహిళ రజియా సుల్తానాపై తిరుగుబాటులో అప్పటి సర్హింద్ గవర్నర్ అల్తూనియా ప్రముఖ పాత్ర వహించాడు. అయితే రజియా

అతనిని పెళ్లాడి సింహాసనాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసింది. కానీ ఆ ఇద్దర్నీ చంపి రజియా సోదరుడు ముల్జుద్దీన్ బహరావమ్ సుల్తాన్ అయ్యాడు. కొందరు అదును చూసుకుని శత్రువు రాజులతో కలిసి కేంద్ర ప్రభుత్వం మీద దాడి చేసిన వాళ్ళే. ఉదాహరణకు ఢిల్లీ సుల్తానులో ఆఖరివాడైన ఇబ్రహీం లోఢి బాబరు చేతుల్లో ఓడిపోవడానికి ప్రధాన కారణం అప్పటి పంజాబ్ గవర్నర్ దౌలత్‌ఖాన్ లోఢీ బాబరుతో చేతులు కలపడం. మొఘల్ చక్రవర్తుల కాలంలో ఈ రాజ్యాలను 'సుబాలు' అని పిలిచేవారు, ఈ సుబాల గవర్నర్లను సుబేదార్లుగా వ్యవహరించేవారు. అక్బర్ కాలంలో 15 సుబాలు ఉండేవి. స్థానికంగా ఎవరైనా సామ్రాజ్యానికి ఇబ్బంది కలిగిస్తే వెంటనే సుబేదార్లను పంపి తిరుగుబాటు అణిచివేసేవాళ్ళు. బ్రిటిష్ వారి కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వారి గవర్నర్ జనరల్ కలకత్తాలో ఉండేవాడు. మద్రాసు, బొంబాయిలలో వారి ప్రావిన్సులు ఉండేవి. వాటికి గవర్నర్లను నియమించి పాలన బాధ్యతను వాళ్ళ చేతుల్లో పెట్టారు. వారిలో చాలా మంది మంచి పేరు తెచ్చుకున్నారు. ఉదాహరణకు మద్రాస్ ప్రావిన్స్‌లో థామస్ రో తన రైత్వారీ సెటిల్మెంట్ విధానాల ద్వారా ప్రజల మనల్ని పొందాడు. 1857 తర్వాత ప్రత్యక్షంగా బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశ పాలన బాధ్యతను స్వీకరించింది. వైస్రాయిని బ్రిటిష్ ప్రభుత్వం నియమించగా ప్రావిన్సుల కోసం గవర్నర్ల వ్యవస్థ యథాతథంగా కొనసాగించింది. 1911లో దేశ రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి తరలించారు. బెంగాల్, బొంబాయి, మద్రాస్ ప్రావిన్స్‌లకు గవర్నర్లు కొనసాగారు. ఇలా భారతదేశంలో గవర్నర్ల వ్యవస్థకు బోలెడంత చరిత్ర ఉంది. సామ్రాజ్యంలో నుంచి ఏ ప్రాంతము జారిపోకుండా ఉండటం కోసం దేశ రాజధాని నుంచి గవర్నర్‌ను పంపి వారి ఆధిపత్యంలో పాలను కొనసాగించే సంప్రదాయం ప్రాచీకంలోనూ, మధ్యయుగాలలోను, వలస కాలంలోనూ స్థిరపడింది. అందుకే గవర్నర్‌ను ఎప్పుడు కేంద్రమే నియమించడం, ఆయన కేంద్రానికి ప్రతినిధిగా ఉండటం జరిగేది. స్వతంత్ర భారత దేశంలో ప్రజాస్వామ్యాన్ని పాలన పద్ధతిగా ఎంచుకున్నాం. స్వపరిపాలన వ్యవస్థలో ప్రజలే ప్రభువులు. అధికారంలో ఎవరుండాలో వాళ్ళు ఏమి చేయాలో నిర్ణయించాల్సింది ప్రజలు. ప్రజాస్వామ్యంలో పాలకులు సేవకులు మాత్రమే. అందులో ఎన్నో భాషలు, ప్రాంతాలు, మతాలు, కులాలు మరెన్నో వైవిధ్యాలు ఉన్న భారతదేశంలో రాజ్యాంగ రీత్యా జాతీయస్థాయిలో ఒక ప్రభుత్వం ఉండగా రాష్ట్రాలలో వేరే ప్రభుత్వాలు ఉంటాయి. రాజ్యాంగంలోని 246వ అధికరణం ప్రకారం షెడ్యూల్‌లో జాతీయ, రాష్ట్రస్థాయిలో చట్టసభల అధికారాలను స్పష్టంగా నిర్వచించారు. అలాంటప్పుడు యూనియన్ ప్రభుత్వం తన ప్రతినిధులను రాష్ట్రాలకు గవర్నర్లుగా పంపడం, ఆ గవర్నర్లు రాష్ట్ర అధిపతులుగా ఉండడం, అవకాశం వచ్చినప్పుడల్లా రాజకీయాలలో వేలు పెట్టి గందరగోళం సృష్టించడం, అందునా రాష్ట్రంలో అధికార పార్టీ కేంద్రంలో ప్రతిపక్షం అయినప్పుడు అర్ధరాత్రి మంతనాలతోనూ. కుట్రలతోనూ ప్రభుత్వాలను మార్చే ప్రయత్నం చేయడం ఇవన్నీ పూర్తిగా ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత పెద్ద మద్దతుతో అధికారాన్ని చేపట్టినా గవర్నర్ ఎప్పుడు ఏ ఇబ్బంది కలిగిస్తాడో అన్న ఆందోళనకు గురికాక తప్పదు. రాజ్యాంగ రీత్యా రాష్ట్రానికి అధిపతి గవర్నర్ అన్య నిర్ణయాలు ఆయన పేరుతో జరుగుతాయి, అన్ని చట్టాలు ఆయన ఆమోద ముద్రలతో మాత్రమే అమలవుతాయి. ముఖ్యమంత్రి, మంత్రివర్గాన్ని నియమించాల్సింది గవర్నర్. 356వ అధికరణం కింద రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయవలసింది అని, రాష్ట్రపతి పాలన పేరుతో తన పాలను విధించాలని సిఫారసు చేసేది గవర్నర్. రాష్ట్ర శాసనసభను రద్దుచేసి మధ్యంతర ఎన్నికలకు ఆదేశించేది గవర్నర్. అందువల్ల క్యాబినెట్ పరిపాలనలో చూడడానికి గవర్నర్ పాత్ర నామ మాత్రమే అయినప్పటికీ వాస్తవానికి దాన్లో చాలా రాజకీయం ఇమిడి ఉంది. 356వ అధికరణం దుర్వినియోగాన్ని పరిశీలిస్తే గవర్నర్లు రాజకీయ మాయ జూదంలో పాచికలుగా ఎలా ఉపయోగపడ్డారో గత అనుభవాలను చూస్తే తెలుస్తుంది. నూరుసార్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేసి రాష్ట్రపతి పాలన పేరుతో గవర్నర్ ద్వారా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ పాలన ప్రవేశపెట్టారు. అందులో అత్యధిక పర్యాయాలు కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వాలే వేటుకు గురయ్యాయి. ఈ ఒక్క అంశం చాలు గవర్నర్లను ఎలా ఉపయోగించుకుంటున్నారో తెలపడానికి.

**ప్రక్షాళన అవసరం**

మన దేశంలో గవర్నర్ల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలే ప్రభుత్వాధినేతను నేరుగా ఎన్నుకోవాలి. ఇలా ఎన్నికైన వారు ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగాధినేతగాను వ్యవహరించాలి. ఈ పద్ధతిలో రాజకీయ అస్థిరతకు, అనిశ్చిత స్థితికి ఆస్కారం ఉండదు. పైగా నిజాయితీతో కూడిన సుపరిపాలన అందించే ప్రభుత్వ ఏర్పాటు సాధ్యమవుతుంది. లేదంటే గవర్నర్లను పరోక్ష పద్ధతిలో ఎన్నుకోవాలి. రాష్ట్రపతిని ఎన్నుకున్నట్టే రాష్ట్రాల్లోని చట్టసభలు గవర్నర్లను ఎన్నుకోవచ్చు. అలాగే సదరు గవర్నర్లను తొలగించే అధికారం చట్టసభకే ఉండాలి. ఇలా గవర్నర్ల నియామకంలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయానికి అడ్డుకట్ట వేయవచ్చు. అప్పుడు గానీ మనదేశంలో అధికార వికేంద్రీకరణ, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ సాధ్యం కావు. ☆

# అడాలసెన్స్ - పరిణతి ప్రజాస్వామ్యమే మార్గం

భారతదేశంలో ఈవేళ 120 కోట్ల మంది మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్నారు..అందులో సగం స్మార్ట్ ఫోన్లు. స్మార్ట్ ఫోన్ల యుగం వచ్చాక ఇంటర్నెట్ వినియోగం శరవేగంగా పెరిగింది. చైనా తర్వాత అత్యధికంగా 100 కోట్లమంది దాకా మన దేశంలో నెట్ వినియోగదారులున్నట్లు అంచనా. వీరిలో ఎక్కువ శాతం, ఎక్కువ సమయం ఫోన్ ద్వారా వినియోగిస్తున్నవారే. వీరిలో సగంమంది దాకా, అంటే 50 కోట్లదాకా సోషల్ మీడియా ఖాతాను కలిగి ఉన్నవారు. భారత్‌లో 18 ఏళ్ల లోపు వయసున్న పిల్లలు 48 కోట్లు (ప్రపంచంలో 19 శాతం) కాగా, వారిలో కౌమర దశలో (అడాలసెన్స్) ఉన్నవారు 25.3 కోట్లకు పైగా ఉంటారని అంచనా. ఇది ప్రపంచంలోనే అత్యధికం. భారతీయ యువతలో 40 కోట్లమంది దాకా సోషల్ మీడియాను వినియోగిస్తుండగా, మొత్తం సోషల్ మీడియా వినియోగ దారుల్లో టీనేజ్, కౌమారదశలో ఉన్నవారు 31 శాతం పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై సంచలనం సృష్టిస్తున్న బ్రిటిష్ డ్రామా మినీ సిరీస్ 'అడాలసెన్స్' గురించి ఎక్కువ చర్చించాల్సిన అవసరం భారతదేశానికే కనిపిస్తుంది.

ఎక్కువసేపు స్మార్ట్‌ఫోన్లు వాడడం వల్ల కంటిచూపు , శారీరకంగా ఇతరత్రా సమస్యలతో పాటు మానసిక రుగ్మ తలు కూడా తలెత్తుతున్నాయని ఇటీవల తరచూ హెచ్చ రికలు వింటున్నాం. నెట్‌ని వివిధ రకాల అవాంఛనీయ కంటెంట్‌కి వినియోగించటంతో పాటు, సోషల్ మీడియా ఖాతాదారులైతే నిజానిజాలతో సంబంధం లేకుండా భావో ద్వేగ సమాచారాన్ని ఎక్కువ నమ్ముతుండటం, ఇతరులతో పంచుకోవటం, లైక్‌లు, కామెంట్ల ఉచ్చులో చిక్కుకుని ఆ ప్రవాహంలో కొట్టుకుపోవటం ఇటీవల ఎక్కువవుతోంది. ఈ రకమైన అనాలోచిత ధోరణి, ప్రతికూల భావోద్వేగాలతో పాటు సైబర్ బుల్లీయింగ్ ఒక పెద్ద కారణంగా ఉంది. రోజువారీ మానవ సంబంధాల్లో వృత్తి వ్యాపారాల్లో పరిణితితో ఉండే వయోజనులు కూడా బుల్లీయింగ్ దెబ్బకి బేజారెత్తిపోతున్న సందర్భాలు అనేకం రిపోర్టవుతున్నాయి. కాస్త సున్నిత మనస్తత్వం కలవారైతే సోషల్ మీడియా ఖాతా లకే స్వస్తి చెబుతున్నారు.

సింపుల్‌గా చెప్పాలంటే బుల్లీయింగ్ అంటే దాదాగిరి. ఎదుటవారి మీద జులుం చెలాయించటం. సోషల్ మీడియా రాకముందు, 'బ్రో' భాష రాకముందు కూడా బుల్లీయింగ్



ఉంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఉంది. బండోడు అని లోలోపల తిట్టుకుంటూ, భయపడుతూ అన్నా అన్నా అని వెనకాల తిరగటం కాలేజీల్లో, గల్లీల్లోనే కాదు - స్కూళ్లలో, బాల్యం లోనూ పలువురికి అనుభవమే. సిని మాల్లో, రాజకీయాల్లో, కొన్ని పనిచేసే ప్రదేశాల్లో ఇప్పటికీ ఈ ధోరణి కొనసాగుతోంది.

ఈమధ్య అమెరికా అధ్యక్షుడిగా (పోటస్) రెండోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ చిన్నప్పుడు తెగ బుల్లీయింగ్ చేసేవాడట. అమెరికా ప్రజల్లో ఎక్కువమందికి తమ ఆర్థిక భవిష్యత్తు పట్ల అభద్రత ఏర్పడి, మరోవంక ప్రపంచంలోనే అన్ని దేశాలవారికంటే తాము అధికులుగా కొనసాగాలనే కోరిక బలంగా కొనసాగుతున్న తరుణంలో - ఓ పెద్ద కుదుపు రాజకీయంగా అవసరమైంది. అవగాహన కంటే, మూకుమ్మడి భావోద్వేగం ఆధిపత్యం చెలాయిస్తున్న ఆ వాతావరణాన్ని బుల్లీయింగ్ స్వభావాన్ని తెంపరితనంతో ప్రదర్శించే ట్రంప్ సద్వినియోగం చేసుకున్నారు. బలహీన ప్రత్యర్థులు అతనికి కలిసొచ్చారు. దీంతో స్వింగ్ స్టేట్స్‌లో కూడా అలవోకగా పాపులర్ ఓట్లను, సీట్లను సాధించి భారీ విజయాన్ని అందుకున్నారు. అత్యధిక శాతం ప్రజలు ఆశి స్తున్న ఆర్థిక, అమెరికా ఆధిపత్య హోదా, భద్రతను అందిం చేందుకు సృజనాత్మక ప్రయత్నం చేయకుండా, టారిఫ్‌లు, డోజ్, దేశాలను విలీనం చేసుకోవటం లేదా కొనుగోలు చేయటం, భారత్-పాక్ అణు యుద్ధం ఆపానని ప్రగల్భాలు వంటి బుల్లీయింగ్ ధోరణుల్ని పోటస్‌గా కూడా ట్రంప్ ప్రదర్శిస్తున్నారు. మద్దతుదారుల్లోనూ భయాందోళనల్ని, గందరగోళాన్ని పెంచుతున్నారు. ట్రంప్ తిక్కకీ ఓ లెక్కుంది. కానీ, ఆ తిక్కలో బుల్లీయింగ్ వ్యవహారశైలి పాళ్లు ఎక్కువ వటం వల్ల లెక్క తప్పుతున్నారని ఎక్కువమంది అభిప్రాయం.


ట్రంప్‌కి ఓటు వేసినవారు వేగంగా అభిప్రాయాలను మార్చుకోవటంలోనూ ట్రంప్ స్టయిల్‌ను అనుసరిస్తున్నారు. అయితే ట్రంప్ యుద్ధపిపాసి కాకపోవటం పెద్ద ఊరట.

ప్రత్యక్షంగా మనకు కనిపించే బుల్లీయింగ్ కంటే ఎక్కువ ప్రభావం చూపేది, భయాందోళనల్ని పెంచేది, కొన్ని సందర్భాల్లో ప్రమాదంలోకి నెట్టేది సైబర్ బుల్లీయింగ్.

జంతు ఆకారాన్ని దాటేసి, జంతు లక్షణాల్ని ఇప్పుడిప్పుడే అధిగమిస్తున్న మానవాళిలో చాలామందికి ఈ స్థితప్రజ్ఞ పక్వత ఉండదు. తమను ఇతరులెవరూ చూడటం లేదను కుంటే, అవకాశం వస్తే ఎంత అసాంఘిక చర్యకైనా వెనుకాడకపోవటం చాలా సందర్భాల్లో చూస్తుంటాం. సినిమా హాల్లో కరెంట్ పోయినప్పుడు ఈలలు వేయటం, గ్రామాల్లో నుంచి సిటీల్లోకొచ్చాక తమను ఎవరూ గుర్తుపట్టేవారు లేరనుకుంటే, బస్సుల్లో, బహిరంగ ప్రదేశాల్లో చిల్లర చేష్టలకు పాల్పడటం ఇలాంటివే. సరిగ్గా ఇదేతరహా తీరుతెన్నుల్ని ఊరూపేరూ తెలియకుండా స్పందించే అవకాశమున్న సోషల్ మీడియాలో ప్రదర్శిస్తుంటారు.

మనిషి సృష్టించిన ఎంత గొప్ప సాంకేతికతనైనా, ఆవిష్కరణనైనా ఛేదించవచ్చు. కానీ దేశాల సరిహద్దులు లేకుండా, కోట్ల సంఖ్యలో వెల్లువెత్తే పోస్టుల నుంచి తప్పు చేసినవారిని పట్టుకోవటం అంత తేలిక్కాదు. ఈ సంక్లిష్టతలు, రాష్ట్రాలు, దేశాల సరిహద్దులు దాటివెళ్లి అరెస్టు చేయటానికుంటే ప్రయాసలు పలువురికి వెసులుబాటుగా మారుతోంది. ఇటీవలి కాలంలో ప్రజల్లో సైబర్ అవగాహన పెంచేందుకు కృషితోపాటు, పోలీసులు కూడా ప్రత్యేక నైపుణ్యాలతో సైబర్ భద్రతా దళాల్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా స్కూలు స్థాయి నుంచి సైబర్ నిబంధనలు, జాగ్రత్తలు వంటివాటి మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా మానవ మనస్తత్వాన్ని కచ్చితంగా నియంత్రించటం ఈ రంగంలో ఇంకా సాధ్యం కావటం లేదు. ఎంతోకొంత అవగాహన ఉన్నా కూడా దురాశ కొద్ది నకిలీ లింక్‌ల మీద క్లిక్ చేసి మోసపోవటం, భావోద్రేకాలతో బుల్లీయింగ్ బారినపడటం కొనసాగుతూనే ఉన్నాయి.

ఇలాంటి నేపథ్యంలో 'అడాలసెన్స్' నాలుగు ఎపిసోడ్ల మినీ సిరీస్ విడుదలై నెట్‌ఫ్లిక్‌లో సంచలన రికార్డుల్ని నమోదు చేస్తోంది. మన దేశంలోనూ చాలామంది ఈ సిరీస్‌ను చూసి ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా ప్రామాణిక పత్రికల, విమర్శకుల రివ్యూలు ఒక చిత్రాన్ని ప్రశంసించటం వేరు – పర్ఫెక్ట్ అని దాదాపు అందరూ నూరుశాతం మార్కులివ్వటం వేరు. కథా వస్తువు, కథనం, సాంకేతిక విలువలు, నటీనటుల అభినయం – ఇలా అన్నిట్లో ఫుల్ మార్కులు



సంపాదించిందీ సిరీస్. మన స్కూళ్లు, కాలేజీల్లో వచ్చే దొంగ మార్కుల సర్టిఫికెట్లు కావివి. కోట్ల మంది ముక్తకంఠంతో పెద్దగా విభేదించకుండా పట్టం కట్టిన చిత్రం 'అడాలసెన్స్'. నెట్‌ఫ్లిక్స్ చూడనివారు కూడా సబ్‌స్క్రైబ్ చేసిమరీ చూశారు. ఆ వెబ్ సిరీస్ అంతగా ప్రశంసలు పొందటానికి అద్భుత రూపకల్పన మాత్రమే కారణం కాకపోవచ్చు. అందులో ప్రస్తావించిన సమస్య భారత్‌లో ఇప్పుడిప్పుడే పెరుగుతుంటే – పట్టణీకరణ, దాన్నుంచి అభివృద్ధి చెందిన దేశాల్లో చాలా ఇళ్లల్లో సమస్యగా మారింది.

ఈ చిత్రానికి సహ రచయితగా ఉన్న స్టీఫెన్ గ్రాహం బ్రిటన్‌లో కొందరు టీనేజ్ అబ్బాయిలు, తోటి అమ్మాయిల్ని కత్తితో పొడిచి చంపటం వార్తల్ని చదివి షాక్ తిని, ఆ సంక్షోభం మీదకి సమాజం, ప్రపంచం దృష్టిని తెచ్చేందుకు ఈ సిరీస్ ఆలోచన చేశారట.

ఇందులో జేమీ అనే 13 ఏళ్ల పిల్లవాడు కేటీ అనే తోటి వయసు అమ్మాయిని కత్తితో పొడిచి చంపుతాడు. జేమీ తల్లిదండ్రులు నేరపూరిత స్వభావులు కాదు. తాగుడు, భౌతిక హింసకు పాల్పడటం వంటి గృహహింస వాతావరణం అతనికి లేదు. ఒక పిల్లవాడ్ని నేరస్తుడిగా మార్చే కుటుంబ నేపథ్యం లేదు. ఒక సాధారణ, సమాజం ఆమోదించే, ఆదర్శప్రాయంగా కూడా భావించే వాతావరణం లోనే జేమీ పెరిగాడు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశంలోని, పట్టణాలు, నగరాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరుగుతున్న గ్రామీణ ప్రాంతాల్లో చాలా కుటుంబాలు అడాలసెన్స్ చూసి ఉలిక్కిపడ్డాయి. స్పష్టంగానో, అస్పష్టంగానో తాము ఎదుర్కొంటున్న ఓ పెద్ద సమస్యకి ఇందులో

పరిష్కారం వెతుక్కునే ప్రయత్నం చేశాయి. బహుశా ఈ ఐడెంటిఫై చేసుకోవటం వల్ల కూడా సిరీస్ అంత చర్చాంశమైంది.

కేవలం ఇది వ్యక్తిగత సమస్యో, ఓ కుటుంబంలో పరిష్కరించుకునే సమస్యో అయివుంటే, మనం ఇక్కడ మాట్లాడుకోనక్కర్లేదు. ఇందులో కొన్ని వ్యవస్థీకృత అంశాలున్నాయి. వీటి మీద కూడా పలువురు విశ్లేషించారు. హత్యారోపణ మీద జేమీని అరెస్ట్ చేయటంతో కథ మొదలవుతుంది. తన తోటి యుక్తవయసు అమ్మాయిని అతను చంపేశాడంటే తండ్రి ఏమాత్రం నమ్మలేడు. జేమీ అంత అమాయకంగా ఉంటాడు. స్కూల్ నుంచి టైమ్‌కి వచ్చి తన గదికి వెళ్లి తలుపేసుకుని ఫోన్ చూసుకుంటుంటాడు. చాలామంది తల్లిదండ్రుల్లాగే జేమీ అమ్మానాన్న కూడా తమ పిల్లాడు తన పనేదో తాను చూసుకుంటున్నాడు, తనకు కావాలసిన సమాచారాన్ని నెట్‌లో, సోషల్ మీడియాలో వెతుక్కుంటున్నాడు అనుకుంటారు. కానీ అతను విషతుల్యమైన భావాల్ని నింపే – అబ్బాయి అంటే పురుషాధిక్యం, హింస, అదే హీరోయిజం, అలాంటి 20 శాతంమంది మగవారినే అమ్మాయిలు ఇష్టపడతారు అనే భ్రమలోకంలోకి నెట్టే కంటెంట్‌ని అదేపనిగా చూస్తుంటాడు. ఎదిగీ ఎదగని మెదడులో ఆ విషప్రభావం తీవ్రతను తల్లిదండ్రులు, జేమీ అక్క గుర్తించలేకపోతారు.

ప్రతికూల, విద్వేష కంటెంట్ ఆకర్షించినట్లుగా సానుకూల, సామరస్య భావాల అంశాలు ప్రజలను, ముఖ్యంగా యువతను, కౌమార వయసువారిని అంత తొందరగా ఆకట్టుకోవు. మన తెలుగునాటే తీసుకుంటే, వయసు మళ్లినవారు కూడా మసాలా వీడియోలు, షార్ట్స్, రీల్స్ ఎక్కువగా చూస్తుంటారు. ఒకప్పుడు ఇలా చూడటానికి మొహమాటపడేవారు. ఇప్పుడు ఇంట్లో మద్యం సేవించటంలాగే – మసాలా కంటెంట్ చూడటం ఒక సాధారణంగా మారింది. ఇలాంటి కంటెంట్ చూసినవారంతా జేమీ లాగే వ్యవహరించకపోవచ్చు. కానీ కౌమారదశలో ఈ కంటెంట్ ప్రభావం చాలా తీవ్రస్థాయిలో ఉంటుంది. సమాజంలో 60–70 శాతం మంది నేరాలు చేస్తుంటే, వాటిని నేరాలు అనరు. అదొక యుగధర్మం ఒరవడి కింద మారిపోతుంది. నేరాలంటే, ఓ ఐదుశాతం లోపు మంది మాత్రమే చేసేవి. వారిని నియంత్రించటం కోసమే చట్టాలు, జైళ్లు! ఇంకో అయిదు శాతంమంది, ఎలా ఉన్నా మంచే చేస్తారు. వాళ్లకి నిబంధనలు, చట్టాలు అక్కర్లేదు. మిగిలిన 90 శాతం మంది ఎటు బలంగా గాలి కొడితే అటు తిరుగుతారు. వీళ్లకి చట్టాల్ని అమలు చేయరు. కానీ పోలీస్ ఒక కటౌట్ తో ట్రాఫిక్‌ని నియంత్రించినట్లు, చట్టాల్ని చూపి వీరిని సరైన మార్గంలో నడిపించటం సుపరిపాలన.

ఇది మంచి, అది చెడు అని అర్థమయ్యే వయసు వచ్చిన వారు విషతుల్య కంటెంట్ చూసినా పెద్దగా ప్రభావితం కారు. భ్రమల లోకానికి వాస్తవికతకు మధ్య తేడాను గుర్తించగలుగుతారు. వారిలో కూడా ఇటీవల వర్చువల్ ప్రపంచ విహార వ్యసనపరులు పెరుగుతున్నా – ఉద్రేకం కంటే అవగాహనా స్థాయి కాస్తయినా ఎక్కువ ఉండే అవకాశం ఉంది కాబట్టి, వారికి మానసిక చికిత్స కొంతలో కొంత తేలిక. కానీ కౌమార వయసు (అడాలసెన్స్)లో ఉన్నప్పుడు వారిమీద ఏది ప్రభావం చూపుతుందో అదే నిజమనిపిస్తుంది. వారి హార్మోన్ల వల్ల ఆ నెగెటివ్ ప్రభావం కూడా చాలా ఎక్కువగా, తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈవేళ సోషల్ మీడియాలో ఉన్న ఇన్ ఫ్లుయెన్సర్లలో ఎక్కువమంది యువత ఉద్వేగాలను ప్రతికూలంగా రెచ్చగొట్టి ఆకర్షించటం ద్వారానే ఆ స్థాయికి ఎదిగారనేది నిర్వివాదాంశం. కులం, మతం, ప్రాంతం, భాష, వర్ణం, డబ్బు, లింగం, పార్టీ – ఇలా ఏదోరకంగా విద్వేషాల్ని ప్రేరేపించటం ద్వారా యువ వీక్షకుల్ని ఆకట్టుకోవటం తేలిక. సానుకూల, జనహిత అంశాల ద్వారా రాత్రికి రాత్రి ఇన్ ఫ్లుయెన్సర్ కావటం దాదాపు అసాధ్యం. సమాజం పట్ల ప్రేమతో చెక్కు చెదరని ఓపికను ప్రదర్శించగలిగేవారే ఎప్పుడో ఒకప్పటికి ఆ స్థాయిని అందుకోగలుగుతారు, సుస్థిరంగా నిలబడ గలుగుతారు.

**తల్లిదండ్రుల అప్రమత్తత కీలకం**

ఈ నేపథ్యంలో పరిచయస్తులు తప్ప వాస్తవ స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్దగా ఉండని వర్చువల్ ప్రపంచం యువత మీద ఎక్కువ ప్రభావం చూపుతుంది. చిన్నతనం నుంచి సరైన పెంపకం, ఆరోగ్యకరమైన అలవాట్లు, సమాజంతో సమన్వయం చేసుకోగలిగే మంచి ప్రమాణాల పూర్వ ప్రాథమిక స్కూలు శిక్షణ, పాఠశాల విద్య, వివక్ష లేని ప్రజాస్వామిక ఆలోచనా తీరు వంటివి అందించటం, మంచి, చెడు విచక్షణతో ఆలోచించి సొంతంగా నిర్ణయాలు తీసుకోగలిగేంత వరకూ పిల్లలు చూసే ఆన్‌లైన్ కంటెంట్, అనుసరించే సోషల్ మీడియా ఖాతాలలో నిజానిజాల్ని, అవసరాల్ని, అనవసరాల్ని ఓపిగ్గా, స్నేహపూర్వకంగా తెలియ చెబుతూ నిరంతరం అప్రమత్తంగా ఉండటం తల్లిదండ్రులు తమ అనివార్య బాధ్యతగా భావించాలి. ఉద్దేశపూర్వకంగా చేసే సైబర్ బుల్లీయింగ్ బారినపడకుండా కాపాడుకోవటం, అటువంటివారికి దూరంగా ఉండటం, హద్దుల్ని పాటించటం, ఒకవేళ పొరపాటున బుల్లీయింగ్ బారినపడినా ఆరోగ్యకరమైన రీతిలో స్పందించి ఆ గాయాన్ని మాన్పు

కోవటం – ఇలాంటి వాటిపై తరచూ పిల్లలతో చర్చిస్తుండాలి. తల్లిదండ్రులు పిల్లలకు పూర్తి స్నేహితుల్లా మారలేక పోవచ్చుగానీ, వారు తమ సమస్యల్ని, భావాల్ని స్వేచ్ఛగా చెప్పుకోగలిగే ప్రజాస్వామిక వాతావరణాన్ని ఇంట్లో నెలకొల్పటం, పరిరక్షించటం పెద్దలు ఎప్పుడూ విస్మరించకూడని విధి.

**బ్రిటన్ ప్రధానమంత్రే అలా చెప్పారంటే ..**

పేదరికంలో పుట్టి, తల్లిదండ్రులకు చదువులేకున్నా, రోజువారీ సంపాదన కోసం వారు పొద్దున వెళ్లి రాత్రికి తిరిగి వచ్చినా కొందరు పిల్లలు బుద్ధిగా చదువుకుని ఎదగటం లేదా? జీవితంలో బాగా సెటిలవటం లేదా? అనొచ్చు. కానీ అలాంటి వారి సంఖ్య, ముఖ్యంగా మన దేశంలో ఉన్నకొద్దీ తగ్గే అవకాశాలే ఎక్కువ. ప్రజాస్వామ్యానికి పేరుగాంచి, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలనకు ఎంతో ప్రాధాన్యతనిచ్చే బ్రిటన్ లాంటి దేశంలో అడాలసెన్స్ సిరీస్‌ని అన్ని స్కూళ్లలో ప్రదర్శించాలని సాక్షాత్తూ ప్రధానమంత్రి కైర్ స్టార్మర్ సూచించారంటే – బ్రిటన్ కంటే 20 రెట్లు పైగా జనాభా, అందులోనూ ఎంతో సంక్లిష్ట వైవిధ్యం, దుష్పరిపాలన కలిగి, ఇప్పుడిప్పుడే విప్పారిన కళ్లతో ప్రపంచాన్ని చూస్తున్న మనలాంటి దేశం ఇంకెంత అప్రమత్తమవ్వాలి?!

అడాలసెన్స్ సిరీస్‌లో హత్యకు ప్రేమ వ్యవహారం కారణం కాదుగానీ – మన దేశంలో ప్రేమ పేరుతో అలాంటి హత్యల్ని ఎక్కువగానే చూస్తున్నాం. అదేవిధంగా, అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే మన దేశంలో మహిళలపై అత్యాచారాలు, హింస తక్కువేగానీ, పురుషాధిక్యం తక్కువేమీ కాదు. ఎంతో అభ్యుదయ భావాలున్నాయని చెప్పుకునే వారిలో కూడా అసంకల్పితంగా పురుషాధిక్య మొగ్గ తొంగిచూస్తుంటుంది. తమ ఇంట్లో అమ్మాయిల్ని ప్రేమగానే అయినా, 'ఏరా' అని పిలుస్తుంటారు. గబుక్కున 'ఆడ'పిల్ల అనేస్తారు. ఆ అమ్మాయి సొంతిల్లు ఇదికాదు అన్నట్లు తల్లిదండ్రులే మాట్లడేస్తుంటారు. కాబట్టి ఇప్పుడున్న పరిస్థితుల్లో బ్రిటన్ స్కూళ్లకంటే మనదేశం లోని స్కూళ్లలో ఈ చిత్రాన్ని ప్రదర్శించటం ఎక్కువ అవసరం. తల్లిదండ్రులూ నెట్‌ఫ్లిక్స్‌లో చూడటం అవసరం. అందుకే కథ గురించి ఇందులో ఎక్కువ ప్రస్తావించటంలేదు.

అడాలసెన్స్ చూశాక, చూడకముందైతే వివిధ సమీక్షలు చదివాక, ఆ నోట ఈనోటా విన్నాక – ఈ ప్రశ్నల్ని, పరిష్కారాల్ని మనసుపెట్టి చర్చించటం, పట్టించుకోవటం మనలో ప్రతి ఇంటికీ కీలకం.

★ తన తోటి అమ్మాయిని హత్య చేసిన జేమీకి జన్యుపరమైన సమస్యలేమైనా ఉన్నాయా?

★ తల్లిదండ్రులు చెప్పిన నీతుల నుంచి కంటే వారి ప్రవర్తన నుంచి పిల్లలు ఎక్కువ నేర్చుకుంటారు. తనకు తెలియకుండానే జేమీ తండ్రి పురుషాధిక్యతను ప్రదర్శించారా? కూతురు కన్నా కొడుకు ఎక్కువ అనే భావాన్ని తల్లి పెంచి పోషించారా?

★ ఈ తరం పిల్లలు తమ సోషల్ మీడియా సంభాషణల్లో షేర్ చేసుకునే పదాలు తల్లిదండ్రులకు అర్థం కాకపోవచ్చు. అడాలసెన్స్‌లో జేమీ, కేటీ మధ్య షేర్ అయిన ఎమోజీలు, ఇన్ సెల్ వంటి పదాలు, అమ్మాయిలు 20 శాతం మంది పురుషుల్నే ఇష్టపడతారనే కాన్సెప్ట్‌లు ఆ కుర్రాడి తల్లిదండ్రులకు తెలిసుండకపోవచ్చు. కానీ తరాలు మారినా, సాంకేతికత ఎంత పెరిగినా – మానవ సంబంధాలు, విలువలు మారవు. వాటిపట్ల స్పష్టత ఉంటే – అర్థాన్ని కాకపోయినా, అంతరార్థాన్ని పెద్దలు తేలిగ్గా పసిగట్టవచ్చు. జేమీ తల్లిదండ్రుల్లో అటువంటి అపరిపక్వత ఏమైనా ఉందా?

★ జేమీ తనకు నచ్చని అంశం ఎదురైనప్పుడు హింసను ప్రదర్శించేవాడా? ఎందుకంటే, ఈ మొత్తం ఎపిసోడ్‌లో ప్రధానమైన అంశం హింస! ఒక వ్యక్తికి రకరకాల కోరికలుండొచ్చు, భావావేశాలు కలగొచ్చు, ఎవరి పట్లయినా ఆకర్షణో, ప్రేమో కలగొచ్చు – అంతవరకూ తప్పులేదు. కానీ దాన్ని ఆచరణసాధ్యంగా, హింసకు దారి తీయకుండా పరిష్కరించుకోగలిగితే అది పరిణితి, నాగరికత!

ఒక అడల్ట్ కంటెంట్ చిత్రాన్నో, సినిమానో చూసి మనుషులు అది నిజం అనుకోరని, కాల్పనికతకు వాస్తవ ప్రపంచానికి మధ్య తేడాని ఆరోగ్యకరమైన వ్యక్తులు గుర్తించగలరనే విశ్వాసం! అందుకే 'మంచి పుస్తకం, చెడ్డ పుస్తకం అని ఉండవు – బాగా రాసిన పుస్తకం, చెత్తగా రాసిన పుస్తకం మాత్రమే ఉంటాయి'. 'సినిమాలు చూసి మనుషులు చెడిపోతారా' అనే అభిప్రాయాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. వీటిల్లో వాస్తవం ఉండొచ్చుగానీ, పట్టణీకరణ, పోటీ ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరుగుతున్నప్పుడు, సాంకేతికత పెరుగుతూ తాత్కాలిక ఆనందాన్నిచ్చే భావోద్వేగ కంటెంట్ వరదలా వచ్చిపడుతున్నప్పుడు, వాటి ప్రభావం కచ్చితంగా ఉంటుంది; పెరుగుతుందే తప్ప తగ్గదు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన 'దేవదాసు' సినిమా విడుదలయ్యాక, కొందరు తాగుబోతులయ్యారట, ఇంకొందరు తాగుడు మానేశారట. నిజ జీవితానికి, వర్చువల్ ప్రపంచానికి మధ్య హద్దులు చెరిగిపోతూ, వినిమయ సంస్కృతి ఆర్థికాభివృద్ధికి సంకేతంగా మారినప్పుడు నెగెటివ్ భావోద్వేగాల ప్రభావంలో కొట్టుకుపోయేవారు ఎక్కువవుతుంటారు. అందుకే, ఫలానా సినిమా చూసో, యూట్యూబ్ వీడియో చూసో ఈ నేరం చేశాను, ఆ దాడికి పాల్పడ్డాను అని చెప్పే కేసులు ఇటీవల

ఎక్కువగా రిపోర్టవటం చూస్తున్నాం.

పిల్లలకు స్కూలు స్థాయి నుంచి లైంగిక విద్య, అమ్మాయిలతో స్నేహపూర్వకంగా, గౌరవభావంతో మెలగటం వంటివి నేర్పించటానికి సంకోచిస్తుంటాం. ఆ పరిస్థితి వల్లే కుల వివక్ష లోపల లింగ వివక్ష, అంటే దాంపత్య జీవితంలో వైవాహిక అత్యాచారాలను అత్యున్నత న్యాయస్థానంలోని జడ్జీలు కూడా మామూలే అనుకుంటారు. దేశ పార్లమెంటు, రాష్ట్రాల చట్టసభలు కూడా ఈ కుహనా నైతికతను నిజమైన నైతికతగా భ్రమపడుతూ పురుషాధిక్యాన్ని, అందులో భాగంగా హింసని ప్రోత్సహిస్తున్నాయి. మన సినిమాలు, ఇతర సాంస్కృతిక సాధనాలు చాలావరకు ఇదే ధోరణిని మన మెదళ్లపై రుద్దుతున్నాయి. ఇది ఎంత సహజంగా అనిపిస్తుందంటే, ఎంతో ఉన్నత చదువులు అభ్యసించినా ఆర్థిక స్వావలంబన లేకుండా ఇంటికే పరిమితం కావటాన్ని వ్యవస్థీకృత లోపంగా భావించటం చాలా తక్కువ శాతంలో మాత్రమే కనిపిస్తుంది. ఈ పురుషాధిక్య భావన, వయసు పెరిగినా లైంగిక పరిణతి లేకపోవటం మన దేశంలోనూ హింసకు దారితీస్తోంది. మహిళలపై హింస అంటే అత్యాచారం, యాసిడ్ దాడి, చంపటం వంటివి మాత్రమే కాదు – ద్వంద్వార్థాల మాటలతో కించ పరచటం, మహిళల అవయవాల్ని వర్ణిస్తూ బూతులు మాట్లాడటం, అనుమతి లేకుండా తాకటం, వివాహం ముసుగులో బలవంతపు లైంగిక చర్య వంటివన్నీ హింసకిందే వస్తాయి. ఒక కుటుంబం కావచ్చు, ఒక సమాజం కావచ్చు, ఒక దేశం కావచ్చు – హింసకు, అప్రజాస్వామిక ధోరణులకు పాల్పడిన ప్పుడల్లా ఆ మేరకు దీర్ఘకాలంలో నష్టపోతుంటాయి. అసలు చంపటం అనే ఘటన లేకపోతే అడాలసెన్స్ సిరీస్, దాని చుట్టూ చర్చే ఉండేది కాదు. అలాంటి హింసాత్మక ధోరణులనేమైనా జేమీ ప్రదర్శిస్తుండేవాడా?

★ తరచూ కార్యాచరణ కొరవడే వర్చువల్ ప్రపంచంలో, కోరికలు కళ్లాలు లేని గుర్రాలవుతుంటాయి. అంటే, ఆచరణ సాధ్యం కాని ప్రతికూల కోరికలు విపరీతమవుతుంటాయి. అలాంటి వ్యవహారశైలి, అసంతృప్తి జేమీలో పరోక్షంగానైనా కనిపించేదా?

★ కొంతమంది విశ్లేషకులు అడాలసెన్స్ గురించి మాట్లాడుతూ – అమ్మాయిలు పొట్టి డ్రస్‌లు వంటివి వేసు కోవటం వల్ల అబ్బాయిలు ఈవ్‌టీజింగ్‌లు, అత్యాచారాలకు పాల్పడుతుంటారని కొందరు సాంప్రదాయవాదులు సుద్దులు చెబుతుంటారని, కానీ పొట్టి డ్రస్‌లు వేసుకున్న అబ్బాయిల మీద అమ్మాయిలు సెక్స్ దాడులు ఎందుకు అడగరని వ్యాఖ్యానించారు. ఈ వాదన వినటానికి బాగుంటుంది గానీ – శరీర నిర్మాణపరంగా, లైంగికవాంఛ వ్యక్తీకరణలో స్త్రీ,పురుషుల మధ్య ఉండే తేడాను, ఈ రకమైన ఆలోచనా తీరు ఏరకంగానూ సమస్యను పరిష్కరించలేదనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపించదు. కేవలం ఇంగిత జ్ఞానంతో వ్యవహరించటం ఇక్కడ ఎక్కువ పరిష్కారం. ఈ రకంగా చూస్తే జేమీ పురుషాధిక్య తీవ్రతను ఎదుర్కొవటానికి కేటీ బుల్లీయింగ్ తరహా సమాధానాలు, ఎమోజీలతో జేమీ అహన్ని దెబ్బతీసిందా? జేమీది అనారోగ్యకర ఆలోచనాతీరు, వ్యవస్థ బాధితుడు అనే కొద్దిపాటి సానుభూతితో కూడిన ఇంగిత జ్ఞానంతో వ్యవహరించలేకపోయిందా? అనే ప్రశ్నను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కచ్చితంగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి నచ్చినట్లు నిర్ణయాలు తీసుకునే, తనను రక్షించుకునేందుకు గట్టిగా ప్రతిస్పందించే హక్కు కేటీకి ఉంది, ఈ విషయంలో జేమీ నేరస్తుడు – కానీ ఇంగిత జ్ఞానాన్ని కూడా మరచి వాళ్లు అలా వ్యవహరించటానికి కారణం ఎవరు? వయసు పెరిగిన వారు కూడా తాము వ్యవస్థ బాధితులమని చెప్పుకునే ఈ సమాజంలో – కౌమార దశలో వారి వ్యవహారశైలికి పూర్తిగా వారినే బాధ్యుల్ని చేయగలమా? ఈ ప్రశ్న పూర్తిగా జేమీ కోణంలోనే చర్చిం చటం సమంజమా? కొంతైనా కేటీ కోణాన్ని పరిగణలోకి తీసుకోవటం ఆచరణీయ పరిష్కారానికి అవసరం కాదా?

**మరి పరిష్కారం ఏమిటి?**

ప్రస్తుతానికి జేమీ అరుదైన కేసుగానే కనిపిస్తున్నా – ఉన్నకొద్దీ ఈ సమస్య, ప్రశ్నలు పెరగటం తప్ప తగ్గటం ఉండదు. ఊహించని స్థాయి సాంకేతిక మార్పులతో, మానవ సంబంధాల్లో ప్రాథమిక యూనిట్ అయిన కుటుం బం దాకా ఊహించని మార్పులు వస్తాయి. విషతుల్య కం టెంట్‌తో పాటు విషతుల్య మత్తు పదార్థాల వినియోగం వంటివి విజృంభిస్తాయి. ఎవరు ఎప్పుడు ఏ తరహాలో జేమీ లా మారతారో చెప్పలేం. ప్రతి ఒక్కరిలో మరింత ప్రజా స్వామిక ఆలోచనా తీరు, సమాజంలో ప్రజాస్వామిక సంస్కృ తి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రాజకీయ నేతలు, కళా కారులు, పౌర సమాజ నాయకులు ప్రజాస్వామిక రోల్ మోడల్స్‌లా వ్యవహరించటం, సోషల్ మీడియాలో నిజాల్ని ధ్రువీకరించుకోవటం, వీటన్నిటికీ వ్యవస్థీకృత నిర్మాణం కోసం మరింత నాణ్యమైన విద్య, ఆరోగ్యం (మానసిక సమ స్యలు సహా), చట్టబద్ధపాలన, సామరస్యతను పెంచే స్థానిక సాధికారిత, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ, సమన్యాయం, పరిణతి బహిరంగ చర్చా ప్రమాణాలు, మొద లైన అంశాల కార్యాచరణతో ప్రజాస్వామ్యాన్ని ఇంకా బలో పేతం చేయటం అవసరం. నూరో చిప్స్ వంటి వాటి ద్వారా మనుషుల కృత్రిమత్వం మనుషుల్లో కృత్రి మత్వం, సాంకే తికతలో సహజత్వం పెరుగుతున్న కొద్దీ సృజనాత్మకతతో ప్రజాస్వామ్యం తప్ప మరో పరిష్కారం లేదు. ✰

# కౌమార, యవ్వన వయసువారిలో పెరుగుతున్న మానసిక ఆందోళన

## – ఎంహెచ్‌క్యూ స్కేల్‌లో దిగువన హైదరాబాద్



కౌమారం నుండి యవ్వన దశ మొదలైన తరుణం వరకు పిల్లల్లో మానసిక ఆందోళనలు పెరుగుతున్నాయని ఓ అంతర్జాతీయ సర్వే ఇటీవల వెల్లడించింది. విచ్చలవిడిగా స్మార్ట్ ఫోన్ల వాడకం ప్రభావం కౌమార, యవ్వన దశల్లో తీవ్ర ప్రభావం చూపుతోందని తేల్చింది. వాటిలో రకరకాల కంటెంట్ చూడటం, ఏది నిజమో, ఎంతవరకు నిజమో, ఏది పూర్తిగా అవాస్తవమో తెలుసుకునే పరిణితి, పరిస్థితులు లేకపోవటం వారి మానసిక ఆరోగ్యాన్ని ఒడిదుడుకుల్లోకి నెడుతోంది. ముఖ్యంగా విచారం, ఆందోళన, దూకుడు, ఆత్మహత్య ఆలోచనలు, నలుగురితో కలవలేకపోవటం, వాస్తవికతకు దూరం కావటం, నిర్లిప్తత లాంటి ధోరణులు పెరుగుతున్నట్లు వెల్లడైంది. స్మార్ట్ ఫోన్లు నిద్రను దెబ్బతీస్తున్నాయి. దీంతోపాటు సరైన నియంత్రణాశక్తి కొరవడటం వల్ల సైబర్ బెదిరింపులు, ఆన్‌లైన్ మోసాలు, హానికరమైన కంటెంట్ తాకిడి నుంచి త్వరగా తేరుకోలేకపోతున్నారు. స్మార్ట్‌ఫోన్‌తో పాటు ఆహారం కూడా ప్రతికూల ప్రభావానికి దోహదం చేస్తోంది. అల్ట్రా ప్రాసెస్ట్, జంక్ ఫుడ్స్ తరచూ తీసుకునే వారిలో మూడు రెట్లు సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఎలక్ట్రానిక్ పరికరాలు, మారుతున్న జీవనశైలి ఉమ్మడి కుటుంబాలకు దూరం కావటం, అల్ట్రా ప్రాసెస్ట్ ఆహారం – యవ్వనం లోకి అడుగుపెడుతున్నవారి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అమెరికా వాషింగ్టన్ డీసీకి చెందిన సేపియన్ ల్యాబ్స్ ప్రచురించిన 'మెంటల్ స్టేట్ ఆఫ్ ది వరల్డ్ రిపోర్ట్' పేర్కొంది.

అత్యల్ప మెంటల్ హెల్త్ కోషంట్‌తో ఎంహెచ్‌క్యూ స్కేల్‌లో హైదరాబాద్ 58.3 స్కోరు సాధించింది. ఇది ప్రపంచ సగటు 63 కంటే తక్కువ. అదే సమయంలో చెన్నై (70.8), కోల్‌కతా (69.6), బెంగళూరు (64.2) కొంత మెరుగైన స్థితిలో ఉన్నాయి. 18 నుంచి 55 సంవత్సరాల వయసున్న 75 వేలమంది ప్రతిస్పందనల పరిశీలన ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు సంస్థ ప్రకటించింది. 32 శాతం మందిలో మానసిక ఆరోగ్యం సక్రమంగా లేదు. 55 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సువారు 102.4 పాయింట్లు సాధించగా – 18 నుంచి 24 ఏళ్లవారు కేవలం 27 పాయింట్లు స్కోరు చేశారు.


**తల్లిదండ్రుల పాత్ర కీలకం**

యువత ఆరోగ్యంగా, ఆనందంగా, ఆత్మవిశ్వాసంతో పెరగాలంటే రకరకాల కారణాలున్నా, తల్లిదండ్రులదే కీలకపాత్ర అని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య సరైన సంబంధాలు లేకపోవటం, నిరాదరణ వంటివి కౌమార యవ్వన దశల్లోని వారి మనస్సుల్ని త్వరగా ఒడిదుడుకులకు గురిచేస్తాయంటున్నారు. ఈ లక్షణాలు రెండు వారాలకు మించి కనిపిస్తే మానసిక వైద్యులను సంప్రదించాలి. అంతకంటే ముందు – సమస్యకు కారణమైన అంశాలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. జంక్‌ఫుడ్‌ను దూరంగా పెట్టి పోషకాహారం అందించటంతో పాటు, స్మార్ట్ ఫోన్ లోని అంశాలు, పరిమితులపై హేతుబద్ధంగా, పారదర్శకంగా వివరించటం, ఈ విషయాల్లో తమ ఆచరణ ద్వారా వారికి స్ఫూర్తినివ్వటం అవసరం. ✰

**ఆందోళనను ఎలా గుర్తించాలంటే –**

- ☞ ముభావంగా, ఒంటరిగా గడపటం
- ☞ ఇతరులను నిందిస్తూ మాట్లాడటం
- ☞ ఏడవటం, వస్తువులను విరగ్గొట్టటం
- ☞ అతిగా తినటం, లేదా ఆకలి తగ్గిపోవటం
- ☞ నిద్రలేమి, లేదంటే ఎక్కువ నిద్ర
- ☞ ఏకాగ్రత లోపించటం, బాధ, నిరాశ
- ☞ తగినంత గుర్తింపు లేదని కుంగిపోవటం
- ☞ అతి సున్నితత్వం, కోపం, చిరాకు

# కులగణన..విశ్లేషణ




కులగణనపై ఎప్పట్నుంచో చర్చ జరుగుతోంది. కుల ఆధారిత జనగణన నిర్వహించాలని ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తూ వచ్చింది. కుల జనగణన 'భారత దేశాన్ని విభజించే ప్రణాళిక' అని, 'అర్బన్ నక్సల్ ఆలోచన' అని అధికార పక్షం దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. వాదోపవాదాలు, భిన్నాభిప్రాయాలు సాగుతూనే ఉన్నాయి. అయితే యూనియన్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ఎట్టకేలకు దేశ 16వ జన, కుల గణనను 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని నిర్ణయించింది. అధికార, ప్రతిపక్షాల విమర్శలు, ప్రతి విమర్శల సంగతి ఎలా ఉన్నా..కుల ప్రాతిపదికన జనగణనపై లోక్‌సత్తాకు స్పష్టమైన వైఖరి ఉంది. 2011లోనే ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తన అభిప్రాయాలను వెల్లడించారు..

**సృజనాత్మక పద్ధతుల్లో సాయం అందించాలి**

2011-12 జనగణనను సామాజిక, ఆర్థిక, కుల సర్వేగా నిర్వహించారు. అయితే అందులో వచ్చిన కులాల సంఖ్య ఎవరూ ఊహించని స్థాయిలో లక్షల్లో ఉండటంతో, అది తప్పుల తడక అని స్వయంగా యూనియన్ ప్రభుత్వం 2021లో సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. రిజర్వేషన్ల కోసం ఈ సమాచారం ఉపయోగించలేమని తేల్చింది. 2011లో కులగణనను సర్వేలో భాగంగా చేసినప్పుడే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా వ్యతిరేకించారు. రిజర్వేషన్ కేటగిరిలో ఉన్నవారికి ఎలాగూ కులధ్రువీకరణ పత్రం ఉంటుందని, మిగిలినవారు, ముఖ్యంగా కులరహిత సమాజాన్ని కోరుకునేవారు కులంపేరు అడిగితే 'మేం చెప్పం, మాకు అక్కర్లేదు' అని స్పష్టంగా చెప్పండని పిలుపునిచ్చారు. పేరు చివర నాయుడు, రెడ్డి, చౌదరి వంటి కుల సూచికల్ని తొలగించుకోమని కోరారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని 1992లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన దరిమిలా, మిగిలిన కులాల్లో అవకాశాలు అందుకోలేని వారికి (ఉదాహరణకు గ్రామీణ నేపథ్యం, తల్లిదండ్రులకు చదువు లేకపోవటం వంటి కారణాల చేత) కులం ఆధారితంగా కాకుండా కొన్ని మార్కులు అదనంగా కలపటం వంటి సృజనాత్మక పద్ధతుల్లో సాయం అందించాలన్నారు. యాభై శాతం మేర రిజర్వేషన్లను ఉపశమనంగా కొనసాగిస్తూనే క్రిమిలేయర్, ఒకసారి లబ్ధి పొంది, ఓ స్థాయికి చేరుకున్న వారిని మినహాయించటం వంటి సంస్కరణలతో అందులోని కులాల్లోనే అట్టడుగున ఉన్నవారికి అవకాశాలు అందేలా చూడాలని జేపీ సూచించారు.

2014లో మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక కులగణన పట్ల విముఖత ప్రదర్శిస్తూ వచ్చింది. కులగణనలో అనేక తప్పులు దొర్లే అవకాశముందని, పాలనాపరంగా అది ఆచరణసాధ్యం కాదని సుప్రీంకోర్టులో, 2021 జులైలో పార్లమెంట్‌లో కూడా తెలియచేసింది. అలాంటి గణన ఎస్.సి, ఎస్.టిలకే పరిమితం అని తేల్చింది. ఇదే సమయంలో బీహార్ అసెంబ్లీ కులగణన తీర్మానం చేసి, కొవిడ్ ఉధృతి దాటాక వెంటనే చేపట్టింది. 2021లో చేపట్టాల్సిన జనగణనను కొవిడ్, ఆ తర్వాత ఎన్నికలను కారణంగా చూపి యూనియన్ ప్రభుత్వం వాయిదా వేసిందిగానీ, బీహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వం కులగణన నిర్వహించటంతో పాటు, వివరాల్ని కూడా 2023లో బహిరంగపరిచింది. 2021లో బీహార్ అసెంబ్లీ తీర్మానం చేశాక .. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా కులగణన కోసం తీర్మానాలు చేశాయి. అప్పటికే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం 2014 ఆగస్టులో సకల జనుల కుటుంబ సర్వే నిర్వహించిందిగానీ, కులం సహా అందులో నమోదు చేసిన పలు వివరాలను బయటపెట్టలేదు.

ఎన్నికల హామీలో భాగంగా తెలంగాణలో నవంబర్ 2024లో ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభిం



చారు. హైకోర్టు సూచనను అనుసరించి స్థానిక ప్రభుత్వాల్లో బీసీ రిజర్వేషన్లకు అవసరమైన సమగ్ర డేటాను సేకరించేందుకే ఒక ప్రత్యేకమైన కమిటీని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో నియమించారు. ఆ కమిటీ సొంతంగా కొన్ని సమావేశాలు నిర్వహించి, ఇతరత్రా మార్గాల నుంచి సమాచారం సేకరించడంతో పాటు – ప్రణాళికా శాఖ కులగణన సమాచారాన్ని కూడా తీసుకుంది. డిసెంబర్ 25న సుమారు యాభై రోజుల వ్యవధిలో పూర్తయిన కులగణన వివరాలను మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించి కేబినెట్‌లో ఆమోదించిన అనంతరం ఫిబ్రవరి 4, 2025న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్.సి వర్గీకరణ బిల్లుతో పాటు సభలో ప్రవేశపెట్టారు. నగర ప్రాంతాల్లోని సుమారు మూడున్నర లక్షల కుటుంబాలు మినహా సర్వేలో అందరూ పాల్గొని మొత్తం 56 ప్రశ్నలతో, 75 అంశాలతో బుక్‌లెట్ రూపంలో ఉన్న పత్రంలో తమ వివరాల్ని నమోదు చేశారని, లక్ష మంది దాకా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఈ క్రతువులో పాల్గొన్నారని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందులో బీసీలు 46.25 శాతంగా, బీసీ ముస్లింలతో కలిపి (మొత్తం ముస్లింలు 12.56 శాతం) 56.33 శాతం అని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీ ప్రకారం ఈసారి స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం చట్టపరంగా ఇవ్వటం ఆలస్యమయ్యే అవకాశమున్నందున, పార్టీలపరంగా 42 శాతం సీట్లు స్వచ్ఛందంగా వారికి కేటాయిద్దామని రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కులగణన నివేదికను, ఎస్.సి వర్గీకరణను సభ ఆమోదించిన ఫిబ్రవరి 4ను 'తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం'గా అధికారికంగా జరుపుకోవాలని ఆ తర్వాత ఉత్తర్వులు జారీ చేశారు.

రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి విధించిన నేపథ్యంలో (కులగణన తర్వాత ఆ డేటాకి అనుగుణంగా ఈబీసీ, ఓబీసీ, ఎస్.సి, ఎస్.టిలకు బీహార్ ప్రభుత్వం రిజర్వేషన్లను 65 శాతం పెంచిన ఉత్తర్వును ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది) ఇప్పుడున్న పరిస్థితుల్లో తర్వాత బీసీలకు ఎస్.సి, ఎస్.టిల కోటాపోను, స్థానిక ఎన్నికల్లో 22.78 శాతం, మండల పరిషత్‌లలో 18.77 శాతం, జిల్లా పరిషత్‌లలో 17.11 శాతం మాత్రమే వాటా లభిస్తుందని డెడికేటెడ్ బీసీ కమిటీ సిఫార్సు చేసినా, పార్టీలుగా స్వచ్ఛందంగా 42 శాతం సీట్లు ఇద్దామని ప్రతిపాదించినా బీసీ సంఘాల నేతలు అంగీకరించకపోవటంతో – చివరికి 42 శాతం బీసీ కోటా తీర్మానం చేసి పార్లమెంటులో ఆమోదించాలని, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని యూనియన్ ప్రభుత్వానికి పంపించారు. ఆ తర్వాత తెలంగాణ గవర్నర్ బిల్లుకు ఆమోదముద్ర వేసి రాష్ట్రపతికి పంపారు. బీహార్, కర్ణాటకల్లో కులగణనల కన్నా తెలంగాణలో పకడ్బందీగా చేశారన్న వాదన ఉన్నా, ఇందులో అనేక లోపాలు, తప్పుడు సమాచారం ఉందని ఎన్యూమరేటర్లే చెబుతున్నారు.

కులగణన పేరుతో మళ్లీ మళ్లీ కులాన్ని గుర్తుచేసే రాజకీయం పట్ల వ్యతిరేకతతో ఆ అంశం గురించి మాట్లాడటానికి జేపీ

**94 ఏళ్ల తర్వాత**

**మొదటి కులగణన భారతదేశంలో బ్రిటిష్ పాలనలో 1931లో జరిగింది. 1901లో ఉజ్జాయింపుగా 1646 ఉన్న కులాల సంఖ్య 1931లో 4,147గా తేలింది. ఆ తర్వాత 1941లో పాక్షిక కులగణన జరిగింది. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా ఆగింది. 1992లో ఒక సర్వే ప్రకారం 4,635 కులాలు దేశంలో ఉన్నట్లు తేలింది. 2011లో భారత ప్రభుత్వం కులాల లెక్క తీశామని చెప్పినా – అది తప్పుల తడక అని ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పేర్కొంది.**

విముఖత వ్యక్తం చేశారు. కానీ తెలంగాణలో సర్వే మొదలుపెట్టటం, అంకెలు వివాదాస్పదం కావటంతో ఇంటర్వ్యూకి వచ్చిన ప్రతి యూట్యూబ్ ఛానల్ రిపోర్టరూ ఇదే ప్రశ్న అడుగుతుండటంతో ఆయా సందర్భాల్లో చాలా విపులంగా కులగణనను తాను ఎందుకు తిరస్కరిస్తున్నదీ జేపీ తెలిపారు. 2011లో ఏదైతే చెప్పారో, అవే మాటల్ని తాజా సందర్భానికి అనుగుణంగా వివరించారు. రిజర్వేషన్లకి, కులగణనకి సంబంధం లేదని, అందువల్ల మీ

కులం ఏమిటి అని అడిగితే నిర్మొహమాటంగా తిరస్కరించండి అని ముఖ్యంగా యువతకి పిలుపునిచ్చారు. తన ఇంటికి కులగణనకు వచ్చినవారికి కూడా ఇదేమాట చెప్పటంతో వారు నమస్కారం పెట్టి వెనుదిరిగారు. 'జనబలం' పలు సంచికల్లో కూడా ఈ అంశాన్ని చర్చించాం.

❖ కులగణన లక్ష్యాల్లో మూడు అంశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. విద్య, ఉపాధి, రాజ్యాధికారం. ఈ మూడూ కులగణనతో సంబంధం లేకుండా, కుల స్పృహను పెంచకుండా చేయవచ్చు. విద్యకు ఇప్పటికే ప్రభుత్వాలు తగినంత ఖర్చు చేస్తున్నాయి. కానీ నాణ్యమైన విద్య అందకపోవటం అసలు సమస్య. ఒక్క రూపాయి అదనపు ఖర్చు లేకుండా విద్యలో కేవలం కొన్ని సంస్కరణలు తెస్తే, కులం పోతుంది, ఉపాధిని అందుకోగలుగుతారు. ఇక ఉపాధి అవకాశాలను యువ జనాభాకు తగిన సంఖ్యలో అందుబాటులోకి తేవటానికి, ఓ పక్కన పెట్టుబడులను, గ్రీన్‌ఫీల్డ్ సిటీలను ప్రోత్సహిస్తూనే, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి, రెండు చిన్న పట్టణాలను పర్యావరణహిత ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. అదేవిధంగా, పార్టీలే వెనుకబడిన, అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వొచ్చు. గతంలో లోక్‌సత్తా పార్టీ చేసినట్లు జనరల్ సీట్లలోనూ ఎస్.సి, ఎస్.టిలను పోటీ చేయించవచ్చు. ఈ రకంగా టికెట్లివ్వటానికి, వారు గెలవటానికి వీలుగా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యానికి, ఎన్నికల వ్యవస్థ మార్చటానికి సంస్కరణలు అవసరం. చట్టబద్ధ పాలన అవసరం. అంతేతప్ప వీటికోసం కులగణన ఎందుకు?

❖మతపరమైన రిజర్వేషన్లకు భారత రాజ్యాంగం అంగీకరించదని అసెంబ్లీలో జేపీ కూడా ఓ చర్చలో పేర్కొన్నారు. హిందూమతం, అందులో వచ్చిన దేశీయ మతాలకు తప్ప కులం ప్రస్తావన లేని ఇస్లాం, క్రైస్తవం వంటివాటికి రిజర్వేషన్లు వర్తించవని శాసనసభలో, బయట జేపీ పలుమార్లు చెప్పారు. దానికి కొందరు చర్చి పెద్దలు నొచ్చుకున్నారు కూడా. కానీ న్యాయస్థానాలు కూడా పలు సందర్భాల్లో ఈ అంశాన్ని స్పష్టంగా తీర్పుల్లో ప్రకటించాయి. "షెడ్యూల్డ్ కులాల (ఎస్.సి) వ్యక్తులు క్రైస్తవంలోకి మారినరోజే ఎస్.సి హోదాను కోల్పోతారని" తాజాగా ఓ కేసులోనూ ఏపీ హైకోర్టు తేల్చిచెప్పింది.

రిజర్వేషన్ వర్గాలలో ఉన్న కులాల సంఖ్యను లెక్కించటానికి, వారికి అవసరమైన ధ్రువపత్రాలు ఇవ్వటానికి, జేపీ చెప్పినట్లు ఇప్పటికే చట్టబద్ధ ఏర్పాట్లున్నాయి. కులాన్ని పనిగట్టుకుని గుర్తు చేయనక్కర్లేదు. మిగతా కులాల్లో వెనుకబాటుతనం ఉంటే ఆ మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రాజ్యాంగ సమానత్వాన్ని పరిరక్షించవచ్చు. ఆయా కులాల్లో అందరికీ ఎదిగే అవకాశాలను అందించే నాణ్యమైన విద్య, నైపుణ్యాల ఉపాధి అవకాశాలు, చట్టబద్ధపాలన, ఆత్మగౌరవంతో పౌరసేవల్ని అందుకునే, పాలనలో భాగస్వాములయ్యే స్థానిక ప్రభుత్వాల సాధికారత, అన్ని రంగాల్లో ప్రాతినిధ్యానికి దామాషా ఎన్నికల పద్ధతి, ఎన్‌జేఏసీ వంటి న్యాయసంస్కరణలు మొదలైన అంశాల ప్రత్యామ్నాయ ఎజెండా చుట్టూ పౌర సమాజాన్ని, ప్రజల్ని సమీకరించే ప్రయత్నం చేయాలి. ✰

## 2027 ఫిబ్రవరిలో జన, కులగణన

**దేశ 16వ జనగణనను 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని యూనియన్ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటే కులగణననూ చేపట్టి అదే నెల చివరి నాటికి పూర్తి చేయనుంది. ఇందుకోసం 2027 మార్చి 1 ని రెఫరెన్స్ తేదీగా నిర్ణయించారు. అంటే, ముందురోజైన ఫిబ్రవరి 28 వ తేదీ రాత్రి 12 గంటల కల్లా జనగణన పూర్తి కానుంది. అంతకు ముందే, ఏప్రిల్ లోనే తొలివిడత హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానుంది. మంచు ప్రభావిత ప్రాంతాలైన లధ్ధాక్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 2026 సెప్టెంబర్ ఆఖరు నాటికే జనగణన పూర్తి కానుంది. ఈ ప్రాంతాలకు 2026 అక్టోబర్ 1 ని రెఫరెన్స్ తేదీగా ప్రకటించింది. 2021 లోనే జరగాల్సిన జనగణన కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఇదివరకు కేవలం జనాభా లెక్కలు, ఎస్.సి, ఎస్.టి వివరాల సేకరణకే ప్రభుత్వం పరిమితమైంది. ఇప్పుడు తొలిసారిగా స్వతంత్ర భారతదేశంలో ఓబీసీ కులాల వివరాలనూ ప్రత్యేకంగా సేకరించనుంది. 2027 లో జనగణనకు రూ. 13,000 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. దాదాపు 30 లక్షల మంది సిబ్బంది ఈ జనగణనలో పాలుపంచుకుంటారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. దేశ జనాభా 121.01 కోట్లు. ఇందులో 62.3 కోట్ల మంది (51.54%) పురుషులు, 58.6 కోట్ల మంది మహిళలు. జనాభా లెక్కల అనంతరం నియోజకవర్గాల పునర్విభజన చేస్తారు. జనగణన రెండు దశల్లో జరుగుతుంది. ప్రజల నుండి వివరాలకు మూడు డజన్ల ప్రశ్నల ద్వారా యూనియన్ సమాధానాలు నమోదు చేస్తుంది. 2020 జులైలో అంచనా ప్రకారం.. 2027 నాటికి దేశ జనాభా 143,64,78,000.**

### అద్భుతం, అధ్వాన్నం ..

# పోలీసు సంస్కరణల అవసరాన్ని చాటుతున్న తెలంగాణ

మన దేశంలో నేర న్యాయవ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో కాస్త ఇంగిత జ్ఞానమున్న ప్రతి ఒక్కరికీ తెలుసు. అంకెల్లో చెప్పలేక పోవచ్చుగానీ .. చట్టం ఉన్నవాడి చుట్టమని, నిర్దోషుల్ని చితకబాది నేరాల్ని ఒప్పించటం, అసలు నేరం చేసినవాళ్లు దర్జాగా బయట తిరగటం తరచూ కనిపించే దృశ్యాలని వారిలో ఎవరిని అడిగినా చెబుతారు. పోలీసుల సామర్థ్యం వల్ల కాక .. సమాజంలోని కుటుంబ వ్యవస్థ, ఇతర అంతర్గత బలాల వల్ల మనం కొంత స్వేచ్ఛగా బతకగలుగుతున్నాం. వీటివల్ల మొత్తంగా శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి. సమాజంలో ఎన్నో నివారించదగ్గ బాధలు, ప్రభుత్వపరమైన, సామాజికమైన వైఫల్యాలు, అన్యాయాలు, వివక్షలు, అవినీతి ఉన్నా - చాలా దేశాల్లో కంటే మన వద్ద నేరాల సంఖ్య సగటున తక్కువేనంటే ఆశ్చర్యం కలుగమానదు. కానీ 1890లలో గురజాడ అప్పారావు 'కన్యాశుల్యం'లో బండివాని పాత్ర ద్వారా గిరీశాన్ని అడిగించిన ప్రశ్న ఇప్పటికీ కోట్లాదిమంది ప్రజల్ని ఈ దేశంలో వేధిస్తోంది. స్వతంత్రం వస్తే - ఆ కానిస్టేబుల్‌ని బదిలీ చేస్తారా? రోజూ వేధిస్తున్నాడు అని ఆ బండి నడిపే వ్యక్తి అడుగుతాడు. స్వతంత్రం వచ్చి 77 ఏళ్లు దాటింది, కానీ ఇప్పటికీ అత్యధికులు పోలీస్‌స్టేషన్లకు వెళ్లటానికి భయపడుతూ, తమ సమస్యల్ని బయటే పరిష్కరించుకోవటానికో, సర్దుబాటు చేసుకోవటానికో ప్రయత్నిస్తున్నారు.



చట్టబద్ధ పాలనలో కీలకమైన పోలీసు విభాగంలో అసలు రాజకీయ ప్రమేయం, జవాబుదారీతనం వద్దని ఎవరు అనరు. శాంతి భద్రతలకు సంబంధించి రాజకీయ నిర్ణయాలు తీసుకోవాల్సిన సందర్భాలు ఎదురవుతుంటాయి. వాటిని పోలీసు అధికారులకు వదిలేయటం, వారు విచక్షణ లేకుండా చట్టాన్ని ప్రయోగించటం ప్రమాదకరం. కానీ, నేర దర్యాప్తులో రాజకీయ జోక్యం వల్ల నేర నిరూపణ ప్రక్రియ అధ్వాన్నంగా తయారై నిర్దోషులు దోషులవుతున్నారు, దోషులు గణనీయ సంఖ్యలో తప్పించుకుంటున్నారు. ఒకవేళ నేరస్తులు పట్టుబడినా, పకడ్బందీగా సాక్ష్యాల్ని సేకరించలేకపోవటం, నిరూపించలేకపోవటం జరుగుతోంది. కోర్టుల్లో జాప్యానికి తోడు, పోలీసు స్టేషన్‌లో నిందితుల నేరాంగీకారం, పకడ్బందీ సాక్ష్యాల సేకరణకు అవసరమైన ఆధునిక ఫోరెన్సిక్ సదుపాయాలు, ప్రాసిక్యూషన్‌లో విఫలమవటం చాలా కేసులు వీగిపోవటానికి కారణమవుతున్నాయి. థర్డ్ డిగ్రీ పద్ధతులతో చిత్రహింసలు పెట్టి, ఎవరొకర్ని నేరం చేసినట్లు ఒప్పించకపోతే, మన దేశంలో నేర నిరూపణ శాతాలు సగానికి పైగా తగ్గిపోతాయని అంచనా.

బలప్రయోగానికి అధికారాలు ఇవ్వాలట!

ఇదంతా గతమని, పోలీసు శాఖ పనితీరు గణనీయంగా మెరుగైందని, నేర నిరూపణ 50 శాతం పైగా జరుగుతూ దోషులకు శిక్ష పడటంలో పోలీసులు సమర్థంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వం చెబుతుండగా - ఇప్పటికీ పరిస్థితి ఆశించినంత మెరుగుపడలేదని, పోలీసు సంస్కరణల అవసరం చాలా రాష్ట్రాల్లో ఉందని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

కొందరు పోలీసులు తమ విధి నిర్వహణలో చట్టాన్ని బేఖాతరు చేస్తున్నారని, అరెస్టుకు సంబంధించిన చట్టపరమైన విధానాలను పాటించటం లేదని "స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా రిపోర్ట్ - 2025" తెలిపింది. 'సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్'

(సీఎస్‌డీఎస్) సంస్థ నిర్వహిస్తున్న లోక్‌నీతి కార్యక్రమ సహకారంతో 'కామన్ కాజ్' స్వచ్ఛంద సంస్థ ఈ నివేదికను రూపొందించింది. 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 8,276 మంది పోలీసులతో ఈ క్రమంలో సంభాషించారు. విధినిర్వహణలో చిత్రహింసలకు గురి చేయటాన్ని, హింసకు పాల్పడటాన్ని గణనీయ సంఖ్యలో పోలీసులు సమర్థించుకుంటున్నారు. పోలీసింగ్‌లో ఎలాంటి భయం లేకుండా బలప్రయోగం చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని వారు కోరుతున్నట్లు నివేదిక తెలిపింది.


మూక న్యాయానికే మొగ్గు

లైంగిక వేధింపులు, పిల్లల అపహరణ కేసుల్లో మూక న్యాయమే సరైనదని ప్రతి నలుగురు పోలీసుల్లో ఒకరు నమ్ముతున్నారు. ఇలాంటి కేసుల్లో గుమిగూడిన గుంపులే న్యాయమూర్తిగా, జ్యూరీగా, శిక్ష అమలుపరిచే, తలారీలా వ్యవహరించటాన్ని వారు సమర్థిస్తున్నారు. 'ప్రమాదకర' నేరగాళ్లను చట్టపరమైన విధానాల ద్వారా శిక్షించటం కన్నా హతమార్చటమే మేలని 22 శాతంమంది నమ్ముతున్నారు. అరెస్టుకు సంబంధించిన విధివిధానాలు ఎప్పుడూ పాటిస్తామని 41 శాతం మంది పోలీసు సిబ్బంది చెప్పగా, అరుదుగా మాత్రమే ఆ విధానాలను అమలు చేస్తామని 24 శాతం మంది బదులిచ్చారు.

**ఇటు 'నెంబర్ వన్' స్థానం – అటు లగచర్ల విమర్శలు**

పోలీసు శాఖ పనితీరు గతం కంటే కొన్ని విభాగాల్లో మెరుగుపడినా – చట్టబద్ధపాలన అమలుకి పునాది వ్యవస్థగా ఇంకా చాలా మార్పులు రావాల్సి ఉందని, ముఖ్యంగా ఒత్తిడి ఎదురైనప్పుడు తాము ప్రజాసేవకులమన్న భావాన్ని విస్మరించి రాజ్యాంగేతర పద్ధతుల్లో వ్యవహరిస్తూ వలస పాలన కాలంలోలా రాజకీయం అడుగులకు మడుగులొత్తుతున్నారనటానికి తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కొన్ని రోజుల వ్యవధిలో వచ్చిన రెండు నివేదికలే నిదర్శనం. మొదటిగా పోలీసు శాఖ పనితీరులో తెలంగాణకు దేశంలోనే నెంబర్ వన్ స్థానం ఇచ్చిన 'ఇండియా జస్టిస్ రిపోర్ట్ – 2025' చూద్దాం.

కోటికంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాలతో పోల్చినప్పుడు తెలంగాణ పోలీసు విభాగం ఈ ఘనత సాధించినట్లు నివేదిక పేర్కొంది. ప్రజలకు సహాయం అందించే పోలీసులు, న్యాయస్థానాలు, జైళ్లు, న్యాయ సహాయం (లీగల్ ఎయిడ్) వంటి విభాగాల పనితీరును అధ్యయనం చేస్తూ టాటా ట్రస్ట్ 2019 నుంచి రాష్ట్రాలకు ర్యాంకింగులు ఇస్తోంది. సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ తదితర సంస్థల సహకారంతో తాజా నివేదికను రూపొందించింది.




**ఇండియా జస్టిస్ నివేదికలోని ముఖ్యాంశాలు:**

తాజాగా వెల్లడించిన నాలుగో ఎడిషన్ ర్యాంకుల్లో దేశవ్యాప్తంగా పోలీసింగ్‌లో తొలిస్థానంలో నిలిచిన తెలంగాణ – జ్యుడీషియరీలో 2; జైళ్ల విభాగంలో 7; లీగల్ ఎయిడ్‌లో 10వ స్థానంలో – 6.15 స్కోర్‌తో మొత్తంగా మూడో స్థానంలో నిలిచింది. 6.78 స్కోర్‌తో కర్ణాటక మొదటి స్థానం సాధించింది.

◆ 2019లో వెలువడిన మొదటి ఎడిషన్‌లో మొత్తంగా ర్యాంకుల్లో 11వ స్థానంలో ఉన్న తెలంగాణ – 2020, 2022లలో మూడో స్థానంలో నిలిచింది. ఈసారీ అదే స్థానాన్ని నిలబెట్టుకుంది.

◆ కానిస్టేబుళ్ల సాయిలో రాష్ట్రంలో 13 శాతం మాత్రమే ఖాళీలున్నాయి. ఇది జాతీయ సగటు కంటే చాలా తక్కువ. తెలంగాణ పోలీసు శాఖలో కేవలం 9 శాతం మంది మాత్రమే మహిళా పోలీసులున్నారు. ఇక్కడ కూడా జాతీయ సగటు కంటే చాలా తక్కువ.

◆ తెలంగాణలో పట్టణ ప్రాంతాల్లో ప్రతి 10.6 చదరపు కిలోమీటర్లకు – గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 282 చదరపు కిలోమీటర్లకు ఒకటి చొప్పున పోలీస్‌స్టేషన్ ఉంది. అతి తక్కువ పరిధిలో పోలీస్‌స్టేషన్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ లోని 85 శాతం పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు, మహిళా సహాయ డెస్కులు ఉన్నాయి.

◆ తెలంగాణ జిల్లా కోర్టుల్లో 21 శాతం, హైకోర్టు జడ్జీల్లో 29 శాతం, సిబ్బందిలో 24 శాతం ఖాళీలున్నాయి. దేశంలోనే అత్యధికంగా తెలంగాణ హైకోర్టులో 33 శాతం, జిల్లా కోర్టుల్లో 55 శాతం మంది మహిళా న్యాయమూర్తులున్నారు.

◆ 2022–23 లెక్కల ప్రకారం రాష్ట్రంలోని జైళ్లలో 6,500 మంది ఖైదీలుండగా – ఒక్కొక్కరిపై ఏడాదికి రూ.33,277 చొప్పున ఖర్చు పెట్టారు.

◆ ప్రజలకు అవసరమైన న్యాయ సహాయం అందించే

లీగల్ సర్వీస్ క్లినిక్‌లు తెలంగాణలో 440 గ్రామాలకొకటి చొప్పున మాత్రమే ఉన్నాయి. మొత్తం లీగల్ ఎయిడ్ బడ్జెట్‌లో 80 శాతాన్ని కేటాయించింది. 2022-23లో పూర్తి నిధుల్ని ఖర్చు చేసింది. (న్యూయార్క్ పోలీసులు, మిస్‌వరల్డ్ పోటీకి హైదరాబాద్ వచ్చినవారు కూడా ఇక్కడి పోలీస్ కమాండ్, కంట్రోల్ సెంటర్‌ని సందర్శించారు).

**డీజీపీ గర్వంగా ఉందన్న రోజుల వ్యవధిలోనే ఎన్‌హెచ్‌ఆర్సీ కఠిన వ్యాఖ్యల నివేదిక**

ఇండియా జస్టిస్ రిపోర్ట్ - 2025లో తెలంగాణ రాష్ట్ర పోలీసులకు దేశంలోనే మొదటి స్థానం లభించటం గొప్ప విషయమని, తన 33 ఏళ్ల సర్వీసులో ఇది గర్వంగా చెప్పుకునే సందర్భమని డీజీపీ డాక్టర్ జితేందర్ హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఎన్‌హెచ్‌ఓలతో ముఖాముఖి' కార్యక్రమంలో హర్షం వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బందికి శిక్షణ, వర్టికల్స్ విభజన లాంటి 32 ప్రమాణాలను బేరీజు వేస్తే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఐపీఎస్‌ను ఎంచుకోవద్దని తనను చెప్పినవారే ఎక్కువమంది ఉన్నారని, ఇవాళ అలాంటివారే ప్రశంసిస్తున్నారన్నారు.

డీజీపీ ఇలా తన సంతోషాన్ని పంచుకున్న రెండు మూడు రోజుల వ్యవధిలోనే లగచర్ల ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ దర్యాప్తు బృందం ఘాటైన విమర్శల నివేదికనిచ్చింది.

❖ వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు న్యాయబద్ధంగానే ఉన్నా.. భూసేకరణ సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు మాత్రం చట్టప్రకారం లేదు. వారు గీత దాటి వ్యవహరించారు. గ్రామస్తులను అరెస్ట్ చేసి నిర్బంధించిన లాకప్‌లో, సీఐ ఆఫీసులో సీసీ కెమెరాలు పని చేయలేదని తేలింది. స్టేషన్ జనరల్ డైరీ ఎంట్రీలు కూడా అప్‌డేట్ చేయలేదు. అది పోలీసుల నిర్లక్ష్య వైఖరిని సూచిస్తోంది. గ్రామస్తుల మానవ హక్కులను పోలీసు సిబ్బంది ఉల్లంఘించటం నిజమని దర్యాప్తులో తేలింది. ప్రజాసేవకులైన పోలీసు అధికారులు, జిల్లా అధికారులు బాధిత గ్రామ ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించాల్సి ఉన్నా - వారు భూసేకరణ ప్రక్రియను సున్నితంగా పూర్తిచేయ లేకపోయారు" అని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) దర్యాప్తు బృందం స్పష్టం చేసింది.

**లగచర్ల ఎన్‌హెచ్‌ఆర్సీ నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు:**

ఈ కేసులో 2024 నవంబర్ 18న లగచర్లకు చెందిన కొందరు కమిషన్‌కి ఫిర్యాదు చేశారు. ఫార్మాసిటీ భూసేకరణ అంశంలో 2024 నవంబర్ 11న గ్రామస్తులు, అధికారుల మధ్య కొట్లాట జరిగిన తర్వాత పోలీసులు అదేరోజు రాత్రి 11-12 గంటల సమయంలో గ్రామంపై దాడిచేసి,

గ్రామస్తుల మానవ హక్కులను పోలీసు సిబ్బంది ఉల్లంఘించటం నిజమని దర్యాప్తులో తేలింది. ప్రజాసేవకులైన పోలీసు అధికా రులు, జిల్లా అధికారులు బాధిత గ్రామ ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించాల్సి ఉన్నా - వారు భూసేకరణ ప్రక్రియను సున్నితంగా పూర్తిచేయ లేకపోయారు" అని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) దర్యాప్తు బృందం స్పష్టం చేసింది.

మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించటంతో పాటు, గ్రామీణులను అరెస్ట్ చేసి వారిపై తప్పుడు కేసులు పెట్టినట్లు ఆరోపించారు. నిజానిజాలను నిర్ధారించుకోవటానికి ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం ప్రజలతోపాటు అరెస్టయినవారి వాంగ్మూలాలు నమోదు చేసింది.

"అందుబాటులో ఉన్న వాంగూల్మాలు, దస్త్రావేజులు, రికార్డులను బట్టి - పోలీసులు, స్థానిక అధికారులు దురుసుగా వ్యవహరించినట్లు కనిపించింది. రాత్రిపూట అరెస్ట్ చేసినవారిని పరిగి పోలీస్‌స్టేషన్‌లో కొట్టటంతో పాటు, మేజిస్ట్రేట్ ముందు నోరు తెరవొద్దని బెదిరించారు. పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఉంచినా, ఆ విషయాన్ని జనరల్ డైరీలో పేర్కొనలేదు. జిల్లా అధికారులు, పోలీసుశాఖ సమర్పించిన సాక్ష్యాధారాల ప్రకారం జిల్లా కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారులపై గ్రామస్తులు భౌతికంగా దాడి చేసినట్లు కనిపిస్తున్నా - చాలామంది సంఘటనా స్థలంలోగానీ, నిరసన ప్రదర్శనల్లో కానీ పాల్గొనలేదు. వారిని కూడా, పోలీసులు అరెస్ట్ చేశారు. మైనర్లు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులపైనా కేసులు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో రాజకీయ ప్రతీకార కోణం కూడా తెరపైకి వచ్చింది. ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ వారిని లక్ష్యంగా చేసు కున్నారు. కాంగ్రెస్ మద్దతుదారులపై కేసు పెట్టటంగానీ, అరెస్ట్ చేయటంగానీ జరగలేదు. ప్రతి నిందితుడి ఆనవాళ్ల వివరాలు పోలీసుల వద్ద ఉన్నాయి. కోర్టులో లొంగిపొమ్మని నిందితులందరికీ పోలీసులు సమాచారం పంపారు. ఒక్క గ్రామస్తుడూ తన ఇల్లు వదిలిపోలేదు" అని దర్యాప్తు బృందం కమిషన్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొంది. దీన్ని పరిశీలనలోకి తీసుకున్న కమిషన్ ఇందులోని చాలా ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారించింది. సున్నితమైన అంశాన్ని చక్కదిద్దే విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు చట్టప్రకారం లేదని స్పష్టం

చేసింది. ఘర్షణలు జరిగినప్పుడు ఊరిలో లేని మైనర్లు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు పెట్టటాన్ని తప్పుపట్టింది.

❖ ప్రజాస్వామ్యం హామీకి పోలీసులతో తూట్లు పడుతోందని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

**ఏసీబీ లెక్కలు**

ఇదే సమయంలో కొన్నివారాల వ్యవధిలో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) లెక్కల్ని వెల్లడించింది. 2025 జనవరి నుంచి మే వరకు ఏసీబీ 70 కేసులు నమోదు చేయగా, అందులో ఎక్కువ పోలీసు శాఖకు సంబంధించి ఉన్నాయి. 14 కేసుల్లో 19 మంది పోలీసుల్ని అరెస్ట్ చేశారు. వారిలో హెూంగార్డు నుంచి డీఎస్పీ వరకూ ఉన్నారు. రూ.5 వేల నుంచి రూ.25 లక్షల వరకు లంచం డిమాండ్ చేశారు. పోలీసు అధికారులు ఎక్కువ అక్రమ వసూళ్లకు అవకాశమున్న ప్రాంతాల్లోని స్టేషన్లకు బదిలీల కోసం పైరవీలు చేస్తున్నారు. ఏ ప్రజాప్రతినిధి, నాయకుడ్ని పట్టుకుంటే పని అవుతుందో వారి చుట్టూ తిరుగుతూ ముడుపులు సమర్పించుకుంటున్నారు. గతంలో పోలిస్తే ఈ విషయంలో కొన్ని జాగ్రత్తలు పెరిగి, సదరు అభ్యర్థి చరిత్రను, వ్యవహారశైలిని ఆరాతీసి పైస్థాయిలోనివారు అవసరమైతే బదిలీలకు 'నో' చెబుతున్నారు. అయితే, పరిస్థితి ఇంకా చాలా మారాల్సి ఉంది. ఒక పోలీసు అధికారి రూ.25 లక్షల లంచమిచ్చి పోస్టింగ్ తెచ్చుకుని, అంతకు అంత వసూలు చేయాలన్న ఆరాటంలో లంచం డిమాండ్ చేసి ఏసీబీకి దొరికిపోయాడు.



మొత్తంగా ఎస్హెచ్ఓలతో ముఖాముఖిలో డీజీపీ జితేందర్ తెలంగాణ పోలీసుల్ని గుర్తింపు పొందినందుకు అభినందిస్తూనే, ప్రజాసేవకులు అనిపించుకోవటానికి చేయాల్సింది ఇంకా చాలా ఉందన్న మాటలు వాస్తవం. "తెలంగాణ పోలీసు యంత్రాంగం మరింత సమర్థంగా, జవాబుదారీతనంతో పనిచేయాలి. స్టేషన్ హౌస్ అధికారుల పనితీరు ఇంకా మెరుగుపడాలి. ఫిర్యాదులపై మొక్కుబడిగా కాకుండా సమగ్ర దర్యాప్తు ద్వారా వాస్తవాలు తెలుసుకోవాలి. అవినీతికి పాల్పడి చెడ్డపేరు తెచ్చుకోకుండా గౌరవాన్ని కాపాడుకోవాలి. ప్రజల ఫీడ్‌బ్యాక్‌ను గమనిస్తుండాలి" అని డీజీపీ హితవు పలికారు.

**రాజకీయ నాయకత్వ పనితీరు మారాలి**

పోలీసు సిబ్బందితో పాటు రాజకీయ నాయకత్వం కూడా ప్రజాసేవకులమనే రాజ్యాంగబద్ధ బాధ్యతను గుర్తెరిగి ప్రవర్తించాలి. ప్రతిపక్షాల మీద కక్షసాధింపుకి పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకునే ధోరణికి స్వస్తి చెప్పాలి. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న ఈ దిగజారుడు రాజకీయ సంస్కృతి ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలకి పాకి వెర్రితలలు వేస్తోంది. అధికార పార్టీ ఒకరకంగా పోలీసులను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకుంటుంటే, ప్రతిపక్షాలు పరిస్థితిని మారుస్తాం, చట్టబద్ధ పాలన అమలు చేస్తాం అని కాకుండా – మేం అధికారంలోకి వస్తే మీ యూనిఫాం ఊడదీసి చితకబాదుతాం అని హెచ్చరిస్తున్నాయి.

**కనీసం కేంద్రస్థాయి సంస్కరణలు అవసరం**

చట్టబద్ధ పాలనలో కీలకమైన పోలీసు వ్యవస్థ నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ అధికారాల పరిధిలోకి వస్తుంది. కనీసం కేరళ తరహాలో పోలీసు యంత్రాంగం సమర్థంగా, నిష్పాక్షికంగా పనిచేసే విషయంలో పార్టీలకతీతంగా వ్యవహరించాలి. ఆ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కమ్యూనిటీ పోలీసింగ్ సహా కొన్ని మౌలిక సంస్కరణల్ని అమలు చేయటం వల్ల .. అరెస్టు తదితర సందర్భాల్లో చట్టసంబంధ విధివిధానాలను ఎల్లవేళలా పాటిస్తామని 94 శాతం మంది కేరళ పోలీసులు సర్వేలో తెలిపారు.

**యూనియన్ ప్రభుత్వం మార్గదర్శకత్వం వహించాలి**

యూనియన్ ప్రభుత్వం కూడా తన పరిధిలోని సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థల్ని, ప్రత్యేక పోలీసు విభాగాల్ని, చట్టాల్ని దుర్వినియోగం చేయకుండా రాష్ట్రాలో పోలీసు సంస్కరణలకి మార్గదర్శకత్వం వహించాలి, అందుకు సంస్థాగత ఏర్పాట్లకి చొరవ చూపాలి.

**పోలీసు సంస్కరణలంటే డీజీపీల నియామకం మాత్రమే కాదు**

సుప్రీంకోర్టు సూచించినట్లు డీజీపీల నియామక ప్రక్రియ మార్చటం వంటి వాటితో పెద్ద మార్పేమీ రాదు. నేర దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌లను రాజకీయ వ్యవస్థ నుండి వేరు చేసి, సమర్థంగా, జవాబుదారీతనంతో పనిచేసేందుకు పటిష్ట ఏర్పాటు చేయాలి. శాంతిభద్రతల పోలీసు విభాగం రాజకీయ పరిధిలో పనిచేసినా నిష్పాక్షికంగా వ్యవహరించేలా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. ఆధునీకరించటం సహా ఇతర పోలీసు సంస్కరణల్ని ఆస్ట్రేలియా వంటి దేశాల అనుభవాల నుంచి మనదేశ పరిస్థితులకు అనుగుణంగా మార్పు తీసుకురావాలి. పరస్పర విరుద్ధ నివేదికల సారాంశమిదే.

**కన్యాశుల్కం నాటి ప్రశ్న ఇప్పటికైనా పరిష్కారమవ్వాలి**

**కన్యాశుల్కం నాటి ప్రశ్నను ఈ దేశ సామాన్య పౌరులు అడగాల్సిన అవసరం లేని రోజు రావాలి.**

✩

# పర్యావరణానికి పెనుముప్పు.. 'ప్లాస్టిక్'



అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు..ఒకే రోజు అత్యధిక వర్షపాతం నమోదు..కొన్ని రోజుల పాటు ఒక్క బొట్టు వాన చుక్క కురవకపోవడం..ఇటీవల ఈ తరహా వాతావరణ మార్పులను మనం గమనిస్తున్నాం. ఇవన్నీ అసాధారణం. దీనికి కారణం ఏంటి? వాతావరణంలో మార్పులు..ఈ మార్పులకు కారణం ఏంటి? పర్యావరణం కలుషితం కావడం. దీనికి కారణం ఎవరు? మనుషులు..వాతావరణం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటోంది ఎవరు? దానికీ సమాధానం..మనుషులే. మనల్ని మనమే సంక్షోభంలోకి నెట్టేసుకుంటున్నాం..అటు వాతావరణ సమతుల్యతను, ఇటు మన ఆరోగ్యాన్ని దెబ్బతీసుకుంటున్నాం. అనారోగ్యాలకు గురై, ఆర్థికంగా చితికి పోతున్నాం. ఈ విషవలయం నుంచి మనల్ని మనం కాపాడుకునే ప్రయత్నం చేయకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొక తప్పదు..నేడు ప్రస్తుతం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకర పర్యావరణ ముప్పుల్లో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటి. ఇది ప్రకృతితో పాటు మన ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025 థీమ్ "ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దాం". ప్లాస్టిక్ వ్యర్థాల పెరుగుదల..మానవాళిపై ప్రభావం..మన స్థాయిలో చేపట్టాల్సిన నివారణ చర్యలు తెలుసుకుందాం..

ప్రపంచంలోనే ప్లాస్టిక్ కాలుష్యకారక దేశాల్లో అగ్రస్థానాన్ని భారత్ సొంతం చేసుకుంది. ఏటా 9.3 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు మన దేశంలో ఉత్పత్తి అవుతున్నాయి. ప్లాస్టిక్ ఉద్గారాలలో దాదాపు ఐదోవంతు భారత్‌లోనే విడుదల అవుతున్నట్టుగా తాజాగా విడుదల చేసిన ఓ నివేదిక పేర్కొంది. 3.5 మిలియన్ టన్నుల ఉద్గారాలతో నైజీరియా, 3.4 మిలియన్ టన్నుల ఉద్గారాలతో ఇండోనేషియా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మనదేశంలో వ్యర్థాల ఉత్పత్తి రేటు రోజుకు తలసరి 0.12 కిలోగ్రాములు. అయితే ఈ గణాంకాలలో గ్రామీణ ప్రాంతాలు, సేకరించిన వ్యర్థాలను బహిరంగంగా తగులబెట్టడం, రీసైకిల్ వ్యర్థాలను కలపపోవడం వల్ల ఈ సంఖ్య కొంత తక్కువగా ఉండొచ్చు. వీటిని కూడా కలిపి రోజువారీ తలసరి వ్యర్థాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఏటా ఒక్కో భారతీయుడు సగటున 11 కిలోల ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు మరో అంచనా.

నిత్యజీవితంలో ప్లాస్టిక్ వినియోగం తప్పనిసరిగా మారిపోయింది..పాలప్యాకెట్లు, కాయగూరలు, మాంసం, కిరాణా సరకులు ఇలా ఏ వస్తువు కొన్నా దాన్ని ప్లాస్టిక్ సంచిలో వేసుకుని తీసుకువస్తుంటాం. అవే ఖాళీ కవర్లను మళ్లీ మళ్లీ వినియోగిస్తుంటాం.ఇలా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రజారోగ్యానికీ, పర్యావరణానికీ అనేక అనర్థాలు వాటిల్లుతున్నాయి. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించినా, స్ట్రాలు, ప్యాకేజింగ్ సామగ్రి, ప్లాస్టిక్ జెండాలు, ఇయర్ బడ్స్ వంటి వస్తువుల వాడకం తగ్గించాలని యూనియన్ ప్రభుత్వం 2019లోనే ప్రకటించినా ఎక్కడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ప్రమాదకర ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నేలతో పాటు జల, వాయు కాలుష్యమూ

పెచ్చుమీరుతోంది. మానవాళితో పాటు జంతుజాలమూ ఈ ప్లాస్టిక్ వ్యర్థాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

ఇటీవల కోయంబత్తూరుకు సమీపంలోని 'మరుదామలై' అటవీప్రాంతంలో ఇటీవల ఓ ఏనుగు అనారోగ్యానికి గురై చనిపోయింది. పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు ఆ ఏనుగు కడుపులో 5 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్టు గుర్తించారు. వాటిలో ప్లాస్టిక్ కవర్లతో పాటు సింగిల్ యూజ్డ్ ఆహార పదార్థాల కవర్లు తదితరమైనవి. అవి జీర్ణం కాక ఏనుగులోని ప్రధాన అవయవాలు దెబ్బతిన్నట్టు వైద్యులు గుర్తించారు. అంతేకాదు. ఆ ఏనుగు గర్భంతో ఉంది. కడుపులో ఓ ఆడ ఏనుగు పిల్లను వెలికి తీశారు. అంటే రెండు జీవాలు మృతికి ఆ ప్లాస్టిక్ వ్యర్థాలే కారణం. ఇవే కాదు..నిత్యం ఎన్నో జీవరాసులు ఈ ప్లాస్టిక్ భూతానికి బలవుతూనే ఉన్నాయి. బీచ్‌లకు వెళ్లే పర్యాటకులు తమ వెంట ప్లాస్టిక్ కవర్లతో చిరుతిళ్లు, వాటర్ బాటిల్స్ వంటివి తీసుకెళ్తుంటారు. అవి ఖాళీ అయిన తర్వాత వాటిని దూరంగా చెత్తబుట్టల్లో వేయడానికి బదులు సముద్రంలోనో, బీచ్ దగ్గరో పారేస్తున్నారు. ఇలా పేరుకుంటున్న చెత్తలో 80శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. వీటివల్ల మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతోంది. అక్కడి పర్యావరణమూ దారుణంగా దెబ్బతింటోంది. దీనికి తోడు సముద్ర జలాలు నీలి రంగు నుంచి నలుపు వర్ణంలోకి మారుతున్నట్టు తాజాగా జరిగిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు గుట్టుచప్పుడు కాకుండా నేరుగా నదుల్లో పారబోస్తున్నాయి. అవి నేరుగా సముద్ర జలాల్లో కలుస్తున్నాయి. వ్యవసాయ వ్యర్థాలు వీటికి తోడవుతున్నాయి. వర్షపు నీరు, నదుల ద్వారా కొట్టుకు వచ్చే వ్యర్థాలు సముద్ర ఉపరితలంపై మరింత పేరుకుపోయి సూర్యకిరణాలను అడ్డుకుంటున్నాయి. ఫలితంగా సాగర జలాలు కాంతి హీనంగా మారుతున్నాయి. భవిష్యత్తులో వాటిల్లబోయే ప్రమాదాలకు ఈ ఘటనలన్నీ ఓ హెచ్చరికగా భావించాలి. మానవాళి జీవనానికి ఇవి పెనుముప్పుగా పరిణమించనున్నాయి.

మైక్రోప్లాస్టిక్ మనిషి శరీరంలోని వివిధ అవయవాల్లోకి పలు రూపాల్లో చేరుతున్నాయి. మైక్రోప్లాస్టిక్స్ అనేవి 5 మిల్లీమీటర్ల కంటే చిన్న పరిమాణంలో ఉండే సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు. ఇవి రెండు రకాలుగా ఉంటాయి: ప్రాథమిక మైక్రోప్లాస్టిక్స్: కాస్మెటిక్స్, టూత్‌పేస్ట్, స్క్రబ్బర్లు వంటి వస్తువుల్లో ఉద్దేశపూర్వకంగా ఉపయోగించే కణాలు. ద్వితీయ మైక్రోప్లాస్టిక్స్: పెద్ద ప్లాస్టిక్ వస్తువులు పగిలిపోవడం, పాడవడం వల్ల ఏర్పడే చిన్న చిన్న ముక్కలు. ఈ సూక్ష్మ కణాలు మనకు తెలియకుండానే గాలి, నీరు, ఆహారం ద్వారా మన శరీరాల్లోకి ప్రవేశిస్తున్నాయి.

**ప్లాస్టిక్ పునర్వినియోగంపై ఇప్పుడు చాలా దేశాలు దృష్టి పెడుతున్నాయి..దీనికి కారణం..ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కొన్ని లక్షల సంవత్సరాలు పట్టడమే. పునర్వినియోగంలో భారత్ చాలా వెనకబడి ఉంది. జర్మనీలో 65శాతం, దక్షిణ కొరియాలో 59, ఆస్ట్రియాలో 58 శాతం, స్లొవేనియాలో 56, బల్గేరియాలో 55శాతం వ్యర్థాలను పునర్వినియోగిస్తున్నారు. మన దగ్గర ఉత్పత్తి అవుతున్న మొత్తం ప్లాస్టిక్‌లో రీసైక్లింగ్ చేస్తోంది కేవలం ఎనిమిది శాతమే! 2035 నాటికి దీన్ని 11శాతానికి పెంచాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం దేశంలో వార్షిక ప్లాస్టిక్ వినియోగం 2.41కోట్ల టన్నులు. 2035 నాటికి ఏకంగా అది 7.15 కోట్ల టన్నులకు ఎగబాకుతుందని అంచనా. అందువల్ల 11శాతం పునర్వినియోగం వల్ల పెద్దగా కలిసొచ్చేది ఏమీ ఉండదు.**

**మైక్రోప్లాస్టిక్స్ వల్ల ప్రమాదాలు**

శ్వాసకోశ, హృదయ సంబంధిత వ్యాధులతో పాటు హార్మోన్ల అసమతుల్యత, మెదడు ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశాలున్నాయి. రోగనిరోధక వ్యవస్థను కూడా ఇవి దెబ్బ తీస్తున్నాయి. సంతానలేమి సమస్యలకు పర్యావరణ కాలుష్యం కూడా ఓ కారణంగా ఇటీవల గుర్తించారు.

**మన చేతుల్లోనే పరిష్కారం**

ఏడాదికోసారి వీటి గురించి మాట్లాడుకోవడమో, ప్రభుత్వ ఆంక్షల ఫలితంగానో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించదు. ఇది అందరి బాధ్యత. నిరంతర ప్రక్రియ. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేసినప్పుడే ఇది సాధ్యమవుతుంది. మార్కెట్‌లోకి వెళ్లేప్పుడు గుడ్డ సంచిని తీసుకెళ్లడం, ఇంట్లో, ఫంక్షన్లలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర వస్తువులను వినియోగించకపోవడం, ప్లాస్టిక్ బాటిళ్లకు బదులు నీళ్ల కోసం స్టీలు లేదా గాజు సీసాలను వినియోగించడం, ఆహార పదార్థాలను కవర్లకు బదులు స్టీలు డబ్బాల్లో తీసుకెళ్లడం వంటి చర్యలతోపాటు, పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు పర్యావరణ పాఠాలు బోధించడం, ప్రభుత్వం ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడం వంటివి చేపడితే కొంత ప్రయోజనకరం. మనం చేసే ఈ చిన్న చిన్న మార్పులే మన ఆరోగ్య రక్షణకు, భవిష్యత్ తరాలకు సురక్షిత భూమిని అందించేందుకు తోడ్పడగలవు.

☆

# తెలుగు రాష్ట్రాల్లో బాల కార్మికులు:
# సడలని సవాళ్లు - సంస్థాగత లోపాలు




భారతదేశంలోను, దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనూ బాలకార్మికత అత్యంత ప్రధానమైన మానవ హక్కుల సవాళ్లలో ఒకటిగా కొనసాగుతూనే ఉంది. 1986లో చేసిన బాలకార్మికత (నిషేధం మరియు నియంత్రణ) చట్టం, 2009లో చేసిన విద్యాహక్కు చట్టం వంటి చట్టాలు ఉన్నప్పటికీ, వేలాది మంది చిన్నారులు ఇప్పటికీ బలవంతపు శ్రమకు బలవుతూనే ఉన్నారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో బాలకార్మికత ఇంకా ఎంత ప్రబలంగా ఉంది, దానికి మూల కారణాలేమిటి, దానివల్ల దుష్ప్రభావాలేమిటి అనే అంశాలతో పాటు.. బాల కార్మికత నిషేధం, నిర్మూలన చట్టం ఎంత సమర్థంగా అమలవుతోంది, అందుకు ఎదురవుతున్న అవాంతరాలేమిటి, సంస్థాగత లోపాలేమిటి అనే అంశాలను ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో బాల కార్మికత**

తెలుగు రాష్ట్రాల్లో బాల కార్మికతకు సంబంధించి ఇటీవలి గణాంకాలు పరిస్థితులు ఆందోళనకరంగానే కొనసాగుతున్నట్లు వెల్లడిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో.. 2020 నుంచి 2024 మధ్య 7,069 మంది పిల్లలను బాల కార్మికత కోరల నుండి రక్షించారు. ఒక్క 2024 సంవత్సరంలోనే 2,245 మంది చిన్నారులను కాపాడారు. తెలంగాణలో ఒక్క 2024 సెప్టెంబంలోనే 66 మంది చిన్నారులను రక్షించి, 35 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే, ఈ సంఖ్యలు కేవలం 'టిప్ ఆఫ్ ది ఐస్‌బర్గ్' అనే చెప్పొచ్చు. అంటే చాపకింద నీరులా సాగిపోతున్న బాలకార్మికత.. అందులో నలిగిపోతున్న బాలకార్మికులు ఇంకా ఎన్నో రెట్లు ఎక్కువగా ఉన్నారనడంలో సందేహం లేదు. అధికార యంత్రాంగం పర్యవేక్షణ బలహీనంగా ఉండడం వల్ల చాలా ఉదంతాలు వెలుగులోకి రాకుండా మరుగున పడిపోతున్నాయి.

ఉభయ రాష్ట్రాల్లో బాల కార్మికత కొనసాగుతుండడం.. లోతైన సంస్థాగత సమస్యలను ప్రతిబింబిస్తుంది. పేదరికం, జీవనోపాధి అవకాశాల లేమి, నాణ్యమైన విద్య అందక పోవడం అనేవి ప్రధానమైన అంతరాలు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ఈ అంతరాలు మరింత ఎక్కువగా ఉన్నాయి.

**మూలాలు, దుష్ప్రభావాలు...**

బాల కార్మికతకు ప్రధాన కారణం పేదరికం. ముఖ్యంగా ఏ రోజుకారోజు కూలి పనులు చేసుకునే కుటుంబాలు, సీజన్‌లో మాత్రమే పనులు దొరికే కుటుంబాలు, పనుల కోసం వలస వెళ్లే కుటుంబాలు తీవ్రంగా ప్రభావిత మవుతున్నారు. ఈ కుటుంబాలు తమ పిల్లలను స్థిరంగా, నిలకడగా బడికి పంపించలేని దుస్థితి. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను అసంఘటిత రంగంలో లేదా ప్రమాదకర వృత్తుల్లో పనికి ఉంచడం జరుగుతోంది. ఇక ప్రాథమిక విద్యా వ్యవస్థలో సంస్థాగత లోపాలు కూడా దీనికి తోడవుతున్నాయి. ఈ వ్యవస్థ పిల్లలను బడిలో స్థిరంగా నిలబెట్టలేకపోతోంది. పాఠ్యాంశాలు ఆకర్షణీయంగా లేక పోవడం, ఆసక్తికరంగా లేకపోవడం వల్ల.. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపవుట్ రేట్లు ఇంకా అధికంగానే ఉన్నాయి. విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చిన తరువాత కూడా చాలా మంది చిన్నారులకు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలోని, దళిత, గిరిజన వర్గాలకు చెందిన చిన్నారులకు పాఠశాల విద్య సక్రమంగా అందడం లేదు.

మరోవైపు, అసంఘటిత ఉత్పాదక రంగం తరచుగా చౌకగా లభించే, ఫిర్యాదులు చేయని కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో మధ్యవర్తులచే దోపిడీకి గురయ్యే చేతి వృత్తుల వారు, ఆదాయ పరిస్థితులు అస్థిరంగా తయారవుతున్నాయి. పనికి తగ్గ వేతనం కావాలని అడిగే

శక్తి లేని, అతి తక్కువ కూలీలకే సులభంగా లభించే పిల్లలను పనిలో పెట్టుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. దీని ఫలితం.. పేదరికం, దోపిడీ, బాల కార్మికత అనే విష వలయం.

ఇది చిన్నారులపై వినాశకర ప్రభావం చూపుతుంది: ప్రమాదకర పని పరిస్థితులు వారి శారీరక, మానసిక శ్రేయస్సును దెబ్బతీస్తాయి. ఎక్కువ కాలం పాటు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయడం వల్ల.. శ్వాసకోశ సమస్యలు, కండరాల రుగ్మతలు, దీర్ఘకాలిక వైకల్యం సహా అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని అధ్యయనాలు చెప్తున్నాయి. దీంతో ఈ చిన్నారులను తిరిగి బడిలోకి తీసుకురావడం కానీ, ప్రధాన స్రవంతి ఉపాధులను అందిపుచ్చుకోగలిగేలా చేయడం కానీ కష్టమవుతుంది.

**చట్టాల పరిమితులు, సవాళ్లు...**




బాల కార్మికత నిషేధం, నియంత్రణ చట్టం, దానికి 2016 లో చేసిన సవరణ.. 14 ఏళ్ల వయసు లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని నిషేధిస్తోంది. అలాగే కౌమారదశలో ఉన్నవారిని అంటే 14 నుండి 18 ఏళ్ల వయసున్న వారిని.. ప్రమాదకర పనుల్లో నియమించరాదని పరిమితులు విధించింది. అయినప్పటికీ, ఈ చట్టం అమలు బలహీనంగా ఉంది.

ఈ చట్టంలోని అస్పష్టతలను దుర్వినియోగం చేస్తూ పిల్లలను పనిలో పెట్టుకోవడం కొనసాగుతోంది. ఉదాహరణకు, కుటుంబ-ఆధారిత సంస్థలకు ఈ చట్టం నుంచి మినహాయింపు ఉంది. పని చేసే పిల్లలు తమ కుటుంబానికి లేదా బంధువులకు సహాయకారులుగా మాత్రమే ఉన్నారని చాలా

**బాల కార్మికత నిషేధం, నియంత్రణ చట్టం, దానికి 2016 లో చేసిన సవరణ.. 14 ఏళ్ల వయసు లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని నిషేధిస్తోంది. అలాగే కౌమారదశలో ఉన్నవారిని అంటే 14 నుండి 18 ఏళ్ల వయసున్న వారిని.. ప్రమాదకర పనుల్లో నియమించరాదని పరిమితులు విధించింది. అయినప్పటికీ, ఈ చట్టం అమలు బలహీనంగా ఉంది.**

మంది వాదించడానికి ఇది వీలుకల్పిస్తోంది. అలాగే, చిన్నారులకు 14 సంవత్సరాల వయస్సు వరకు ఉచిత విద్యా హక్కు ఉందని విద్యా హక్కు చట్టం చెప్తోంటే.. దానికి విరుద్ధంగా ఉపాధి పనుల్లో చేరడానికి కనీస వయస్సు 14 సంవత్సరాలు అని ఈ చట్టం నిర్దేశిస్తోంది. ఈ తేడా చట్టాల విషయంలో ఒక అయోమయాన్ని సృష్టిస్తోంది. ఒకవైపు ఈ వయసు చిన్నారులకు విద్య తప్పనిసరి అంటూనే.. మరోవైపు ఉపాధి పనులు చేయడానికి అనుమతినిస్తోంది.

బాల కార్మికత నిషేధం, నియంత్రణ చట్టంలో అస్పష్టతలు ఉన్నాయని, పలుచోట్ల స్వీయ వైరుధ్యాలు ఉన్నాయి, అందువల్ల దానిని అమలు చేయడం కష్టంగా మారుతోందని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. ఇక చట్టం కింద నమోదైన నేరాల్లో.. శిక్షల ఖరారు చాలా చాలా తక్కువగా ఉంటోంది. బాల కార్మికత నిషేధం, నియంత్రణ చట్టంలోని సెక్షన్ 14 కింద నమోదు చేసిన కేసులను విశ్లేషించినపుడు.. విధానపరమైన లోపాలు, సాక్ష్యాలు లేకపోవడం, వివిధ శాఖల మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల.. అనేక విచారణలు విఫలమవుతున్నాయని వెల్లడవుతోంది.

**రక్షణ, పునరావాసం, పునరేకీకరణల్లో అంతరాలు**

రాష్ట్ర ప్రభుత్వాలు బాలకార్మికులను రక్షించడానికి ఆపరేషన్ ముస్కాన్ వంటి పటిష్ట చర్యలు చేపడుతున్నప్పటికీ.. రక్షించిన చిన్నారులకు పునరావాసం కల్పించడం, ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం పెను సవాలుగా ఉంది:

**అసంపూర్ణ పునరావాసం:** ఆంధ్రప్రదేశ్‌లో, రక్షించిన 2,246 మంది చిన్నారుల్లో 677 మందికి మాత్రమే అధికారికంగా పునరావాసం కల్పించారు. మిగిలినవారిని వారి కుటుంబాలకు తిరిగి అప్పగించారు. ఆ తర్వాత ఆ చిన్నారుల పరిస్థితి ఎలా ఉంది అనే అంశంపై సమగ్రంగా పట్టించుకున్న దాఖలాలు లేవు.

**పరిహారం అందించడంలో జాప్యం, తిరస్కారం:** వివిధ ఆపరేషన్ల ద్వారా చిన్నారులను బాల కార్మికత నుంచి, వెట్టి చాకిరి నుంచి రక్షిస్తున్నారు. కానీ వెట్టి చాకిరి నుంచి

**బాల కార్మికత అనేది పేదరికం, వ్యవస్థాగత అసమానతల పర్యవసానంగా పుట్టిన రుగ్మత. అంతేకాదు.. అదే పేదరికం, అసమానతలు కొనసాగడానికి బాల కార్మికత దోహదం చేస్తుంది. బాల కార్మికత నిషేధం, నియంత్రణ చట్టం వంటి చట్టాలు ఉన్నప్పటికీ.. వాటిని బలంగా అమలు చేయనిదే, సంబంధిత ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం లేనిదే, సమాజంతో నిరంతరం సంభాషించనిదే.. సమస్య పరిష్కారం అరకొరగానే ఉంటుంది.**



రక్షించిన చిన్నారులకు కేంద్ర ప్రభుత్వ పునరావాస పథకం కింద తప్పనిసరి చేసిన రూ. 30,000 తక్షణ ఉపశమనం కానీ, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత అందించాల్సిన రూ. 70,000 పరిహారం కానీ వారికి సమయానికి సక్రమంగా అందుతున్న దాఖలాలు అరుదు.

**ప్రభుత్వ శాఖల మధ్య పేలవమైన సమన్వయం:** కార్మిక శాఖలు, పోలీసులు, రెవెన్యూ, విద్యా శాఖలు తరచుగా విడివిడిగా పనిచేస్తున్నాయి కానీ, సమన్వయంతో కృషి చేయడం అరుదుగా కనిపిస్తోంది. ఫలితంగా బాల కార్మికులను గుర్తించడం, కేసులను విచారించడం, వారిని ప్రధాన స్రవంతిలో విలీనం చేయడానికి గల అవకాశాలను తరచుగా కోల్పోతున్న పరిస్థితి.

**ప్రధాన స్రవంతిలో విలీనం వైఫల్యాలు:** బాలకార్మికత నుంచి రక్షించిన చిన్నారులకు మానసిక, సామాజిక మద్దతు అందేలా చూడడం, వారి కుటుంబాలకు సరైన జీవనోపాధి కల్పించడం వంటి చర్యలు చేపట్టకపోతే.. చాలా మంది పిల్లలు తిరిగి కార్మికులుగా మారిపోవడం జరుగుతోంది. ఫలితంగా బాలకార్మిక విషవలయం కొనసాగుతోంది.

**ముందుకు సాగడం ఎలా?**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బాల కార్మికతను సమర్థవంతంగా పరిష్కరించడానికి, సమగ్రమైన, బహుముఖ వ్యూహం అవసరం.

**అమలు యంత్రాంగాలను బలోపేతం చేయడం:** జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో ప్రత్యేకంగా బాల కార్మికత నిరోధ టాస్క్ ఫోర్స్‌లు.. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ.. పర్యవేక్షణ, రక్షణ, విచారణ కార్యకలాపాలను నిర్వర్తించాలి.

**చట్ట వ్యవస్థలను సవరించాలి:** 14 ఏళ్ల లోపు పిల్లలు ఏ రకంగానైనా పనిచేయడానికి, వారిని పనిలో పెట్టుకోవడానికి వీలు లేకుండా చూడడానికి.. బాల కార్మికత నిషేధం, నియంత్రణ చట్టం, విద్యా హక్కు చట్టం రెండూ ఏకీభావంతో ఉండేలా చేయాలి.

**సమర్థవంతమైన పునరావాసం కల్పించాలి:** బాలకార్మికత నుంచి రక్షించిన చిన్నారులు తిరిగి అక్రమ రవాణాకు గురవకుండా, మళ్లీ పనుల్లోకి వెళ్లకుండా నిరోధించడానికి – విద్య, ఆరోగ్య, సంక్షేమ మద్దతులను అనుసంధానిస్తూ సమీకృత పునరావాస విధానాన్ని సంస్థాగతం చేయాలి.

**నేరనిర్ధారణ, శిక్షల రేట్లు మెరుగుపడాలి:** బాల కార్మికత నిషేధ చట్టాలపై చట్ట అమలు వ్యవస్థ, న్యాయ వ్యవస్థలకు శిక్షణ ఇవ్వాలి, కేసు డాక్యుమెంటేషన్ సామర్థ్యాలను పెంపొందించాలి, ఈ చట్టాల కింద విచారణలను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

సమాజ భాగస్వామ్యం, జీవనోపాధి మద్దతు: సామాజికంగా, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా చూడడంతో పాటు.. బాలకార్మికతపై అవగాహన కార్యక్రమాలకు, సామాజిక పర్యవేక్షణను పెంపొందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

బాల కార్మికత అనేది పేదరికం, వ్యవస్థాగత అసమానతల పర్యవసానంగా పుట్టిన రుగ్మత. అంతేకాదు.. అదే పేదరికం, అసమానతలు కొనసాగడానికి బాల కార్మికత దోహదం చేస్తుంది. బాల కార్మికత నిషేధం, నియంత్రణ చట్టం వంటి చట్టాలు ఉన్నప్పటికీ.. వాటిని బలంగా అమలు చేయనిదే, సంబంధిత ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం లేనిదే, సమాజంతో నిరంతరం సంభాషించనిదే.. సమస్య పరిష్కారం అరకొరగానే ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు బాలకార్మికతను తగ్గించడంలో గణనీయమైన ప్రగతి సాధించాయి. కానీ రక్షించిన చిన్నారులకు నిజమైన పునరావాసం కల్పించడానికి, ప్రతి చిన్నారీ సురక్షితంగా పెరగడానికి, సాధికారమైన బాల్యాన్ని ఆస్వాదించేలా చేయడానికి ఇంకా చాలా చేయాల్సి ఉంది.

**–బదుగు చెన్నయ్య,**
**(బాలల హక్కుల కార్యకర్త)**

**(జూన్ 12, ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం)**

☆

# ద్రవ్యలోటు, అప్పుల ఒడిదుడుకుల్లో తెలంగాణ - 'కాగ్'

తెలంగాణ ఆర్థిక ద్రవ్యలోటు గణనీయంగా పెరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఆఖరునాటికి రూ.49,977 కోట్లు ఉందని, ఇది రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 3.33 శాతమని, కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక వెల్లడించింది. ఇది అంతకుముందు ఏడాదిలో ఏర్పడిన లోటు రూ.32,557 కోట్లతో పోలిస్తే చాలా ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వం చేసే వ్యయానికి, ఆదా యానికి మధ్య అంతరాన్ని ఆర్థిక ద్రవ్యలోటుగా వ్యవహరిస్తారు. ఈ లోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వం రుణాలను తీసుకుంటుంది.

శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాగ్ తాజా నివేదిక ప్రకారం.. 2023-24 బడ్జెట్‌లో రాష్ట్ర రెవెన్యూ రాబడి మొత్తం రూ.1,69,293 కోట్లయితే ఇందులో 45 శాతం సొమ్ము జీతాలు, పెన్షన్లు, వడ్డీలకే చెల్లించినట్లు ఆడిట్‌లో తేలింది. ఉద్యోగుల జీతాలకు రూ.34,267 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లకు రూ.16,842 కోట్లు, గతంలో ప్రభుత్వం తీసుకున్న అప్పులపై వడ్డీలకు రూ.24,347 కోట్లు చెల్లించారు.

**11 పద్దుల్లో అధిక వ్యయం**

గతేడాది ఆమోదించిన బడ్జెట్ కన్నా 33 శాతం సొమ్మును ప్రభుత్వం 11 రకాల పద్దుల్లో అధికంగా ఖర్చుపెట్టింది. ప్రణాళిక, పరిపాలన, సర్వే గణాంకాల పద్దు కింద ఎక్కువ వ్యయం ఉంది. అయితే ప్రభుత్వ రుణాల పద్దులో రూ.1,09,617 కోట్లు వ్యయం చేశారు. వాస్తవానికి ఈ పద్దు కింద బడ్జెట్‌లో తొలుత కేటాయించింది రూ.12,795 కోట్లు మాత్రమేనని కాగ్ తెలిపింది. నిధుల కొరత కారణంగా రిజర్వు బ్యాంకు నుంచి 'చేబదులు' (వేస్ అండ్ మీన్స్) పేరుతో 2023-24 లో ప్రభుత్వం రూ.97,098 కోట్లు తాత్కాలికంగా తీసుకుని తిరిగి చెల్లించింది.

**అంచనాల మేరకు లేని ఆదాయ, వ్యయాలు**

గత ఆర్థిక సంవత్సరం రాష్ట్ర బడ్జెట్ ఆదాయం అంచనాకన్నా 22%, వ్యయం 21% శాతం తక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఉదాహరణకు, గతేడాది మొత్తం రెవెన్యూ రాబడి రూ.2,16,567 కోట్లు ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేస్తే, ఇందులో 78 శాతమే (రూ1,69,293 కోట్లు) వచ్చింది. యూనియన్ నుంచి గ్రాంట్ల రూపంలో రూ.41,259 కోట్లు వస్తాయనుకోగా 24 శాతమే (రూ.9,934 కోట్లు) రావటంతో మొత్తం రెవెన్యూ రాబడిలో 22 శాతం తగ్గుదల నమోదైంది. దీనివల్ల ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రెవెన్యూ మిగులు రూ.4,882 కోట్లు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశించినా రూ.779కోట్లు మాత్రమే మిగిలింది. మొత్తం వ్యయం రూ.2,77,690 కోట్లని బడ్జెట్‌లో పేర్కొనగా ఇందులో 79 శాతమే (రూ.2,19,307 కోట్లు) ఖర్చయింది.

- ⇨ చేబదుళ్లు రూ.52,517 కోట్లు
- ⇨ ఓవర్ డ్రాఫ్టులు 35,425 కోట్లు
- ⇨ ప్రత్యేక పరిస్థితుల్లో మరో 10,156 కోట్ల సేకరణ
- ⇨ 2023-24 ఏడాదంతా ఆర్బీఐ నుంచి చేబదుళ్లు, ఓవర్ డ్రాఫ్టులే.
- ⇨ 17 రోజులు మాత్రమే కనీస నిల్వ నిర్వహణ

తెలంగాణ ప్రభుత్వం ఆర్‌బీఐ నిబంధనల మేరకు రాష్ట్ర ఖాతాలో కనీస రోజువారీ నిల్వ రూ.1.38 కోట్ల మేర ఉంచలేకపోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 17 రోజులకు మించి రాష్ట్ర ఖాతాలో కనీస నిల్వ లేదని కాగ్ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో ప్రత్యేక పరిస్థితుల్లో నగదు పేరిట 349 రోజుల్లో రూ.10,156 కోట్లు, 321

| సంవత్సరం | జీతాలు | వడ్డీ చెల్లింపులు | పెన్షన్లు (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2019-20 | 24,565 | 14,385 | 11,834 |
| 2020-21 | 24,770 | 16,841 | 13,599 |
| 2021-22 | 30,375 | 19,161 | 14,025 |
| 2022-23 | 30,963 | 21,821 | 15,816 |
| 2023-24 | 34,267 | 24,347 | 17,842 |

- ❖ రూ.1.38 కోట్లు కనీస నిల్వలు నిర్వహించిన రోజులు - 17
- ❖ కనీస నిల్వలు నిర్వహిస్తూ ప్రత్యేక డ్రాయింగ్ సౌకర్యం వినియోగించుకున్న రోజులు - 28
- ❖ ప్రత్యేక డ్రాయింగ్ సౌకర్యం అయిపోయాక చేబదులు కింద అడ్వాన్సులు తీసుకున్న రోజులు - 176
- ❖ ప్రత్యేక డ్రాయింగ్, అడ్వాన్సులు అయిపోయాక ఓవర్ డ్రాఫ్టు తీసుకున్న రోజులు - 145

రోజులు చేబదుళ్ల కింద రూ.52,517 కోట్లు ఆర్‌బీఐ నుంచి తీసుకుంది. 145 రోజుల పాటు ఓవర్‌డ్రాఫ్ట్ కింద రూ.35,425 కోట్లను ప్రభుత్వం వినియోగించుకుంది. వీటికి సంబంధించి ప్రభుత్వం ఆర్‌బీఐకి రూ.135.25 కోట్లను వడ్డీ రూపంలో చెల్లించాల్సివచ్చింది. 2024 మార్చి 31 నాటికి తీసుకున్న చేబదుళ్లు, అడ్వాన్సుల్లో రూ.1000 కోట్లు తిరిగి చెల్లించలేదు.

**బడ్జెట్ బయటి అప్పులతో ఆర్థిక భారం**

రాష్ట్ర బడ్జెట్‌లో చూపకుండా ప్రభుత్వ పూచీకత్తుతో బడ్జెట్ బయట తీసుకుంటున్న రుణాలతో తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం పడుతోందని కాగ్ స్పష్టంచేసింది. ప్రభుత్వం పూచీకత్తులో ప్రభుత్వరంగ సంస్థలు తీసుకుంటున్న రుణాలని బడ్జెట్‌లో చూపటం లేదని, 2024-25 బడ్జెట్ పత్రాల ప్రకారం అవి రూ.2,20,606.56 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. కానీ, బడ్జెట్ బయటి రుణాలు రూ.2302.72 కోట్లు మాత్రమేనంటూ రాష్ట్రప్రభుత్వం తెలిపింది. వాస్తవానికి రూ.2.20 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. వీటితో కలిపి ప్రభుత్వానికి ఉన్న మొత్తం అప్పులు రూ.6.17 లక్షల కోట్లుగా తేలింది. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ)లో ప్రభుత్వ అప్పుల విలువ మొత్తం 33.10 శాతానికి మించొద్దని 'తెలంగాణ మాధ్యమిక ఆర్థిక విధానం -2024' సీలింగ్ పెట్టింది. ప్రభుత్వరంగ సంస్థలు తీసుకున్న బడ్జెట్ వెలుపలి రుణాలను కలిపి చూస్తే 2024 మార్చి ఆఖరునాటికే జీఎస్డీపీలో అప్పుల విలువ 34.47 శాతానికి తేలినట్లు కాగ్ వివరించింది.

⇨ 2023-24 ఆర్థిక సంవత్సరం ఆఖరునాటికి ... బడ్జెట్ వెలుపల తీసుకున్న రూ.1.20 లక్షల కోట్లను చూపకుండా మొత్తం అప్పులు 2023-24 జీఎస్డీపీలో 26.41శాతం మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది.

⇨ 2022-23 మార్చి ఆఖరు వరకున్న బడ్జెట్ బయటి రుణాల మొత్తానికి, 2023-24 సంవత్సరం ఆరంభంలో చూపిన రుణాల మొత్తానికి మధ్య వ్యత్యాసం ఉందని, దీనికి కారణాన్ని ప్రభుత్వం వెల్లడించలేదని కాగ్ స్పష్టం చేసింది.

⇨ ప్రభుత్వం నేరుగా తీసుకునే రుణాలను బడ్జెట్‌లో ఏటా చూపుతుంది. 2023-24లో ఇలా నేరుగా రూ.49,618 కోట్లు ప్రభుత్వం తీసుకుందని కాగ్ తెలిపింది. వీటిని 7 శాతం నుంచి 7.75 శాతం వరకు వడ్డీతో 2030 నుంచి 2050 మధ్య సంవత్సరాల్లో తిరిగి చెల్లిస్తామనే ఒప్పందంతో సేకరించింది.

⇨ గతంలో తీసుకున్నవాటిపై వడ్డీ చెల్లింపుల భారం కూడా అధికంగా ఉంటోంది. ఉదాహరణకు పాత అప్పులపై వడ్డీలకు 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం రూ.24,341.43 కోట్లు చెల్లించినట్లు కాగ్ వివరించింది.

**కొన్ని శాఖలకు ఎడాపెడా ఖర్చు - కొన్నిటికి కోతలు**

తెలంగాణ ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో చేసిన కేటాయింపులకు మించి కొన్ని శాఖలకు ఎడాపెడా ఖర్చు చేయగా, కొన్ని శాఖలకు భారీ కోతలను విధించింది.

⇨ కొన్ని ప్రాజెక్టులకు సప్లిమెంటరీ, రివైజ్డ్ బడ్జెట్ పేరుతో బడ్జెట్‌లో తొలుత చేసిన కేటాయింపుల కన్నా ఎక్కువ నిధులు ఇచ్చింది. భారీ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి కేటాయింపులకన్నా రూ.19,270.06 కోట్లు అధికంగా ఖర్చుచేశారు. మూలధన పెట్టుబడి కన్నా వ్యయం పెరిగింది. వీటిలో కాళేశ్వరం సాగునీటి ఎత్తిపోతల కార్పొరేషన్, టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు ఉన్నాయి.

⇨ చిన్న నీటిపారుదల కేటాయింపుల్లో రూ.401.73 కోట్లు కోత పెట్టింది.

⇨ పబ్లిక్‌వర్క్స్ కి కేటాయించిన నిధులకన్నా రూ.353.42 కోట్లు తగ్గించింది.

⇨ జిల్లాల పరిధిలోని భారీ రహదారుల నిర్మాణం, కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి సంబంధించి రైల్వేశాఖకు చేయించిన డిపాజిట్లకు సంబంధించి నిధులను కుదించింది.

⇨ పంచాయతీరాజ్ శాఖకు (రుణాలు) బడ్జెట్‌లో రూ.4,383 కోట్లు కేటాయించగా ... రూ.193 కోట్లు మాత్రమే వ్యయం చేసింది. అంటే సుమారు 93 శాతం నిధులు విడుదల చేయలేదు.

**బడ్జెట్ బయట రుణాలను తీసుకున్న కొన్ని ముఖ్య సంస్థల వివరాలు (రూ.కోట్లు)**

| ప్రాజెక్టు / పథకం | పూచీకత్తు ఇచ్చిన మొత్తం | 2024, మార్చి 31 వరకూ తీసుకున్నది |
|---|---|---|
| కాళేశ్వరం కార్పొరేషన్ | 74,105.03 | 69,079.40 |
| నీటి వనరుల అభివృద్ధి సంస్థ | 14,526.71 | 13,460.93 |
| హైదరాబాద్ జలమండలి | 2,560.14 | 13,460.93 |
| విద్యుత్ ఆర్థిక సంస్థ | 2,130.40 | 2,143.18 |
| రాష్ట్ర అర్బన్ ఆర్థిక, మౌలిక సదుపాయల సంస్థ | 1,473.53 | 1583.44 |
| తాగునీటి సరఫరా సంస్థ | 21,643.60 | 19,294.22 |

# ఫేక్ న్యూస్ తో బుర్రలు ఖరాబు చేసుకోవద్దు




కడుపు ఖరాబైతే మెదడు ఖరాబవుతుంది, మెదడు ఖరాబైతే కడుపు ఖరాబవుతుంది.. ఈ రెండూ ఖరాబైతే మొత్తం శరీర ఆరోగ్యం ఖరాబవుతుంది అని డాక్టర్ నాగేశ్వరరెడ్డి లాంటి వైద్య నిపుణులు చెబుతున్నారు. 'గట్ హెల్త్ ' రాబోయే వైద్య విప్లవమని, కల్తీ లేని ఆహారానికి ప్రాధాన్యం రీత్యా 'ఫుడ్ ఈజ్ ద న్యూ మెడిసిన్, కిచెన్ ఈజ్ ద న్యూ ఫార్మసీ ' అని సూచిస్తున్నారు.. మరి మెదడుకి ఫుడ్ సంగతేంటి?

ఎదుటివారి గురించి చెడుని నమ్మాలనుకోవటం మానవ నైజం. ఈ మానసిక స్థాయిని అధిగమించాలంటే.. మంచి చదువు, హేతుబద్ధ బహిరంగ చర్చా ప్రమాణాలు, పటిష్ఠ చట్టబద్ధపాలన మొదలైనవి అవసరం. అవి రోజువారీ పాలనలో భాగం కాకముందే సోషల్ మీడియా వంటి సాధనాలు అందుబాటులోకి రావటంతో.. ముఖ్యంగా మనలాంటి దేశంలో మంచి కన్నా చెడు ఎక్కువగా జరుగుతోంది.

సరైన సమాచారం లేకుండానే ప్రతి విషయంపై అభిప్రాయాలు ఏర్పరచుకోవటం, విషయ పరిజ్ఞానం లేకుండా కేవలం ఆకర్షణీయంగా, ఆపకుండా మాట్లాడేసేవారి వీడియోల పట్ల ఆకర్షితులవటం, మళ్లీ కొన్ని రోజుల్లోనే వికర్షితులవ్వటం, తామే స్వయంగా సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు అవ్వాలని ఉవ్విళ్లూరటం..ఈ అస్తిత్వ సంక్షోభం సోషల్ మీడియాలో నకిలీ వార్తల వ్యాప్తికి దారితీస్తోంది.

ఇస్లాంకి తప్పుడు భాష్యం చెబుతూ చేసిన పహల్గాం ఇస్లామిస్ట్ ఉగ్రదాడి ఘటన తర్వాతి పరిణామాల్లో ఎన్ని ఫేక్ న్యూసో లెక్కలేదు. ఉగ్రవాదులు మత విశ్వాసం అడిగి మరీ పర్యాటకుల్ని కాల్చారు కాబట్టి.. పాక్ ఉగ్ర స్థావరాలపై భారత్ దాడి సమయంలో మన వాళ్లు కొందరు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. కానీ జ్యోతి మల్హోత్రా లాంటి వారిది ఏ మతం? అలాంటివారు సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లయి పాకిస్థాన్‌లో లాంటి ఉగ్రశక్తుల కుట్రలో భాగస్వాములు కావటం.. మనం నకిలీ, అర్ధ సత్య వార్తల్ని నమ్మటం, భావోద్వేగాలతో లైక్‌లు, కామెంట్లు, ఫార్వర్డ్‌లు చేయటం వల్ల కాదా?

నకిలీ వార్తలు ఎక్కువగా పెచ్చరిల్లే అవకాశమున్న ఉద్రిక్త పరిస్థితుల్లో సమాచారాన్ని ఫిల్టర్ చేసి, మంచిచెడుల విచక్షణను ప్రదర్శించాల్సిన సీనియర్ జర్నలిస్టులు కూడా యూట్యూబ్ వ్యూస్ ఆరాటంలో కొట్టుకుపోయి, పహల్గాం అమానుషం తర్వాత అబద్ధాల్ని అలవోకగా ప్రచారం చేశారు. ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ లాంటి వారి మీద కూడా ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే.. సమాజం, చివరికి తాము కూడా నష్టపోతామన్న స్పృహ కూడా లేకుండా, ఆయన చెప్పని అంశాల్ని థంబ్ నెయిల్స్ లో హెడ్డింగ్‌లుగా ఉపయోగించారు. ఇది జర్నలిజమా అని అలాంటివారు ఆలోచించుకోవాలి.

అదేవిధంగా, మనం కూడా ఆత్మావలోకనం చేసుకోవాలి. అబద్ధాల్ని, భావోద్వేగాల్ని, తాత్కాలిక ప్రయోజనాల్ని ప్రోత్సహిస్తూ మన నిజమైన ప్రయోజనాల్ని, భవిష్యత్తుని 'ఎందుకు' దెబ్బతీసుకుంటున్నామో ఆలోచించాలి. నకిలీ వార్తల వల్ల మన మెదడు, తద్వారా గట్ హెల్త్ చివరికి ఎంత దెబ్బతింటాయో ఎందుకు గుర్తించలేకపోతున్నాం?

కాలమిస్ట్ ఒకామె రాశారు- ఇదివరకు ఒక వార్తను నమ్మి నిజానిజాల్ని తేల్చుకునేవాళ్లం, కానీ పహల్గాం ఉదంతం తర్వాత.. ముందు అనుమానించి తర్వాత నిజానిజాల్ని తేల్చుకుంటున్నాం అని.నిరాశ అక్కర్లేదుగానీ, మనం మేలు కోవాలి. విచక్షణతో, హేతుబద్ధంగా స్పందించాలి. విశ్వసనీయ వ్యక్తుల సోషల్ మీడియా అకౌంట్లనే అనుసరించాలి, అది కూడా అఫిషియల్ ఖాతాల్ని! థంబ్ నెయిల్ హెడ్డింగ్‌లు చూసి మోసపోకుండా కంటెంట్ మొత్తం చూసి, నిజంగా జేపీ లాంటి వారు ఆ మాటలు చెప్పారో లేదో ధృవీకరించుకోవాలి.

**ఫేక్ న్యూస్ బారిన పడకుండా కాపాడుకుందాం..**

**సోషల్ మీడియాను సద్వినియోగం గావించుకుందాం.**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th June, 2025 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001





## Town Hall with JP

## 'లిటిల్ రిపబ్లిక్స్' పై జేపీ టౌన్‌హాల్

Coming Soon

Watch @

https://www.youtube.com/@JPLoksatta Official

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.